పుస్తక ప్రియులకు ఇదే మా ఆహ్వానం
38వ హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శన
తెలంగాణ కళాభారతి (ఎన్టీఆర్ స్టేడియం), హైదరాబాద్
డిసెంబర్ 19 నుండి 29 వరకు - మ॥ 1 నుండి రా॥ 9 వరకు
నవచేతన బుక్ హౌస్ స్టాల్ నం. 292 - 295
నవచేతన పబ్లిషింగ్ హౌస్ స్టాల్ నం. 339 - 344

www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
PRAJAPAKSHAM ★★

కొత్త జిఓతో జర్నలిస్టులకు ఎలాంటి నష్టం జరగదు 03
మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి

90 శాతం చర్చలు సఫలం
యుద్ధ ముగింపు దిశగా ఉక్రేన్ పరిణామాలు! 04

సంపుటి 09, సంచిక: 30 | శనివారం | 27-12-2025 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00



# హక్కులు హననం

## పోరాడి సాధించుకున్న హక్కులు, చట్టాలను రద్దుచేస్తున్న మోదీ ప్రభుత్వం

● తిరోగమన దిశగా ఎన్‌డిఎ సర్కార్ ● ప్రజలకోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన మహనీయుల ఆశయాలతో సిపిఐని మరింత ముందుకు తీసుకెళతాం ● ఎర్రజెండాలన్నీ ఏకమై ఒకే జెండాగా మారి ఎర్రకోటపై ఎగరేయాలి ● వక్తల ఉద్ఘాటన

మఖ్దూంభవన్‌లో అరుణపతాకాన్ని ఆవిష్కరించిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

ప్రజాపక్షం/హైదరాబాద్

ఎర్ర జెండాలన్నీ ఏకమై ఒకే జెండాగా మారి, ఆ జెండా ఢిల్లీలోని ఎర్రకోటపై ఎగరాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివ రావు అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ లేకపోతే ప్రస్తుతం అనుభవిస్తున్న చట్టాలు, హక్కులు ఉండేవే కాదని, కమ్యూనిస్టు పార్టీ లేకపోతే ప్రజలకు రక్షణ కవచం లేనట్టేనని స్పష్టం చేశారు. అనేక వీరోచిత పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను, చట్టాలను రద్దు చేస్తూ మోదీ ప్రభుత్వం తిరోగ మన దిశగా వెళ్తుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల కోసం పోరాడి తమ ప్రాణాలు అర్పించిన మహనీయుల ఆశయాలతో సిపిఐని మరింత ముందుకు తీసుకెళ్తామని కూనంనేని సాంబశివ రావు చెప్పారు. 'వందేళ్ల సిపిఐ ఆవిర్భావ దినోత్సవ సభ' సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ పతాకాన్ని కూనంనేని సాంబశివరావు ఆవిష్కరించారు. సభకు సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నర్సింహా అధ్యక్షత వహించగా, కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యదర్శులు తరువాయి 2లో

## ఘనంగా సిపిఐ వందేళ్ల ఉత్సవాలు

12



వరంగల్ నగరంలో సిపిఐ శతవార్షికోత్సవాల భారీ ర్యాలీ

ఎర్రజెండా అంటే

## బిజెపికి వణుకు : పల్లా



ప్రజలను చైతన్యం చేసే శక్తి ఎర్రజెండాకు ఉన్నదని, అందుకే ఎర్రజెండాను చూసి బిజెపి వణికిపోతున్నదని, ఎర్ర జెండా కనిపించొద్దనే ఎజెండాతో బిజెపి పని చేస్తున్నదని పల్లా వెంకటరెడ్డి విమర్శించారు. భారత కమ్యూనిస్టు పార్టీయే దేశంలో మొట్టమొదటిగా ఏర్పడిన రాజకీయ పార్టీ అని తరువాయి 2లో

ఖమ్మంలో.. చరిత్ర ఎరగని రీతిలో

## జనవరి 18న బహిరంగ సభ

చరిత్రలో కనీవిని ఎరగని రీతిలో సిపిఐ వందేళ్ల ఉత్సవాల సందర్భంగా జనవరి 18న ఖమ్మంలో భారీ బహిరంగ సభను నిర్వహించి, కమ్యూనిజాన్ని అంతమొందించలేరని నిరూపిస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. కమ్యూనిస్టులు ఎక్కడ అని అనే వారికి కనువిప్పు కలిగే విధంగా ఎర్ర సముద్రాన్ని తలపించేలా లక్షలాది మందితో ఖమ్మం 'బహిరంగ సభ'ను నిర్వహించనున్నట్టు వెల్లడించారు. హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో శుక్రవారం ఆయన తరువాయి 2లో

ఫోన్ ట్యాపింగ్ కేసు

## మస్తాన్‌ను విచారించిన సిట్

ప్రజాపక్షం/హైదరాబాద్

ఫోన్ ట్యాపింగ్ కేసులో సెఫాలజిస్ట్ ఆరా మస్తాన్‌ను సిట్ శుక్రవారం విచారించింది. రెండున్నర గంటల పాటు మస్తాన్‌ను విచారించిన ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) అధికారులు రెండో సారి ఆయన స్టేట్‌మెంట్ నమోదు చేశారు. విచారణ అనంతరం ఆరా మస్తాన్ మీడియాతో మాట్లాడుతూ.. గతంలో తాను చెప్పిన వివరాలనే సిట్ అధికారులు మళ్లీ అడిగారని, తనకు తెలిసిన అన్ని అంశాలను సిట్ అధికారులకు చెప్పానన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు ప్రభాకర్ రావు వెల్లడించిన అంశాలను క్రాస్ చెక్ చేసుకునేందుకే తనను మరోసారి అధికారులు విచారణకు పిలిచారని తెలిపారు. సిట్ అధికారులు తన ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన డేటాను తన ముందే ఉంచారని, ఆ డేటా ప్రకారం 2020 నుంచే తన రెండు ఫోన్లు ట్యాప్ అయినట్లు పేర్కొన్నారని ఆయన చెప్పారు. ముఖ్యమైన సాక్షులను సిట్ విచారిస్తోందని, ఉన్నత స్థాయి అధికారులతో సిట్ ఏర్పాటు చేయడంతో దర్యాప్తు తుది దశకు చేరుకుందని అభిప్రాయపడ్డారు. వారం రోజుల్లో మళ్లీ విచారణకు పిలిచే అవకాశముందని తెలిపారు.

## లీగల్ అకాడమీ ఉండాల్సిందే




● ఎఐ, సైబర్ నేరాలపై శిక్షణ అవసరం ● న్యాయవాదులు ఎప్పటికప్పుడు కఠోరమైన తర్ఫీదు పొందాలి ● సరికొత్త పంథాలో నేరస్తులు సవాళ్లు విసురుతున్నారు ● ఇది రానురాను మరింత జటిలం కావొచ్చు ● చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ ఆందోళన

**పనాజి :** కృత్రిమ మేధ, సైబర్ నేరాలవల్ల దేశానికి ఎదురవుతున్న సమస్యలు పరిష్కరించడంలో న్యాయవాదులకు శిక్షణ ఇవ్వడానికి జాతీయస్థాయిలో ఒక లీగల్ అకాడమీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. సైబర్ నేరాలకు సంబంధించిన వృత్తిపరమైన సాధనాలు సమకూర్చుకుని న్యాయవాదులు ఎప్పటికప్పుడు కఠోరమైన శిక్షణ పొందాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. ఒకరోజు లేదా రెండు రోజుల శిక్షణ సరిపోదు, కనీసం రెండునెలలైనా శిక్షణ పొందాల్సి ఉంటుందని అన్నారు. మధ్యవర్తిత్వం అనే అంశంపై శుక్రవారం పనాజీలో జరిగిన సదస్సులో ఆయన జాతీయ అకాడమీ ఏర్పాటు ఆవశ్యకతను పదే పదే ఉద్ఘాటించారు. దక్షిణగోవాలోని 'ఇండియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్–రీసెర్చ్'లో మధ్యవర్తిత్వం అనే అంశంపై న్యాయవాదుల మండలి నిర్వహించిన జాతీయ సదస్సు–చర్చావేదిక ప్రారంభ సమావేశంలో ఆయన ప్రసంగించారు. "ఇప్పుడు మనం కృత్రిమ మేధ యుగంలోకి ప్రవేశించాం, న్యాయవాదుల వేదికకు సహకరించడంలో ఇది చాలా శక్తిమంతమైన సాధనం, కానీ తరువాయి 2లో

అర్థరహిత విమర్శలకూ

## హద్దుండాలి

● ప్రజారంజక పాలనతో కెసిఆర్‌కు గుబులు
● రెండేళ్ల తరువాత ఫాంహౌస్ నుంచి బయటకు వచ్చి వ్యంగ్య విమర్శలు
● మంత్రులు గడ్డం వివేక్, పొన్నం ప్రభాకర్ మండిపాటు



ప్రజాపక్షం/గజ్వేల్

మాజీ సిఎం కెసిఆర్ చేస్తున్న వ్యంగ్య విమర్శలను ప్రజలు క్షమించరని, అర్థరహిత విమర్శలకు కూడా హద్దంటూ ఉండాలని మంత్రులు గడ్డం వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తూంకుంట అంక్షా రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన నూతన సర్పంచ్‌ల ఆత్మీయ సమ్మేళనం, సన్మాన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలో సిఎం రేవంత్ రెడ్డి చేపడుతున్న ప్రజా రంజక పాలనతో చక్కటి ఫలితాలు రాగా, గుబులు పుట్టిన కెసిఆర్ ఫాం హౌస్ వీడినట్లు ఎద్దేవా చేశారు. సర్పంచ్ ఎన్నికల్లో లక్షకుపైగా ఓట్లు సాధించిన కాంగ్రెస్ అభ్యర్థులు కెసిఆర్‌ను నైతికంగా ఓడించినట్లు స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేని దరిద్రపు భాషను ప్రవేశపెట్టిన కెసిఆర్ ఇంకా తన పద్ధతి మార్చుకోవడం లేదని ఎద్దేవా చేశారు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న చారిత్రాత్మక పథకాలైన ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం తరువాయి 2లో

హెచ్–1బి వీసా ఇంటర్వ్యూలు రద్దు

## భారత్ ఆందోళన

● ఆటంకాలు తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం జోక్యం
● అమెరికా దృష్టికి దరఖాస్తుదారుల ఫిర్యాదులు
● ఎంఇఎ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడి




**న్యూఢిల్లీ:** హెచ్1బి వీసాల ఇంటర్వ్యూల ముందస్తు షెడ్యూలును రద్దు చేయడంపై అమెరికాకు భారత ప్రభుత్వం తన ఆందోళన తెలియజేసింది. భారీసంఖ్యలో ఉన్న భారత దరఖాస్తుదారులు, కుటుంబాలు ఎదుర్కొంటున్న ఆటంకాలను కొంతమేరకైనా తొలగించేందుకు ప్రభుత్వం క్రియాశీలంగా వ్యవహరిస్తున్నట్లు విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ శుక్రవారం మీడియాకు చెప్పారు. ఇంటర్వ్యూ తరువాయి 2లో

# వచ్చే శతాబ్దంలోకి ఎర్రజెండాను సగర్వంగా తీసుకెళదాం!

## శతాబ్దకాలపు రాజకీయ కార్యాచరణను సమీక్షించుకుందాం ! సమానత్వం, లౌకికత, న్యాయం పునాదులపై దేశాన్ని పునర్నిర్మాణం చేద్దాం!!



డి. రాజా
సిపిఐ ప్రధాన కార్యదర్శి

2025 డిసెంబర్ 26వ తేదీన భారత కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ) 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ శతాబ్ది కేవలం ఒక రాజకీయ పార్టీకి సంబంధించిన అంశం మాత్రమే కాదు. ఇది భారత దేశ స్వాతంత్ర్య పోరాటానికి రూపాన్నిచ్చిన ఒక ఉధృత ఉద్యమం, దేశ భవిష్యత్తు కోసం ముందు చూపును, సామాజిక, ఆర్థిక దార్శనికతను ప్రతిబింబించే చారిత్రక ఘట్టం. తన తొలినాళ్ళలోనే చారిత్రక కాన్పూర్ సమావేశానికి ఆహ్వాన సంఘానికి అధ్యక్షుడుగా ఉన్న మౌలానా హస్రత్ మోహని రూపొందించిన 'ఇంక్విలాబ్ జిందాబాద్' అనే విప్లవ నినాదానికి సిపిఐ గొంతును అందించింది. ఆ నినాదాన్ని భగత్ సింగ్, ఆయన సహచరులు అమరత్వాన్ని అందించారు. కమ్యూనిస్టు కార్యకర్తల ద్వారా, విప్లవాత్మక పరివర్తన కోసం ఈ నినాదం దేశంలోని ప్రతి మూలకు పయనించి, ప్రతిఘటన, ఆశ, దేశభక్తికి సజీవ వ్యక్తీకరణగా మారింది. వలస పాలనతో సంఘర్షిస్తూ సిపిఐ ఆవిర్భవించింది. జాతీయ ఉద్యమం ఎదుర్కొంటున్న ఎవరికి, ఎందుకు కోసం స్వాతంత్ర్యం అనే ప్రాథమిక ప్రశ్నకు సమాధానం కోసం ప్రయత్నించింది. సామాజిక, ఆర్థిక పరివర్తన లేకుండా రాజకీయ స్వాతంత్ర్యం ప్రజలను పాత, కొత్త రూపాల్లో దోపిడీలో చిక్కుకుపోయేలా చేస్తుందని సిపిఐ శతాబ్ద కాలంగా నిరంతరం వాదిస్తున్నది. వలసవాద పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా సిపిఐ చేసిన రాజీలేని పోరాటంలో దాని చారిత్రక మూలాలు ఉన్నాయి. బ్రిటిష్ సామ్రాజ్యవాదం భారతదేశ ఆర్థిక వ్యవస్థను విదేశీ మూలధన పెట్టుబడి అవసరాలకు కట్టబెట్టి, స్వదేశీ పరిశ్రమలను నాశనం చేసింది. దోపిడీ భూసంబంధాలను మోపింది. పేదరికాన్ని విస్తరించింది. అదే సమయంలో, అది ఆధునిక కార్మికవర్గాన్ని సృష్టించి, భారతీయ విప్లవకారులను ప్రత్యేకించి 1917 రష్యన్ విప్లవం తర్వాత ప్రపంచ సోషలిస్ట్ ఆలోచనల తరువాయి 2లో




> సిపిఐ రెండవ శతాబ్దంలోకి అడుగుపెడుతున్న సమయంలో భారతదేశం తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటుంది. మతతత్వం, పెరుగుతున్న ఫాసిజం గణతంత్ర పునాదులకు ముప్పుగా మారాయి. ఆర్థికాభివృద్ధికి తీవ్ర నిరుద్యోగం, అనిశ్చితి, విస్తృతమవుతున్న అసమానతలు తోడయ్యాయి.

> మన ముందున్న కర్తవ్యం స్పష్టంగా ఉంది. వ్యవస్థల్లో క్షీణ ప్రభావాన్ని ప్రక్షాళన చేయడం, గణతంత్రాన్ని తిరిగి సాధించడం, సమానత్వం, లౌకికవాదం, న్యాయం పునాదులపై భారతదేశాన్ని పునర్నిర్మించడం.



అజయ్ భవన్‌లో పార్టీ పతాకాన్ని శుక్రవారం ఆవిష్కరించిన డి.రాజా



# ప్రపంచం
WORLD NEWS

## కెనడాలో భారత వైద్య విద్యార్థి కాల్చివేత

**టొరంటో:** కెనడాలో భారత వైద్యవిద్యార్థి కాల్పుల్లో మరణించారు. టొరంటోలోని స్కార్బరో యూనివర్సిటీ క్యాంపస్ సమీపంలో వైద్యవిద్యార్థి కాల్పుల్లో మరణించారు. మృతుణ్ణి శివాంక్ అవస్థిగా గుర్తించారు. అతడి వయసు ఇరవై సంవత్సరాలు. మంగళవారం మధ్యాహ్నం దాటాక 3.30 గంటలకు ఈ ఘటన జరిగినట్లు కెనడా బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ ప్రకటించింది. ఒకవ్యక్తి నదవి వెతుకుతుండగా భారత విద్యార్థి కాల్పులకు గురై రోడ్డు మీద పడి ఉండటాన్ని గుర్తించారు. వెంటనే పోలీసులకు తెలియజేశారు. ఓల్డ్ కింగ్‌స్టన్ రోడ్‌లో ఘటన జరిగింది. ఘటనాస్థలంలో సాక్ష్యాలకోసం పోలీసులు పరిశీలిస్తున్నారు. ఇదిలా ఉండగా టొరంటోలోని భారత కాన్సులేట్ కార్యాలయం వైద్య విద్యార్థి హత్య ఘటనపట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. మృతుడి కుటుంబంతో కాన్సులేట్ కార్యాలయం సంభాషణలు చేస్తోంది. వారికి పూర్తి సహకారం అందించి అండగా ఉంటామని ఎక్స్ వేదికగా కాన్సులేట్ కార్యాలయం ప్రకటించింది. కాల్పుల ఘటన వార్త తెలిసిన వెంటనే యూనివర్సిటీలో విషాదఛాయలు అలుముకున్నాయి. టొరంటో యూనివర్సిటీ వెంటనే విద్యార్థులందరూ జాగ్రత్తగా ఉండాలని ఒక నోటీసు జారీ చేసింది.

## బంగ్లాదేశ్‌లో మరో మైనార్టీ హిందూ హత్య

ఇది విద్వేష హత్య కాదు : యూనుస్

**ఢాకా/న్యూఢిల్లీ:** బంగ్లాదేశ్‌లో మరో మైనార్టీ హిందువును స్థానికులు కొట్టి చంపారు. పంగ్షా ఉపజిల్లాలోని రాజ్‌బరి టౌన్‌లో బుధవారం ఈ ఘటన జరిగిందని పోలీసులు చెప్పారు. హతుణ్ణి అమృత్ మండల్‌గా గుర్తించారు. ఐతే అమృత్ మండల్ ఒక నేరస్థుల ముఠాను ఏర్పాటు చేసి వారిని పెంచిపోషిస్తున్నాడని, దోపిడీలకు, బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నాడని అతడిపై ఆరోపణలు చేసి కొట్టి చంపారు. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారు మహ్మద్ యూనుస్ ఈ హత్య ఘటనను తీవ్రంగా ఖండించారు. ఇది హిందూ మైనార్టీలపై మతోన్మాద దాడి కాదని సమర్థించారు. బంగ్లాదేశ్ ప్రభుత్వం అక్రమ చర్యలను, దోపిడీలను, హింస, మతోన్మాదాలను సహించబోదని ఆయన అన్నారు. బుధవారం అమృత్ మండల్‌ను ఆయనతోపాటు వ్యక్తులపై స్థానికులు దాడి చేశారు. ఒక ఇంట్లోకి దొంగలు డబ్బులు ఇవ్వాలని బలవంతపు వసూళ్లకు తెగబడ్డాడని అతడిపై ఆరోపణలు వచ్చాయి. స్థానికులు దాడి చేస్తున్న విషయం తెలియగానే పోలీసులు అక్కడికి చేరుకున్నారు. తీవ్రగాయాలతో ఉన్న మండల్‌ను పోలీసులు మధ్యాహ్నం రెండు గంటలకు ఆసుపత్రికి తరలించారు. ఐతే అప్పటికే మరణం చెందినట్లు వైద్యులు చెప్పారని పంగ్షా సర్కిల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ దెబ్రత సర్కార్ చెప్పారు.

**భారత విదేశీ మంత్రిత్వశాఖ తీవ్ర ఆందోళన**

బంగ్లాదేశ్‌లో మైనారిటీ మతస్థులపై నిరంతర శత్రుత్వం, దాడులు కొనసాగడంపై భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ (ఎంఇఎ) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. హింసాత్మకమైన, మతోన్మాద దాడులు విరామం లేకుండా కొనసాగుతున్నాయని పేర్కొంది. ఎంఇఎ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ శుక్రవారం పాత్రికేయులతో మాట్లాడుతూ పొరుగుదేశంలో మైనారిటీ వర్గాలపై తీవ్ర విద్వేషం, శత్రుత్వ చర్యలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని, భారతకు సమస్యగా ఉందని అన్నారు. మైమెన్‌సింగ్‌లో హిందూ కార్మికుడు దీపు చంద్ర దాస్ (27) హత్య, దహన ఘటనలకు కారకులైన వారిని చట్టం ముందు నిలబెట్టి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్‌లో నిత్యం జరుగుతున్న పరిణామాలను భారత ప్రభుత్వం చాలా సునిశితంగా పరిశీలిస్తోందని చెప్పారు. ఆ దేశంలో మహ్మద్ యూనుస్ ప్రభుత్వ హయాంలో ఇప్పటివరకు మైనారిటీలకు వ్యతిరేకంగా 2,900 ఘటనలు జరిగాయి. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న మత విద్వేషం, దాడులను 'మీడియా చిన్న విషయాన్ని పెద్దదిగా చూపిస్తోంది' అనే పేరుతో పక్కకు తోసేయడానికి వీల్లేదని రణధీర్ జైస్వాల్ అన్నారు. బంగ్లాదేశ్‌తో శాంతి, సుస్థిరతలతోకూడిన రెండు పొరుగుదేశాల ప్రజల మధ్య సన్నిహిత సంబంధాలను భారత్ కోరుకుంటున్నదన్నారు. బంగ్లాదేశ్‌లో ఫిబ్రవరిలో జరిగే ఎన్నికలు స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా, సజావుగా జరిగేందుకు భారత్ పూర్తి మద్దతు ఇస్తుందన్నారు.


## నైజీరియాలో క్రిస్మస్ రోజు ఐఎస్‌పై అమెరికా దాడులు

పలువురు ఉగ్రవాదులు మృతి



**అబుజా:** పశ్చిమ ఆఫ్రికాదేశం నైజీరియాలో ఐఎస్ఐఎస్ (ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియా) ఉగ్రవాదులపై క్రిస్మస్ పర్వదినాన గురువారం అమెరికా క్షిపణులతో దాడులు చేసింది. ఈ దాడుల్లో అనేకమంది ఐఎస్ ఉగ్రవాదులు మరణించారు. వాయువ్య నైజీరియాలో అమెరికా సైన్యం క్షిపణులతో దాడులు చేసిందని నైజీరియా ప్రభుత్వం కూడా ధృవీకరించింది. వ్యూహాత్మక సహకారంతో ఈ దాడులు చేసినట్లు నైజీరియా విదేశీమంత్రిత్వశాఖ రాజధాని అబుజాలో విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. అనేక దశాబ్దాలుగా అమెరికా విదేశాలలో యుద్ధాల్లో మునిగితేలుతోంది, ఈ పరిస్థితి నుండి దేశాన్ని బయట పడేస్తామని, ఎవరి వ్యవహారాల్లో జోక్యం చేసుకునేది లేదని 2024 అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో చేసిన వాగ్దానాన్ని ట్రంప్ ఈ తాజా దాడులతో మరోసారి ఉల్లంఘించారు. దీనిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం కూడా ఒక ప్రకటన చేస్తూ నైజీరియా ప్రభుత్వం చేసిన విజ్ఞప్తి మేరకే ఈ దాడులు చేసినట్లు పేర్కొంది. కానీ ట్రంప్ చాలా రోజులుగా నైజీరియాలో ఐఎస్ఐఎస్ ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేస్తామని సోషల్ మీడియా ద్వారా హెచ్చరికలు చేస్తూ వచ్చారు. నైజీరియా పత్రికలు కూడా ఈ వార్తలను చాలా ప్రముఖంగా ప్రచురిస్తూ వచ్చాయి. నైజీరియాలో క్రైస్తవులపై ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులు ఎడతెగని దాడులు చేస్తూ వారి మనుగడను సవాలు చేస్తున్నారని, వారి స్థావరాలను ధ్వంసం చేయక తప్పదని ట్రంప్ గతంలో చేసిన ప్రకటనలను నైజీరియా పత్రికలు తాజాగా గుర్తుచేస్తున్నాయి. అనేక కవరేజీలతోపాటు ట్రంప్ నైజీరియా ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ వచ్చారు. నైజీరియాలో క్రైస్తవులపై ఇస్లామిక్ ఉగ్రవాదుల దాడులను అరికట్టడంలో ప్రభుత్వంవిఫలమైందని ట్రంప్ విమర్శిస్తూ చివరకు ఉగ్రవాదులపై దాడులు చేసేందుకు ఆదేశాలు జారీ చేశారు. ఇటీవలి సంవత్సరాలలో ఇంకా చెప్పాలంటే శతాబ్దాల చరిత్రలో ఎన్నడూలేనిరీతిలో నైజీరియాలో క్రైస్తవులపైదాడులు పెరిగిపోయాయని, అమాయకులైన క్రైస్తవులను ఇస్లామిక్ ఉగ్రవాదులు హతమారుస్తున్నారని, వారికి గుణపాఠం చెప్పేందుకే దాడులు చేసినట్లు వైట్‌హౌస్ ప్రకటించింది.

## హోండూరాస్ అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ విధేయుడు నస్రీ అస్ఫురా గెలుపు



**తెగుసిగల్ప:** సెంట్రల్ అమెరికా దేశం హోండూరాస్ అధ్యక్ష ఎన్నికల్లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బహిరంగంగా మద్దతు ఇచ్చిన ఆయన విధేయుడు నస్రీ జుయాన్ అస్ఫురా జెల్హాహ్ (67) విజయం సాధించారు. కానీ ఆ దేశ కాంగ్రెస్ అధ్యక్షుడు లూయిస్ రెడోండో సోషల్ మీడియాలో పోస్టింగ్ పెడుతూ ఈ ఎన్నికల ఫలితాలు పూర్తిగా చట్టవిరుద్ధం, న్యాయవిరుద్ధమని విమర్శించారు. నెలరోజుల క్రితం పోలింగ్ జరిగింది. సాంకేతిక కారణాల రీత్యా రెండుసార్లు కౌంటింగ్ వాయిదా పడింది. ఐతే ఈ ఫలితాలను పట్టికలో ఉండడానికి ఒక ప్రైవేటు కంపెనీకి బాధ్యతలు అప్పగించామని, వారివల్లే తీవ్ర జాప్యం జరిగిందని ఎన్ఇసి (నేషనల్ ఎలక్టోరల్ కౌన్సిల్) అధ్యక్షురాలు అనాపోవాల హాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రియల్‌టైమ్ ఫలితాలను ప్రదర్శించే పోర్టల్ క్రాష్ అవ్వడంతో ఫలితాల ప్రకటన నిలిచిపోయిందన్నారు. ఈ సందర్భంగాఅమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో ఒక ప్రకటన చేస్తూ, హోండూరాస్‌లో ఉన్న అన్ని రాజకీయపార్టీలు ఎన్నికల సంఘం తీర్పును గౌరవించాలని, అప్పుడే శాంతియుత వ్యవస్థతులలో అధికార మార్పిడి సాధ్యం అవుతుందని ఉద్బోధించారు. 1940వ దశకంలో ఇజ్రాయెలీ–అరబ్ సంఘర్షణ సమయంలో సెంట్రల్ అమెరికాకు వలస వచ్చిన క్రిస్టియన్ పాలస్తినా కుటుంబానికి చెందిన అస్ఫురా 2026 జనవరి 27వ తేదీన ఆయన అధ్యక్ష పదవీ బాధ్యతలు తీసుకుంటారు. కన్జర్వేటివ్ నేషనల్ పార్టీ (సిఎన్‌పి)కి చెందిన అస్ఫురాకు 40.27 శాతం ఓట్లు లభించాయి. అధికార లిబరల్ పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిగా పోటీ చేసిన సాల్వదార్ నస్రల్ల (72)కు 39.53 శాతం ఓట్లు లభించాయి. నేషనల్ ఎలక్టోరల్ కౌన్సిల్ (ఎన్ఇసి) అస్ఫురాను విజేతగా ప్రకటించింది. నవంబరు 30వ తేదీన హోండూరాస్‌లో అధ్యక్ష పదవికి ఎన్నికలు జరిగాయి. దీంతో పాటే 128 మంది సభ్యులున్న నేషనల్ కాంగ్రెస్‌కు, సెంట్రల్ అమెరికన్ పార్లమెంటులో 20 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. లాటిన్ అమెరికా దేశాలపై ట్రంప్ తన ప్రభావం చూపిస్తూ ఉండటంతో ఇటీవలికాలంలో ఈ ప్రాంతంలో జరుగుతున్న ఎన్నికల్లో ట్రంప్ అనుకూల మితవాదపార్టీ నాయకులే వరస విజయాలు సాధిస్తున్నారు. చిలీలో కూడా ట్రంప్ మద్దతు ఇచ్చిన పచ్చి మితవాది జోస్ ఆంటోనియో కాస్ట్ అధికారంలోకి వచ్చారు. దశాబ్దాలుగా అధికారంలో ఉన్న కమ్యూనిస్టు పాలనకు ట్రంప్ తెరదించారు. శాన్‌ఫ్రాన్సిస్కోలో హైస్కూలు విద్యాభ్యాసం చేసిన అస్ఫురా హోండూరాస్ యూనివర్సిటీలో సివిల్ ఇంజనీరింగ్ పూర్తిచేశారు. మొదట ఒక మున్సిపల్ ప్రాసిక్యూటర్‌కు అసిస్టెంట్‌గా పనిచేశారు. తర్వాత మేయర్ నారా మెల్గార్‌కు సహాయకుడుగా పనిచేశారు. 2010 2014 వరకు నేషనల్ కాంగ్రెస్ సభ్యుడుగా ఉన్నారు. 2014 2022 వరకు దేశరాజధాని తెగుసిగల్ప మేయర్‌గా పనిచేశారు. 2020లో ఆయన అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు. 2021లో నేషనల్‌పార్టీ తరపు దేశాధ్యక్షుడిగా పోటీచేసి ఓడిపోయారు. 2025లో మరోసారి పోటీచేసి ట్రంప్ మద్దతుతో విజయం సాధించారు.

# ఎర్రజెండాను సగర్వంగా తీసుకెళదాం!

(మొదటి పేజీ తరువాయి)

స్రవంతులకు చేరువయ్యేలా చేసింది. విదేశాలలో మార్క్సిజంకు దగ్గరైన లేదా అంతర్జాతీయ నెట్‌వర్క్‌ల ద్వారా సన్నిహితమైన భారతీయ కార్యకర్తలు, విప్లవకారులు జాతీయ విముక్తి, సామాజిక చైతన్యం విడదీయరానివని గ్రహించడం ప్రారంభించారు. ఈ అవగాహనే 1925 డిసెంబర్‌లో కాన్పూర్‌లో సిపిఐని స్థాపించే విధంగా సంస్థాగత రూపంలోకి పరిణతి చెందింది.

**మార్క్సిస్టు సిద్ధాంతం, భారతీయ వాస్తవాలు**

మార్క్సిస్టు సిద్ధాంతం, భారతీయ వాస్తవికతల మూలాలు కలిగిన విప్లవాత్మక పార్టీని నిర్మించడానికి కట్టుబడి ఉన్న విప్లవకారులు, కార్మిక సంఘాలు, సామ్రాజ్యవాద వ్యతిరేక కార్యకర్తలను కాన్పూర్ సమావేశం ఒకచోటకు చేర్చింది. వలస పాలనకు వ్యతిరేకంగా పోరాటంలో సిపిఐ పాత్ర రాజీలేనిది, అత్యంత దేశభక్తితో కూడుకున్నది. సామ్రాజ్యవాద శక్తితో సర్దుబాటు కోరుకునే జాతీయవాద సమూహాల మాదిరిగా కాకుండా, కమ్యూనిస్టులు వలసవాదాన్ని రాజకీయ ఆధిపత్యం ద్వారా ఆర్థిక దోపిడీని కొనసాగించే వ్యవస్థగా అర్థం చేసుకున్నారు. వారు ట్రేడ్ యూనియన్ పోరాటాలు, రైతు ఉద్యమాలు, అజ్ఞాత జీవితం నుంచి ప్రతిఘటన, సైద్ధాంతిక పోరాటాల రూపాలలో బ్రిటిష్ పాలనపై పోరాడారు. వారి దేశభక్తి ఉన్నత వర్గాల చర్చలలో కాకుండా, సామాన్య భారతీయుల జీవితాలు, పోరాటాలలో పాతుకుపోయింది. సిపిఐ అత్యంత ముఖ్యమైన ఘనతలో ఒకటి ప్రజా సంఘాల నిర్మాణానికి ప్రాధాన్యతనివ్వడం. సమాజాన్ని దానిలోని వైవిధ్యాలతో సమీకరించకుండా రాజకీయ విముక్తి సాధించలేమని పార్టీ గుర్తించింది. ఇది ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎఐటియుసి), ఆల్ ఇండియా కిసాన్ సభ (ఎఐకెఎస్), ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్(ఎఐఎస్‌ఎఫ్), ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్(పిడబ్ల్యుఎ), ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఇప్టా) వంటి సాంస్కృతిక, రచయితల సంస్థలు, లేదా అనంతరకాలంలో మహిళలు, యువజన సంఘాలు వంటి వేదికలను నిర్మించడానికి, బలోపేతం చేయడానికి సహాయపడింది. ఈ పొందికల ద్వారా కార్మికులను, రైతులను, విద్యార్థులను, మేధావులను, కళాకారులను సిపిఐ ఉమ్మడి పోరాటాల చుట్టూ ఏకం చేసింది. ప్రజా పోరాటాల ద్వారానే కమ్యూనిస్టు రాజకీయాలు లోతైన మూలాలను కలిగి ఉన్నాయి. భూమి, ఆత్మగౌరవం కోసం జరిగిన చారిత్రక పోరాటాలకు సిపిఐ నాయకత్వం వహించింది. భూస్వామ్య అణచివేతకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటం, బెంగాల్‌లో రైతులకు తమ ఉత్పత్తులపై హక్కులను దఖలు పరిచిన తెభాగ ఉద్యమం, భూస్వామ్య నిరంకుశత్వానికి వ్యతిరేకంగా కేరళలో పున్నప్ర–వయలార్ పోరాటం, తంజావూర్ డెల్టా, మిలిటెంట్ భూపోరాటాలు ఉన్నాయి. అలాగే కాన్పూర్, బొంబాయి, కలకత్తా, పుదుచ్చేరి వంటి పారిశ్రామిక కేంద్రాలలో, కమ్యూనిస్టు నాయకత్వంలో ట్రేడ్ యూనియన్ ఉద్యమం కార్మికుల హక్కులు, వేతనాలు, గౌరవాన్ని కాపాడుతూ ప్రధాన కార్మిక విజయాలను సాధించింది.

సిపిఐ జాతీయ పోరాట ఎజెండాను నిర్ణయాత్మకంగా సమూలంగా మార్చింది. రాజీ మార్గంగా అధినివేశ ప్రతిపత్తి (డొమినియన్ స్టేటస్) గురించి చర్చించబడుతున్న సమయంలో, కమ్యూనిస్టులు సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం పట్టుబట్టారు. రాజ్యాంగ పరిషత్తు కోసం తొలినాళ్ళలోనే, అత్యంత స్థిరంగా డిమాండ్ చేసిన వారిలో వారు ఉన్నారు. ప్రజలచే ఎన్నుకోబడిన సర్వసత్తాక సంస్థ మాత్రమే ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని రూపొందించగలదని వాదించారు. ఈ డిమాండ్ తరువాత భారతదేశం స్వాతంత్ర్యం కోసం పరివర్తన చెందడానికి మూలంగా మారింది. భూ సంస్కరణలు, కార్మిక హక్కులు, సామాజిక సమానత్వం లేని స్వాతంత్ర్యం కేవలం విదేశీ పాలకులను స్వదేశీ ఉన్నత వర్గాలతో భర్తీ చేస్తుందని వాదిస్తూ, పార్టీ స్వాతంత్ర్య పోరాటానికి కేంద్రంగా నిర్మాణాత్మక సంస్కరణలను ఉంచింది.

కమ్యూనిస్టు నేతృత్వంలోని ఉద్యమాల ద్వారానే భూమి పునఃపంపిణీ, భూస్వామ్యవ్యవస్థ రద్దు, కౌలుదారుల రక్షణ, ట్రేడ్ యూనియన్ హక్కులు, కనీస వేతనాలు, సామాజిక భద్రతలను జాతీయ ఎజెండాలోకి ప్రవేశపెట్టారు. కులాన్ని సాంస్కృతిక అవశేషంగా కాకుండా వర్గ దోపిడీతో లోతుగా ముడిపడి ఉన్న భౌతిక వ్యవస్థగా గుర్తించి, సిపిఐ వర్గరహిత, కులరహిత ప్రపంచం దృక్పథాన్ని స్పష్టంగా వ్యక్తీకరించింది. కుల అణిచివేతను ఆర్థిక వ్యవస్థలకు అనుసంధానించడం ద్వారా పార్టీ సామాజిక న్యాయం అనే అర్థాన్ని విస్తృతం చేసి, స్వాతంత్ర్య పోరాటానికి పరివర్తన కలిగించే సారాంశాన్ని అందించింది. ఈ డిమాండ్‌లలో చాలా వరకు రాజ్యాంగంలో, స్వాతంత్ర్యానంతర విధానపరమైన చర్చల్లో ప్రతిబింబించాయి. 1947లో స్వాతంత్ర్యం సిపిఐ పోరాటాన్ని ముగించలేదు. భూస్వామ్య వ్యవస్థలను కూల్చివేయడం, గుత్తాధిపత్య పెట్టుబడిదారీ విధానాన్ని నిరోధించడం, ప్రజాస్వామ్యాన్ని వేళ్ళూనుకునేలా చేయడంపై దృష్టి సారించిన కొత్త దశకు ఇది నాంది పలికింది. భూస్వామ్య వ్యతిరేకంగా చారిత్రాత్మక రైతు పోరాటాలకు పార్టీ నేతృత్వం వహించింది. అలాగే కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, త్రిపుర, బిహార్ వంటి రాష్ట్రాలలో భూ సంస్కరణలను ముందుకు తీసుకెళ్లడంలో నిర్ణయాత్మక పాత్ర పోషించింది. పార్లమెంటరీ, పార్లమెంటేతర రంగాలలో, సిపిఐ ఆర్థిక వ్యవస్థలోని కీలక రంగాలలో ప్రభుత్వ ఆధిపత్యాన్ని ఛాంపియన్ చేసింది. బ్యాంకులు, బొగ్గు, బీమా, ఇతర కీలక పరిశ్రమల జాతీయీకరణను నిరంతరం సమర్థించింది. వ్యూహాత్మక వనరులు అనేవి జాతీయ అభివృద్ధి, సామాజిక సంక్షేమం కోసం ఉపయోగపడాలే తప్ప ప్రైవేట్ సముపార్జన కోసం కాదని సిపిఐ ఎల్లప్పుడు వాదించింది.

**సమాఖ్యవాద పరిరక్షణ**

భారతదేశ ప్రజాస్వామ్య నిర్మాణాన్ని బలోపేతం చేసేందుకు సమాఖ్యవాదం, భాష, సాంస్కృతిక వైవిధ్యాన్ని సిపిఐ గట్టిగా సమర్థిస్తుంది. దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు, మహిళల హక్కులను కాపాడటంలో, అలాగే లౌకికవాదం , హేతుబద్ధమైన ఆలోచనలకు దృఢంగా కట్టుబడి ఉండటంలో సామాజిక న్యాయం పట్ల సిపిఐ నిబద్ధత వ్యక్తమవుతుంది. దశాబ్దాలుగా, సంస్కరణ, పురోగతి కోసం, ప్రతీఘాత శక్తులపై ప్రతిఘటనకు ఎర్రజెండా సంకేతంగా నిలిచింది. ఇవాళ సిపిఐ తన రెండవ శతాబ్దంలోకి అడుగుపెడుతున్న సమయంలో భారతదేశం తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటుంది. మతతత్వం, పెరుగుతున్న ఫాసిజం గణతంత్ర పునాదులకు ముప్పుగా మారాయి. ఆర్థికాభివృద్ధికి తీవ్ర నిరుద్యోగం, అనిశ్చితి, విస్తృతమవుతున్న అసమానతలు తోడయ్యాయి.

**వామపక్షాల ముందున్న సవాలు**

మరోసారి ప్రజల ఆకాంక్షలకు పర్యాయపదంగా మారడమే వామపక్షాల ముందున్న సవాలు. దీనికి సమానత్వం, ప్రజాస్వామ్యం, న్యాయం అనే తన ప్రధాన విలువలను గట్టిగా కొనసాగిస్తూనే, సమకాలీన పెట్టుబడిదారీ విధానం పట్ల దాని అవగాహనను పునరుద్ధరించడం అవసరం.

మన చరిత్రలోని ఈ కీలక సమయంలో సిపిఐ శతాబ్ది కేవలం గుర్తుంచుకునే క్షణం మాత్రమే కాదు, ఇది కార్యాచరణకు పిలుపు. ప్రజాస్వామ్యం దాడికి గురవుతోంది. ప్రజల హక్కులు, జీవనోపాధి క్రమంగా క్షీణిస్తున్నాయి. స్వాతంత్ర్య ఉద్యమం సాధించిన విజయాలు ఉద్దేశపూర్వకంగా రద్దు చేయబడుతున్నాయి. ఆర్ఎస్ఎస్ – బిజెపి కలయిక మన సామాజిక సంఘీభావాన్ని కూల్చివేసి, మన ఆర్థిక సార్వభౌమత్వాన్ని డొల్ల చేసి, రాజ్యాంగాన్ని ధ్వంసం చేయడం ద్వారా నిరంకుశత్వాన్ని, కొన్ని విభాగాలను వెలివేసే వ్యవస్థను విధించడానికి ప్రయత్నిస్తుంది. ఈ ప్రమాదాన్ని విడివిడిగా నిరోధించలేము. సిపిఐ, వామపక్షాలను బలోపేతం చేసి, మరింత చేరువై విస్తృత ప్రజాస్వామ్య ప్రతిఘటనగా ఆవిర్భవించాలి. బలమైన నిర్మాణాలుగా కొనసాగుతున్న వర్గ దోపిడీ, కుల అణచివేత, పితృస్వామ్య వ్యవస్థలపై సంఘటిత, రాజీలేని పోరాటాలు అవసరం. మన ముందున్న కర్తవ్యం స్పష్టంగా ఉంది. వ్యవస్థల్లో క్షీణ ప్రభావాన్ని ప్రక్షాళన చేయడం, గణతంత్రాన్ని తిరిగి సాధించడం, సమానత్వం, లౌకికవాదం, న్యాయం పునాదులపై భారతదేశాన్ని పునర్నిర్మించడం. ఐక్యంగా మనం ప్రతిఘటించాలి. ఐక్యంగా మనం ముందుకు సాగాలి. ఐక్యంగా మనం సమానత్వంతో కూడిన, ప్రజాస్వామ్యబద్ధ, సుసంపన్నమైన ఒక నూతన భారతదేశాన్ని సృష్టించాలి. ఎర్ర జెండా మరింత ఎత్తుకు ఎగరాలి. ప్రజలు విజయం సాధించాలి. భవిష్యత్తు మనదే.

## బహిరంగ సభ

(మొదటి పేజీ తరువాయి)

మీడియాతో మాట్లాడుతూ ఖమ్మంలో జరిగే బహిరంగసభలో సౌహార్ద్ర సందేశం నిమిత్తం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, అలాగే జాతీయ వామపక్ష పార్టీల నాయకులను, 40 దేశాల నుంచి ప్రతినిధులను ఆహ్వానిస్తున్నామని వివరించారు. సభకు ఐదు లక్షల మందిని సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. జనవరి 19న జాతీయ వామపక్ష పార్టీల నాయకులతో సదస్సు, ఆ తర్వాత సిపిఐ జాతీయ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తామని కూనంనేని తెలిపారు. వందేళ్ల ముగింపు ఉత్సవం సందర్భంగా నిర్వహించే సిపిఐ బహిరంగ సభ ద్వారా ప్రజలకు విశ్వాసం కలగాలన్నారు. సభను జయప్రదం చేసేందుకు జిల్లాల వారిగా జాతాలను నిర్వహిస్తామని, ఎపి, తమిళనాడు, కేరళ, వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో హాజరుకానున్నట్టు తెలిపారు.

## బిజెపికి వణుకు : పల్లా

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. సర్దార్ వల్లభాయ్‌పటేల్ స్వయంగా వచ్చి హైదరాబాద్‌ను విలీనం చేసుకున్నట్టు చరిత్రను వక్రీకరిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసేందుకు నాటి నిజాం నిరాకరించడంతో మఖ్దూం మొయియుద్దీన్, రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డిలు తెలంగాణ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారని, ఈ క్రమంలో మూడు వేల గ్రామాలను విముక్తి చేశారని గుర్తు చేశారు. నిజాం నవాబుల ఏజెంట్లు ఎర్రజెండాలను చూసి భయపడ్డారని, గ్రామాలన్నీ కమ్యూనిస్టుల వశమౌతాయని, వారంతా నిజాం నవాబును మొరపెట్టుకుంటే, ఆయన సర్దార్ వల్లభాయపటేల్‌ను ఆహ్వానించి భారతదేశంలో విలీనమయ్యారని పల్లా గుర్తు చేశారు. అధికారం కోల్పోగానే కొన్ని రాజకీయ పార్టీలు తెరమరుగవుతున్నాయని, కమ్యూనిస్టు పార్టీ అవసరం లేదని చెప్పే ధైర్యం ఎవరికీ లేదన్నారు. ఎన్నికల సమయంలో ఇతర రాజకీయ పార్టీలు కూడా కమ్యూనిస్టుల భావజాలం, కమ్యూనిస్టుల త్యాగాల గురించి మాట్లాడుతారని, భారత కమ్యూనిస్టు పార్టీ చరిత్ర,నాయకుల సిద్ధాంతాలను, నినాదాలను ఉచ్ఛరించకుండా ఏ రాజకీయ పార్టీ కూడా అధికారంలోనికి రాలేదని, టిఆర్ఎస్, టిడిపి, కాంగ్రెస్ కూడా కమ్యూనిస్టుల ప్రణాళికపైన మాట్లాడారని వివరించారు. ఎన్నికలు పూర్తి కాగానే ఆ రాజకీయ పార్టీల ఎజెండాలే వేరుగా ఉంటాయన్నారు. దేశంలోనే మొట్టమొదటి సారి భూ సంస్కరణలు తీసుకొచ్చిన మొట్టమొదటి రాష్ట్రం కేరళ అని అన్నారు. అందరికీ విద్య, వైద్యం అనే నినాదంతో కేరళలోని కమ్యూనిస్టు ప్రభుత్వం పనిచేస్తుందని, అతి పేదరిక నిర్మూలన రాష్ట్రంగా కేరళ ప్రభుత్వం ప్రకటించిన విషయాన్ని పల్లా గుర్తు చేశారు.

## భారత్ ఆందోళన

(మొదటి పేజీ తరువాయి)

షెడ్యూలును సామూహికంగా రద్దు చేయడంవల్ల, తనిఖీలవల్ల ఉద్యోగపరంగా చెల్లుబాటైన వీసాతో అమెరికాకు తిరిగివెళ్ళేవారు నిస్సహాయంగా దేశంలోనే ఉండిపోయారన్నారు. వేలాదిమంది వీసా ఇంటర్వ్యూలకోసం ఎదురుచూస్తున్నారని, ఈ విషయం అమెరికా దృష్టికి తీసుకువచ్చినట్లు చెప్పారు. వీసాల గడువు పొడిగించకపోవడంతో చాలామంది భారతీయులు స్తంభించిపోయారని, పొడిగింపుకోసం ఎదురుచూస్తున్నారని, దీనివల్ల వారు, వారి కుటుంబ సభ్యులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఈ ఆటంకాలను కొంతలో కొంత మేరకైనా తగ్గించి భారతీయ కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్య తీవ్రత పరిష్కరించాలని అడిగేందుకు క్రియాశీల చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నిర్ణీత ప్రకారం దరఖాస్తుదారుల ఇంటర్వ్యూలు ఈనెల రెండో వారంలోనే జరగాల్సి ఉంది. కానీ దరఖాస్తుదారుల సోషల్ మీడియా ఖాతాలను పరిశీలించాలనే పేరుతో అమెరికా ఇమ్మిగ్రేషన్ అధికారులు ఎటూ చెప్పకుండా ఆకస్మికంగా ఇంటర్వ్యూలను అనేక నెలలపాటు నిరవధికంగా వాయిదా వేశారు. తిరిగి ఎప్పుడు ఈ ఇంటర్వ్యూలు జరుగుతాయన్న విషయంపై పూర్తి స్పష్టత లేకపోయినప్పటికీ వచ్చే ఏడాది మే నెల నాటికి జరిగే అవకాశం ఉందని అమెరికా ఇమ్మిగ్రేషన్ విభాగం తెలియజేసింది. ఈ లోపు సంబంధిత దరఖాస్తుదారులవారి నిర్దేశిత నిబంధనల ప్రకారం సోషల్ మీడియా హిస్టరీలను తనిఖీలు చేసే ప్రక్రియను వారు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇంటర్వ్యూలు వాయిదా వేయడం, స్పష్టత ఇవ్వకపోవడం అమెరికా అంతర్గత, సార్వభౌమాధికార వ్యవహారమైనప్పటికీ భారత దరఖాస్తుదారుల సమస్యను అమెరికా అధికారుల దృష్టికి తీసుకువెళ్ళామని జైస్వాల్ చెప్పారు.

## హద్దుండాలి

(మొదటి పేజీ తరువాయి)

పంపిణీతో పేద ప్రజలు సంతోషంగా ఉన్నట్లు తెలిపారు. ఈ క్రమంలో రాష్ట్రంలో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో చక్కటి ఫలితాలు రాగా, అదే స్ఫూర్తితో గజ్వేల్‌లో ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు. కార్యకర్తల కష్టంతోనే 92 సర్పంచ్ స్థానాలను గెలుచుకోగా, త్వరలోనే గజ్వేల్ సర్పంచులను సిఎంతో కలిపిస్తానని హామీ ఇచ్చారు. క్రమశిక్షణ కలిగిన గజ్వేల్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు జూబ్లీహిల్స్ ఎన్నికల్లో సైతం కష్టపడగా, సమిష్టి కృషితో కెసిఆర్‌ను ఎదుర్కొంటుండడం హర్షనీయమన్నారు. నియోజకవర్గ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి అధ్యక్షత వహించగా, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు, భూం రెడ్డి, ఎలక్షన్ రెడ్డి, డిసిసిబి మాజీ చైర్మన్ దేవేందర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, విజయ మోహన్, సర్దార్ ఖాన్, ప్రభాకర్ గుప్త, సర్పంచుల ఫోరం అధ్యక్షులు అశోక్‌రెడ్డి, వెంకటేష్, ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సందీప్ రెడ్డి, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్, కిష్టా గౌడ్, సుఖేందర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## ఉండాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

ఈ సాంకేతికత విభిన్న రకాల నేరాలకు కూడా దారితీస్తోంది, సైబర్ నేరాలు అనేవి ఇప్పటివరకూ మనం ఏనాడూ వినని నేరాలు, నేరస్థులు సరికొత్త పంథాలో నేరాలు చేస్తూ న్యాయవ్యవస్థకు సవాళ్ళు విసురుతున్నారు, ఇది పోను పోను మరింత పెద్ద సమస్యగా మారవచ్చు, చాలా తీవ్రమైన సమస్యగా రాబోయేరోజుల్లో మన ముందుకు వచ్చిని లబడవచ్చు'అని చెబుతూ, న్యాయవాదులు వీటిని ఎదుర్కోవడానికి, నిరూపణలకు భవిష్యత్తులో ఏ విధంగా తగిన సాధనాలను సమకూర్చుకోగలుగుతారో..! అని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'సైబర్ నేరాల కేసులను మనం విచారణ చేస్తున్నప్పుడు ఒక సైబర్ నేరస్థుడి బారిన పడిన బాధితుడితో మాట్లాడాలి, వారి సమస్యలు తెలుసుకోవాలి, ఈ విధమైన సవాళ్ళు ఎదుర్కొనేముందు మీరు పూర్తిగా వీటికి సంబంధించిన వృత్తిపరమైన విజ్ఞానాన్ని సమకూర్చుకున్నారా?' అని ప్రశ్నించారు. ఈ విజ్ఞానాన్ని, సంబంధిత వృత్తిపరమైన సాధనాలను సమకూర్చుకోవడానికి మనకు జాతీయస్థాయిలో ఒక జ్యుడీషియల్ అకాడమీ ఉన్నవిధంగానే ఒక లీగల్ అకాడమీ ఉండాలి అని ఉద్ఘాటించారు. 'న్యాయవాదుల సంఘంలో ఉండే సభ్యులు ఎప్పటికప్పుడు ఈ విషయాల్లో శిక్షణ పొందటానికి సమయం ఆసన్నమైంది, ఇది కేవలం ఒక్కరోజు లేదా 48 గంటల సమయంలో పొందే శిక్షణ కాదు, రోజువారీగా ఎప్పటికప్పుడు ఈ శిక్షణ తీసుకుంటూనే ఉండాలి, దీనికి రెండు నెలలపాటు అకాడమీలో చాలా కఠినతరమైన శిక్షణ పొందాల్సి ఉంటుంది, ఈ లీగల్ అకాడమీలో మనసొంత శిక్షకుల ముందు ఈ శిక్షణ తీసుకోవాలన్నారు. 'ఈ రంగానికి సంబంధించిన నిపుణులు పాఠ్యాంశాల వారీగా శిక్షణకు సంబంధించిన విధి విధానాలను, పద్ధతులను రూపొందించకపోతే న్యాయవాదులు వివిధ రకాలైన కేసులను పరిశీలించి బాధితులకు న్యాయం చేయడం, దోషులను గుర్తించడం కష్టమైపోతుంది, అందువల్ల ఇప్పుడు వృత్తిపరమైన కోర్సులను, అంకితభావంతో కూడిన సంస్థలను ఏర్పాటు చేసుకోవడానికి వీలుగా బార్ కౌన్సిల్ తగిన ప్రణాళికలను రూపొందించుకోవాల్సిన సమయం వచ్చింది' అని కర్తవ్యోపదేశం చేశారు. వివాదాల పరిష్కారం కోరుకునే బాధితులకు మధ్యవర్తిత్వం, కోర్టు కేసు విచారణ అన్నీ ఒక్కచోటో లభించే సమగ్ర వివాద పరిష్కార 'మల్టీ–డోర్ కోర్ట్‌హౌస్‌ను దార్శనికత దృష్టిలో భవిష్యత్తులో ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. పనాజీలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ, కేవలం ట్రయల్ కోర్టులు మాత్రమే ఇప్పుడు ఒకచోట ఉన్నాయని, మధ్యవర్తిత్వం మరోచోట ఉందని, అలా కాకుండా మధ్యవర్తిత్వం కేసు విచారణ అన్నీ సమగ్రంగా బాధితులకు అందుబాటులో ఉండాలన్నారు. మధ్యవర్తిత్వం అంటే శస్త్రచికిత్స ద్వారా ప్రాణం ఉన్న రోగిని కాపాడేందుకు చేసే ప్రయత్నం లాంటిది, కోర్టులో కేసు విచారణ అంటే మృతదేహానికి పరీక్ష చేసి ఎక్కడ తప్పు జరిగిందనే విషయాన్ని నిర్ధారించి కార్యకారణ సంబంధాన్ని విశ్లేషించి దోష నిర్ధారణ చేసే వేదిక అని అన్నారు.

## హక్కులు హననం

(మొదటి పేజీ తరువాయి)



పల్లా వెంకట రెడ్డి, కె.రామకృష్ణ, జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్యపద్మ, సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్ పాషా హాజరయ్యారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వందేళ్లు పూర్తయిందని, దోపిడీవర్గాల నుంచి మానవ జాతి విముక్తి కోసం అనేక త్యాగాలు, వీరోచిత పోరాటలు చేసిన ఘనమైన చరిత్ర సిపిఐకే ఉందన్నారు. బ్యాంకుల జాతీయకరణ, భూ సంస్కరణలు, రైతాంగ విముక్తి, కార్మికులకు 8గంటల పనిదినాలు, అసంఘటితరంగ కార్మికులు, దళితులు, బడుగు బలహీన వర్గాలకు, పీడిత వర్గాలు కూడా ప్రధాన స్రవంతిలో భాగస్వాములనే విషయన్ని సిపిఐ నినదించిందన్నారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర ప్రపంచ పుటల్లో లిఖించదగిందన్నారు. జైళ్లలోనే భారత కమ్యూనిస్టు పార్టీ పుట్టిందని, పుట్టుకలోనే పార్టీ గొంతు నులిమేయాలని ప్రయత్నించారని, కొందరికి యావజ్జీవ శిక్ష విధించారని, మరి కొందరిని ఉరి తీశారని, అనేక మంది నాయకులపై కుట్ర కేసులు నమోదు చేసినప్పటికీ వాటన్నింటినీ తట్టుకుని కమ్యూనిస్టులుగా నిలబడ్డారని గుర్తు చేశారు. కమ్యూనిజం, ఎర్రజెండా లేకపోతే ప్రజలకు రక్షణ కవచం లేదని, ఎప్పుడు ఏమైతుందోననే భయానక పరిస్థితులు ఉంటాయని తెలిపారు. ప్రధాని మోదీ, బిజెపి లాంటి తిరోగమనం, కార్పొరేట్లకు ఊడిగం చేసే సిద్ధాంతం కలిగిన వాళ్లు కమ్యూనిజం అంటేనే ఒక భూతంగా చూపించే ప్రయత్నం చేస్తున్నారని, కమ్యూనిస్టులు ఉండకూడదని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఒక లక్ష్యాన్ని పెట్టుకున్నదన్నారు. పేదరికం లేకుండా చేస్తామని చెప్పాల్సిన ప్రభుత్వం, 2026 మార్చి నాటికి మావోయిస్టులు లేకుండా చేస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు. కమ్యూనిస్టులు, అర్బన్ నక్సలైట్ల పేరుతో ప్రజల తరపున ప్రశ్నించే వారిని లేకుండా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. బ్రిటీష్ కాలంలోనే పోరాటం చేసి సాధించుకున్న హక్కులను, చట్టాలను మోదీ ప్రభుత్వం తీసివేస్తోందని, కార్మికులకు సమ్మె చేసే హక్కు కూడా లేదని, రాష్ట్రంలో ఆర్‌టిసిలో కూడా అదే పరిస్థితి నెలకొందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా జీతాలు ఇచ్చే పరిస్థితి లేదని, ఇచ్చిన జీతాలు తగ్గిస్తున్నారన్నారు. మావోయిస్టుల గురించి మాట్లాడే వారిని కూడా జైలులో పెడుతున్నారని విమర్శించారు. కె.రామకృష్ణ మాట్లాడుతూ ఇటీవలే వందేళ్ల ఉత్సవాలను పూర్తి చేసుకున్న ఆర్ఎస్ఎస్ సంస్థ తమ వందేళ్ల చరిత్రలో ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. భారతస్వాతంత్ర్య పోరాటంలో ఆర్ఎస్ఎస్ తరపున ఒక్కరైనా జైలుకు వెళ్లారా?, స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారా?, ఏనాడైనా నాటి బ్రిటిష్ ప్రభుత్వాన్ని నిలదీశారా? ప్రశ్నించారు. ఈ దేశంలో సిపిఐ భారత కమ్యూనిస్టులందరికీ మాతృసంస్థ అని, తల్లి పార్టీ సిపిఐ తర్వాతనే మిగతా కమ్యూనిస్టు పార్టీలు ఆవిర్భవించాయన్నారు. అభివృద్ధి నిరోధక, మతోన్మాద శక్తిని ఎదిరించేందుకు కమ్యూనిస్టులందరూ ఏకం కావాల్సిన అవసరం ఉందని, కమ్యూనిస్టుల ఉద్యమ పునరేకీకరణ జరిగి మునుముందుకు సాగుతూ, విజయం సాధించాలని ఆయన చెప్పారు. సిపిఐ సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్ పాషా మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీకి మంచి స్థానం ఇవ్వాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని, రాబోయే కాలంలో సిపిఐకి మంచి స్థానం దక్కుతుందన్నారు. దేశంలో 1950 నుంచి 1960 సంవత్సరం వరకు కమ్యూనిస్టు పార్టీనే ప్రధాన ప్రతిపక్ష పార్టీగా ఉండేదని గుర్తు చేశారు. దేశంలో మొదటి సారి జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జవహర్‌లాల్ నెహ్రూ కంటే కూడా నల్లగొండ నుంచి ఎంపిగా పోటీచేసిన రావి నారాయణ రెడ్డికి అత్యధిక ఓట్లు సాధించారని వివరించారు.

కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, రమావత్ అంజయ్య నాయక్, ప్రజా సంఘాల నాయకులు ప్రేంపావని (శ్రామిక మహిళా ఫోరం) ఎన్.జ్యోతి(ఎన్ఎఫ్ఐడబ్ల్యు), ఎం.నర్సింహ, బి.వెంకటేశం, నండూరి కరుణకుమారి (ఎఐటియుసి), కలకొండ కాంతయ్య (తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం), పల్లె నర్సింహ, ఉప్పలయ్య (ప్రజానాట్యమండలి), వలీ ఉల్లా ఖాద్రీ (ఎఐవైఎఫ్), కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ (ఎఐఎస్ఎఫ్), సిపిఐ సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, కార్యవర్గ సభ్యులు నెర్లేకంటి శ్రీకాంత్ పాల్గొన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

శాసనసభ నూతన కార్యదర్శిగా రేండ్ల తిరుపతి కార్యదర్శి చాంబర్‌లో శుక్రవారం పదవీ బాధ్యతలను స్వీకరించారు. ప్రస్తుత కార్యదర్శి డాక్టర్ వి.నరసింహాచార్యుల నుండి తిరుపతి బాధ్యతలను స్వీకరించారు. అనంతరం తిరుపతి, నరసింహాచార్యులు శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఆయన అధికార నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా తిరుపతికి స్పీకర్ ప్రసాద్ కుమార్ పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.





## పెట్టుబడిదారీ వ్యవస్థకు కాలం చెల్లింది

- ఎర్రజెండా వైపు చూస్తున్న ప్రపంచ యువత
- సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు
- వరంగల్ నగరంలో సిపిఐ శత వార్షికోత్సవాల భారీ ర్యాలీ




**ప్రజాపక్షం/వరంగల్ :** పెట్టుబడిదారీ వ్యవస్థకు కాలం చెల్లిందని, కమ్యూనిజమే ప్రత్యామ్నాయంగా ఎర్రజెండా వైపు చూస్తున్న ప్రపంచ యువత అని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ శత వార్షికోత్సవాల ముగింపు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం వరంగల్ నగరంలోని రైల్వే స్టేషన్ నుండి చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ భాష్మియా అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ముఖ్య అతిథిగా హాజరైన తక్కళ్లపల్లి శ్రీనివాస రావు మాట్లాడుతూ ప్రపంచంలో పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయ సిద్ధాంతాన్ని కారల్ మార్క్స్ కనుగొన్నాడని ఆ సిద్ధాంతమే ప్రపంచంలో దోపిడీ నుండి మానవాళి విముక్తికి మార్గం చూపిందన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థ రోజు రోజుకు సంక్షోభంలో కూరుకుపోతున్నదని, పెట్టుబడిదారీ వ్యవస్థ పతనంతో ప్రపంచ యువత ప్రత్యామ్నాయంగా ఎర్ర జెండా వైపు చూస్తున్నదని తెలిపారు. భారతదేశంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి నూరు సంవత్సరాలు డిసెంబర్ 26కు పూర్తి చేసుకుంటున్నదని అని తెలిపారు. జాతీయ ప్రజాతంత్ర విప్లవం లక్ష్యంగా, సోషలిజం ధ్యేయంగా, సామాజిక న్యాయం లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంలో సిపిఐ కీలక పాత్ర పోషించిందన్నారు. దేశ స్వాతంత్ర పోరాటంలో సిపిఐ అనేక త్యాగాలు చేసిందని, ఎంతోమంది అమరవీరులను అందించిన చరిత్ర సిపిఐదని అన్నారు. దున్ని వాడికి భూమి దక్కాలని, భూమిలేని నిరుపేదలకు భూమి పంచాలని పోరాడి లక్షలాది ఎకరాల భూములను పేదలకు పంచిందని, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాయుధ రైతాంగ పోరాటాన్ని చేపట్టి వేలాది గ్రామాలను విముక్తి చేసిన ఘన చరిత్ర సిపిఐకి మాత్రమే ఉందన్నారు. దేశంలో వామపక్ష పార్టీల ఐక్యతా పోరాటాలను ఉధృతం చేస్తూ, లౌకిక ప్రజాస్వామిక శక్తుల్ని ఏకం చేస్తూ ప్రజాస్వామ్య పోరాటాలను నిర్వహించడం జరుగుతున్నదన్నారు. అనంతరం వంద సంవత్సరాలు పురస్కరించుకొని కేక్ కట్ చేశారు.


### వరంగల్ నగరంలో కదం తొక్కిన ఎర్రదండు

వరంగల్ నగరంలో జరిగిన సిపిఐ శతవార్షికోత్సవాల ముగింపు ర్యాలీలో మహిళలు ఎర్ర చీరలు, పురుషులు ఎర్ర చొక్కాలు ధరించి ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, మేకల రవి, జిల్లా సహాయ కార్యదర్శులు దండు లక్ష్మ ణ్, పనాస ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేష్, గుండె బద్రి, అక్కపెల్లి రమేష్, తోట చంద్రకళ, బుస్స రవీందర్, కందిక చెన్నకేశవులు, సంఘీ ఏలేందర్, అయితే యాకయ్య, వీరగోని శంకరయ్య, జిల్లా సమితి సభ్యులు ల్యాదల శరత్, ఓర్సు రాజు, తాళ్లపల్లి జాన్ పాల్, సుంకరి భవాని, జన్ను రవి, పరికరాల రమేష్, యాకాప్రమ చారి, మియాపురం గోవర్ధన చారి, పార్థ సారథి, మస్క సుధీర్, చిట్యాల సువర్ణ, ఆరెల్లి రవి, ఆరెల్లి ప్రభాకర్, నల్లతీగల కుమార్, విజయలక్ష్మి , రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన 38వ హైదరాబాద్ బుక్ ఫెయిర్‌ను శుక్రవారం సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామక్రిష్ణ సందర్శించారు. బుక్‌ఫెయిర్ కోశాధికారి నారాయణరెడ్డితో కలిసి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నవచేతన బుక్ హౌస్‌తో పాటు పలు స్టాళ్లను సందర్శించి వివిధ పుస్తకాలను పరిశీలించారు.




## నేటి తరానికి నాటి త్యాగాల చరిత్ర



- 'శతారుణ గీతాంజలి', 'వందేళ్ళ మైలురాళ్ళు' పుస్తకాల ఆవిష్కరణలో వక్తలు

**సిపిఐ శతాబ్ది ఉత్సవాలు**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దోపిడీదారులను దేశ భక్తులుగా, మరో వైపు దేశ సంపదను కాపాడేందుకు ప్రాణత్యాగాలు చేస్తున్నవారిని దోపిడీదారులుగా పాలకవర్గాలు చూస్తున్నాయని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని స్వాతంత్ర్య సమరమోధుల కుటుంబాలు, అభ్యుదయ కవులు, కళాకారులు, మేధావుల సమ్మేళనం తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్టు, తెలంగాణ అరసం సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ బంజారా హిల్స్, లోటస్ పాండ్, రావి నారాయణ రెడ్డి ఆడిటోరియంలో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి జస్టిస్ చంద్రకుమార్, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి, తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్టు అధ్యక్షులు, మాజీ ఎంఎల్‌ఏ చాడ వెంకట్ రెడ్డి, ట్రస్ట్ కార్యదర్శి కందిమళ్ల ప్రతాపరెడ్డి, అరసం ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాపోలు సుదర్శన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఎస్.వి.సత్యనారాయణ, కందిమళ్ళ భారతి సంకలనం చేసిన 'శతారుణ గీతాంజలి' వంద పాటల పుస్తకం, 'ప్రజాపక్షం' సంపాదకులు మక్కెన సుబ్బారావు రూపొందించిన 'వందేళ్ల సిపిఐ చరిత్రలో మైలురాళ్లు' అనే పుస్తకాలను ఆవిష్కరించారు. సభకు కందిమళ్ళ ప్రతాప రెడ్డి అధ్యక్షత వహించారు. సభలో జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ 2020 నాటి నుంచి కార్పొరేట్ సంస్థలు దోచుకుంటున్నాయని, ఆదానీ, అంబానీలకు ఓడరేవులు, ప్రభుత్వ రంగ సంస్థలను కట్టబెడుతున్నారని విమర్శించారు. మహారాష్ట్ర, చత్తీస్‌గడ్, రాజస్థాన్ అడవులను అప్పగించారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమెరికాతో చేసుకున్న ఒప్పందం ప్రకారం దేశంలోకి అక్కడి పత్తి వస్తుందన్నారు. దీంతో వచ్చే ఏడాది నుంచి ఇక్కడి పత్తి రైతులకు కనీస మద్ధతు రూ.4 వేలు కూడా వచ్చే పరిస్థితి ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు. సిద్ధాంతాలతో కూడిన ప్రజా ఉద్యమాలను నిర్మించాల్సిన అవసరం ఉందని అన్నారు. పల్లా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో బిజెపి మతోన్మాద పార్టీని ఎదుర్కొనేందుకు కమ్యూనిస్టులందరూ ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. సిద్ధాంతపరంగా వందేళ్ళుగా అనేక పోరాటాల చరిత్ర కమ్యూనిస్టు పార్టీకి ఉందన్నారు. ఉద్యమాల్లో కవులు, కళాకారుల పాత్ర గొప్పదని తెలిపారు. భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యానికి పిలుపునివ్వడంతో పాటు తెలంగాణలో నిజాం నిరంకుశ రాజరిక పాలనకు వ్యతిరేకంగా రైతాంగ సాయుధ పోరాటాన్ని కమ్యూనిస్టు పార్టీ నడిపిందని పల్లా వెంకట్ రెడ్డి గుర్తు చేశారు. సాయుధ పోరాటం ద్వారా 3500 గ్రామాలకు విముక్తి కల్పించిందన్నారు. చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ వందేళ్లలో కమ్యూనిస్టు పార్టీ అనేక అటుపోటుల మైలురాళ్లు దాటిందన్నారు. వందేళ్ళ మైలురాళ్లు పుస్తకంలో తొలి ప్రధాన కార్యదర్శ ఘాటే నుండి సురవరం సుధాకర్ రెడ్డి, డి.రాజా వరకు పూర్తి సమాచారం రచయిత మక్కెన సుబ్బారావు ఇచ్చారని ప్రశంసించారు. ఈ తరానికి సంబంధించిన వారికి ఈ పుస్తకం తప్పకుండా ఉపయోగపడుతుందన్నారు. గతం లేకుం టే భవిష్యత్ లేదని, ఈనాటి తరానికి ఆనాటి త్యాగాల చరిత్రను అందించాలని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, సినీ నటులు మాదాల రవి, సినీ దర్శకులు బాబ్జి, అరసం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కెవిఎల్, కార్యదర్శి విజయ్ భాస్కర్, అరసం హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డమీది చంద్రమోహన్ గౌడ్, కవులు నాళేశ్వరం శంకరం, సోమశిల తిరుపాల్, డాక్టర్ ప్రసాద్, గంగాధర్, ఎస్. సూర్య ప్రకాష్, సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు వెంకట్రామిరెడ్డి, ఉజ్జని రత్నాకర రావు, డా.బి.వి.విజయలక్ష్మి, జోస్యభట్ల కల్పన, చక్రవర్తుల జ్యోత్స్న, రావి ప్రతిభ, డి.ప్రేంపావని, డా౹ వై.వి.కె.ప్రతిభ, వంకా లక్ష్మి, టి.ఎం.ఉషా రాణి పాల్గొన్నారు.



## కొత్త జీఓతో జర్నలిస్టులకు ఎలాంటి నష్టం జరగదు

మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన అక్రిడిటేషన్ మార్గదర్శకాలు వృత్తిపరమైన జర్నలిస్టులకు ఎలాంటి నష్టం కలిగించవని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ఈమేరకు శుక్రవారం ఆయన విడుదల చేసిన ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన చర్యలు ఎలాంటి వివక్షత లేకుండా అందరికీ సమానంగా వర్తించేలా మరింత మెరుగైన విధానాలను అమలు చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు యోచిస్తున్నారని ఆయన తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో అమలులో ఉన్న అక్రిడిటేషన్ ఉత్తర్వుల్లో ఉర్దూ జర్నలిస్టుల పట్ల, చిన్న పత్రికల పట్ల వివక్షత చోటు చేసుకున్న అంశాన్ని తెలంగాణ హైకోర్టు కొట్టివేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఆ తీర్పు నేపథ్యంలోనే నూతన జి.ఓలో అవసరమైన మార్పులు చేసినట్లు తెలిపారు. నూతన జి.ఓపై కొందరు ఉద్దేశపూర్వకంగా అవాస్తవాలను ప్రచారం చేస్తూ, సంక్షేమ చర్యలు కేవలం విలేకరులకు మాత్రమే వర్తిస్తాయని వక్రీకరిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇందులో ఎలాంటి వాస్తవం లేదని, వృత్తిపరమైన జర్నలిస్టులందరికీ ఈ సంక్షేమ పథకాలు వర్తిస్తాయని స్పష్టం చేశారు. ఈ అంశాలపై అవసరమైతే మరింత వివరణ ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొన్న ఆయన, జర్నలిస్టుల సంక్షేమంపై ముఖ్యమంత్రి, సమాచార శాఖ మంత్రితో ఎప్పుడైనా చర్చించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అయితే రాజకీయ ఉద్దేశాలతో కొన్ని శక్తులు ఆందోళనలకు పిలుపునివ్వడం అత్యంత విచారకరమని అన్నారు. జర్నలిస్టుల పట్ల, వారి సమస్యల పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ సానుకూల పరిష్కారాల దిశగానే ముందుకు సాగుతుందని, గత ప్రభుత్వంలా వివక్షతకు తావు ఉండదని ఆయన స్పష్టం చేశారు. నూతన జి.ఓపై కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని వర్కింగ్ జర్నలిస్టులకు కె.శ్రీనివాస్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.



మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మొదటి వర్ధంతి సందర్భంగా జూబ్లీహిల్స్ నివాసంలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు, వేం.నరేందర్ రెడ్డి, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, నల్లగొండ ఎంపి రఘువీర్ రెడ్డి నివాళులు అర్పించారు.

## ఆర్‌టిసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎండికి వినతి పత్రం అందించిన టిజిఎస్‌ఆర్‌టిసి జెఎసి నేతలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆర్‌టిసి కార్మికుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోరుతూ ఆర్‌టిసి వైస్ ఛైర్మన్, ఎండి నాగిరెడ్డిని టిజిఎస్‌ఆర్‌టిసి జెఎసి ఛైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ ఛైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కో కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్‌లు శుక్రవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 22 డిమాండ్లతో కూడిన అంశాలపై సుదీర్ఘంగా ఎండితో చర్చించినట్లు తెలిపారు. వాటిలో 2017 వేతన సవరణకు చెందిన అలవెన్సులను పెంచి చెల్లించుటకు ఎండి సానుకూలంగా స్పందించారన్నారు. అలాగే కారుణ్య నియామకాలను 3 సంవత్సరాల పాటు కన్సాలిడేటెడ్ పే కింద పని చేసే విధానాన్ని 2 సంవత్సరాలకు మారుస్తామని, 2021 వేతన సవరణను వీలైనంత త్వరలో అమలు చేయడానికి ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు వీలైనంత త్వరగా చెల్లిస్తామని, మహాలక్ష్మి పథకంలో ప్రయాణిస్తున్న మహిళలకు స్మార్ట్ కార్డు ఇవ్వడానికి సుముఖత వ్యక్తం చేశారన్నారు. కార్మికులపై పనిభారాలు తగ్గిస్తామని, జనం లేని రూట్లలో కిలోమీటర్లను తగ్గిస్తామని, కారుణ్య నియామకాల వయో పరిమితిని 44 సంవత్సరాలకు పెంచడానికి బోర్డు అనుమతి కోరుతామని తెలిపారన్నారు. యూనియన్ల పునరుద్ధరణ అంశం యాజమాన్యం పరిధిలో లేదని, ప్రభుత్వం అనుమతితో యూనియన్ల కార్యకలాపాలను అనుమతిస్తామని చెప్పారని అన్నారు. తార్నాక హాస్పిటల్‌లో పేషెంట్‌తో వచ్చే అటెండెంట్‌కి మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని, త్వరలో విశ్రాంతి భవనం నిర్మించి అందులో డైనింగ్ హాల్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని అన్నారు. ఆర్‌టిసి ఆదాయానికి గండి కొడుతున్న అక్రమ ప్రైవేట్ వాహనాల రవాణాను అరికట్టేందుకు తగు చర్యలు చేపడతామన్నారు. అలాగే యాజమాన్యం పరిధిలో ఉన్న సమస్యలన్నింటిని ఒక్కొక్కటిగా పరిష్కరించటానికి ప్రయత్నిస్తామని జెఎసి నాయకులకు హామీ ఇచ్చినందుకు మేనేజింగ్ డైరెక్టర్‌కి వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్.కమలాకర్ గౌడ్, జె.రాఘవులు, బుద్ధ విశాల్, ఎం.ఎ.మజీద్, జి.రాములు, జి.రాంచందర్ పాల్గొన్నారు.

## గుంటూరులో చదువుకుంటే తప్పా?



బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తాను గుంటూరులో చదువుకుంటే సిఎం రేవంత్‌రెడ్డికి ఏం తప్పు అని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ప్రశ్నించారు. తాను ఆంధ్రాకు పోయి ఇంటర్మీడియట్ చదువుకుంటే తప్పా అని అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బిఆర్‌ఎస్‌లో శుక్రవారం చేరారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ తన తండ్రి తెలంగాణ తెచ్చిన మొగోడని, మొనగాడని, తప్పనిసరిగా ఆయన పేరు చెప్పుకుంటానని, అందులో తప్పు ఏముందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం తీసుకొచ్చిన నాయకుడు, రెండు సార్లు సిఎం చేసిన తన తండ్రిని తిడితే కొడుకుగా తనకు ఆవేశం రాదా అని కెటిఆర్ చెప్పారు. రోడ్ల మీద పెయింటింగ్స్ వేసుకునే వ్యక్తి రేవంత్ రెడ్డి అని, జీవితంలో ఎవరైనా చిన్న స్థాయి నుంచి పెద్ద స్థాయికి రావడంలో తప్పులేదని, కానీ మంచి పనులు చేసి రావాలని అన్నారు. రేవంత్ రెడ్డి ఢిల్లీలో పైసలు ఇచ్చి ముఖ్యమంత్రి పదవిని తెచ్చుకున్నారని ఆరోపించారు. ఎన్నికల హామీల అమలు ఏమైందని ప్రశ్నిస్తే 'గుడ్లు పీకి గోటీలాడతారా' అని అన్నారు. కెసిఆర్ ఒక మీడియా సమావేశం పెడితేనే తట్టుకోవడం లేదని ఎద్దేవా చేశారు.

## 'ఉపాధి హామీ' పునరుద్ధరణకు పోరాటాలు

బికెఎంయు జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు పిలుపు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన విబి– జి రామ్ జి విధానాన్ని రద్దు చేసి, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పూర్తిస్థాయిలో పునరుద్ధరించే వరకు నిరంతర పోరాటాలు నిర్వహించాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బికెఎంయు) జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు పిలుపునిచ్చారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య అధ్యక్షతన హైదరాబాద్‌లోని మగ్దూం భవన్‌లో జరిగిన సమావేశంలో వెంకట్రాములు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కోట్లాది గ్రామీణ కార్మికులకు చట్టబద్ధంగా కల్పించిన ఉపాధి హక్కును రద్దు చేయాలనే ప్రయత్నం దుర్మార్గమని ఆయన విమర్శించారు. ఉపాధి హామీ చట్టంలో ఉన్న మహాత్మా గాంధీ పేరును తొలగించడం అత్యంత అన్యాయమన్నారు. గాంధీని గాడ్సే హత్య చేసిన చరిత్రను గుర్తు చేస్తూ, నేడు ఆయన వారసులమని చెప్పుకునేవారు గాంధీ పేరునే తొలగించేందుకు కుట్రలు చేయడం మహాదారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి ఇచ్చే నిధులను 60 శాతానికి తగ్గించి, రాష్ట్రాల వాటాను 40 శాతానికి పెంచడం ద్వారా ఈ చట్టాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. ఈ కుట్రలను గ్రామ గ్రామాన విస్తృతంగా ప్రచారం చేసి, ఐక్య పోరాటాల ద్వారా కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని వెంకట్రాములు పిలుపునిచ్చారు.

**డిసెంబర్ 29న రాష్ట్రవ్యాప్త నిరసనలు : కలకొండ కాంతయ్య**

సమావేశానికి అధ్యక్షత వహించిన కలకొండ కాంతయ్య మాట్లాడుతూ, ఉపాధి హామీ చట్ట పరిరక్షణ కోసం ఈనెల 29వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ప్రభుత్వ కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. నిరసనల అనంతరం ప్రభుత్వ అధికారులకు వినతిపత్రాలు అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో గ్రామీణ శ్రమజీవులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉద్యమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వరరావు, బుద్ధుల జంగయ్య, డి.ధనంజయనాయుడు, సృజన్ కుమార్, ఎం.తాజుద్దీన్, అక్క పెల్లి బాబు, యేసయ్య, చింతకుంట్ల వెంకన్న పాల్గొన్నారు.

## ఎస్‌ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్ రావు విడుదల

- ఫోన్ ట్యాపింగ్ కేసులో ముగిసిన విచారణ
- రెండు వారాల పాటు ప్రశ్నించిన సిట్ అధికారులు
- జనవరి 16న సుప్రీంకోర్టుకు సిట్ విచారణ నివేదిక
- త్వరలో మాజీ సిఎం, మంత్రులను విచారించే అవకాశం!

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాజకీయాలలో ప్రకంపనలు సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబి) మాజీ చీఫ్ ప్రభాకర్ రావును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) శుక్రవారం విడుదల చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రెండు వారాల పాటు కస్టడీలో విచారించిన అనంతరం, గడువు ముగియడంతో ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి, అనంతరం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ నుంచి ఆయనను విడిచిపెట్టారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఈనెల 12న సిట్ ఎదుట లొంగిపోయిన ప్రభాకర్ రావును హైదరాబాద్ సిపి సజ్జనార్ నేతృత్వంలోని 9 మంది స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ సుదీర్ఘంగా విచారించింది. పదవీ విరమణ తర్వాత కూడా బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఆయనను ఎస్‌ఐబి చీఫ్‌గా ఎందుకు నియమించిందనే కోణంలో సిట్ ప్రశ్నించినట్లు సమాచారం. దీని వెనుక రాజకీయ దురుద్దేశాలు ఉన్నాయని దర్యాప్తు సంస్థ అనుమానిస్తోంది. విచారణలో భాగంగా చివరి రోజు కేసులో సహ నిందుతులైన ప్రణీత్‌రావు, భుజంగరావు, రాధాకిషన్ రావు, తిరుపతన్నలను జూబ్లీహిల్స్ పీఎస్‌కు పిలిపించి కీలక సమాచారాన్ని రాబట్టారు. మాజీ మంత్రి హరీశ్‌రావుతో తరచూ ఎందుకు భేటీ అయ్యారని ప్రశ్నించగా, మావోయిస్టుల ముప్పు గురించి వివరించడానికేనని ఆయన చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో పాటు మాజీ డిజిపి మహేందర్ రెడ్డి, మాజీ సిఎస్ సోమేశ్ కుమార్ వంటి ఉన్నతాధికారుల వాంగ్మూలాలను కూడా సిట్ నమోదు చేసింది. ప్రభాకర్ రావు కస్టడీ విచారణపై జనవరి 16న సుప్రీంకోర్టుకు సిట్ నివేదిక సమర్పించనుంది. మరోవైపు ఈ కేసులో తదుపరి చర్యలపై ఇంటెలిజెన్స్ చీఫ్ విజయ్ కుమార్, హైదరాబాద్ సిపి విసి.సజ్జనార్ సమావేశమై చర్చించారు. మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రులు కెటిఆర్, హరీశ్ రావులను కూడా విచారణకు పిలిచే అవకాశం ఉందన్న ఊహాగానాల నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రాజకీయ ప్రత్యర్థులు, వ్యాపారులు, జర్నలిస్టుల ఫోన్లను ప్రభాకర్ రావు నేతృత్వంలోని బృందం అక్రమంగా ట్యాపింగ్ చేసిందని ప్రధాన ఆరోపణగా ఉంది.

**సూపరింటెండెంట్ కార్యాలయం, ఉస్మానియా జనరల్ హాస్పిటల్, హైదరాబాద్.**

Rc.No. M2/OGH/2025-26/1874 — టెండర్ ప్రకటన — తేది: 24.12.2025

విషయం : M2 స్టోర్స్-OGH యొక్క వివిధ విభాగాలలో ఉన్న వినియోగానికి పనికిరాని వస్తువులను పారేయడం / Obsolete Condemned articles పారవేయడం-షార్ట్ టెండర్ నోటిఫికేషన్ విషయం గురించి.

రిఫరెన్స్ : అప్రోవల్ ఆఫీస్ నోట్ RC.No. M2/OGH/2025-26 తేదీ: 24-12-2025.

((0))

హైదరాబాద్ ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌లోని వివిధ విభాగాలలో ఉన్నటువంటి వినియోగానికి పనికిరాని వస్తువులను పారేయడం/ వాడుకలోలేని కండెమ్డ్ ఆర్టికల్స్ పారవేయడం కోసం అధీకృత/ ఏజెన్సీలు/ వెండర్స్/ సర్వీస్ ప్రొవైడర్ల నుండి సీల్డ్ టెండర్లను ఆహ్వానించడమైనది.

01. టెండర్ ఫారమ్ ఫీజు రూ.5,000/- OGH యొక్క క్యాష్ సెక్షన్‌లో చెల్లించాలి మరియు రశీదు పొందాలి.
02. టెండర్ ఫారమ్ అమ్మకం తేదీ: 29.12.2025 నుండి ప్రారంభమై 06.01.2026 వరకు OGH యొక్క సెక్షన్ M2 నుండి అన్ని పనివేళల్లో ఉదయం 10-30 నుంచి సాయంత్రం 4గంటల వరకు ఉంటుంది.
03. సీల్డ్ టెండర్ సమర్పించడానికి చివరి తేదీ: 08.01.2026. దీనితోపాటు రూ.50,000 డి.డి సూపరింటెండెంట్, ఉస్మానియా జనరల్ హాస్పిటల్, హైదరాబాద్ పేరిట తీసినది హైదరాబాద్ ఉస్మానియా జనరల్ హాస్పిటల్ ఇన్‌వార్డ్‌లో సమర్పించాలి.
04. హైదరాబాద్‌లోని ఉస్మానియా జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ ఛాంబర్లలో సీల్డ్ టెండర్లను తేదీ: 12.01.2026న మధ్యాహ్నం 3గంటలకు వెండర్స్ / ఏజెన్సీల యొక్క రిప్రజెంటేటివ్స్ సమక్షంలో తెరువడం జరుగుతుంది.

సూపరింటెండెంట్, ఉస్మానియా జనరల్ హాస్పిటల్, హైదరాబాద్, ఎటువంటి నోటీస్ లేకుండా ఏవైనా లేదా అన్ని టెండర్లను అంగీకరించడం / తిరస్కరించడం / రద్దు చేయడం వంటి అన్ని హక్కులను కలిగి ఉన్నారు.

సం/- సూపరింటెండెంట్, ఉస్మానియా జనరల్ హాస్పిటల్, హైదరాబాద్.

DIPR R.O. No. : 12607-PP/CL/ADVT/1/2025-26, Date: 24-12-2025



# జనరల్
STATE & REGIONAL NEWS

## అందెశ్రీ క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైకోర్టు రిటైర్డ్ జడ్జి రాధారాణి, రిటైర్డ్ ఆర్‌టిఐ కమిషనర్ సిఎల్‌ఎన్ గాంధీ శుక్రవారం అందెశ్రీ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ సంగీత కళాకారుల సంఘం అధ్యక్షులు చెన్నరావు, రాష్ట్ర అధ్యక్షులు లయన్ వేముల శ్రీనివాస్, నిరంజన్ పాల్గొన్నారు.



## సంక్రాంతి తర్వాతే బహిరంగ సభలు..?

### బిఆర్‌ఎస్ ముఖ్యనేతలతో కెసిఆర్ సమావేశం


**ప్రజాపక్షం/హైదరాబాద్:** పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్ విషయంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ప్రజా క్షేత్రంలో ఎండగట్టాలని బిఆర్‌ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ రావు పార్టీ ముఖ్యులకు సూచించారు. ఈనెల 29న జరిగే శాసనసభ సమావేశంలో కూడా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలకు విషయంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వహాయంలో చేపట్టిన పనులను, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తెలియజేయాలని సూచించినట్టు తెలిసింది. ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన ముఖ్యనాయకులు,మాజీ మంత్రులతో కెసిఆర్ ఎర్రవెల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా 'పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్' విషయంలో ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లో బహిరంగ సభలు, అంతకుముందు చేపట్టే కార్యక్రమాలపైన చర్చించినట్టు తెలిసింది. అసెంబ్లీ సమావేశాలలో నీటిపారుదల ప్రాజెక్ట్‌లపైన ప్రభుత్వం ఏం సమాధానం చెబుతుంతో పరిశీలించి, ఆ తర్వాత సంక్రాంతి పండగ తర్వాత మూడు ఉమ్మడి జిల్లాల్లో బహిరంగ సభలను నిర్వహించాలని కెసిఆర్ సూచించినట్టు సమాచారం. మాట, పాట, పవర్‌పాయింట్ ప్రజంటేషన్ రూపంలో నీటిపారుదల ప్రాజెక్ట్‌లలో జరుగుతున్న అన్యాయాలను ప్రజలకు వివరించాలని, అందుకు తగిన కార్యాచరణను సిద్ధం చేయాలని కెసిఆర్ తెలిపారు. కాగా శాసనసభ సమావేశాలకు కెసిఆర్ హాజరవుతారా? లేదా అనే అంశంపై స్పష్టత రాలేదు.

## ఐఎఎస్‌లకు కోర్టుధిక్కరణ నోటీసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పిటిషనర్‌కు రూ.1.16 కోట్ల బకాయిలు చెల్లించాలన్న ఉత్తర్వులను అమలు చేయని ఇద్దరు ఐఎఎస్ అధికారులకు కోర్టు ధిక్కరణ కేసులో హైకోర్టు ఫాం1 నోటీసులను జారీ చేసింది. ఇద్దరు ఐఎఎస్ అధికారులు స్వయంగా కోర్టు విచారణకు హాజరై వివరణ ఇవ్వాలని న్యాయమూర్తి జస్టిస్ ఈవీ వేణుగోపాల్ ఆదేశించారు. కోర్టు ధిక్కరణ కింద ఎందుకు చర్యలు తీసుకోరాదో జనవరి 9న జరిగే విచారణకు హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ ఫాం1 నోటీసులు జారీ చేశారు. ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సుందీప్ కుమార్ సుల్తానియా, పంచాయతీ రాజ్ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్, పంచాయతీ రాజ్ ఇంజనీర్ ఇన్ చీఫ్ కనకరత్నం, కరీంనగర్ రీజియన్ ఎస్ఈ లచ్చయ్య, రహమాన్, నర్సింహారావు స్వయంగా విచారణకు హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించారు. స్వయంగా హాజరు నుంచి వినహాయింపు కోరేందుకు ఏవిధమైన అభ్యర్థనలు చేయవద్దని తేల్చి చెప్పారు. సివిల్ పనులకు సంబంధించి తమకు చెల్లించాల్సిన బకాయిలు ఇవ్వడం లేదంటూ కె.ఆనంద్ అండ్ కంపెనీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. పిటిషనర్ ఝు కాయి రూ.1.16 కోట్ల పైచిలుకు మొత్తాన్ని ఆరు వారాల్లో చెల్లించాలని గత ఏప్రిల్లో హైకోర్టు ఆదేశించింది. మూడు మాసాలైనప్పటికీ బకాయి చెల్లించలేదంటూ పిటిషనర్ ధిక్కరణ పిటిషన్ వేశారు. న్యాయవాది డీఎల్ పాండు వాదిస్తూ, అధికారులు కావాలనే కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించారని, బకాయిలు చెల్లింపులు చేయలేదని చెప్పారు. బాధ్యులైన అధికారులపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన హైకోర్టు.. గత విచారణకు పంచాయతీ రాజ్ శాఖ ఇంజనీర్‌ఇన్‌చీఫ్, కరీంనగర్ జిల్లా ఎస్ఈ, పంచాయతీ రాజ్ ఇంజనీర్, పే అండ్ అకౌంట్స్ ఆఫీసర్ హాజరై కోర్టు ఆదేశాల మేరకు చెల్లింపులు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేసింది. ఎందుకు కోర్టు ఉత్తర్వులను అమలు చేయలేదని ప్రశ్నించింది. ఇది నిర్లక్ష్యం కిందకే వస్తుందని వ్యాఖ్యానించింది. అధికారులు జూలై 11, ఆగస్టు 14, ఆగస్టు 29, సెప్టెంబర్ 19, అక్టోబర్ 16, నవంబర్ 3, నవంబర్ 7, నవంబర్ 21న జరిగిన విచారణలకు స్వయంగా హాజరైనప్పటికీ ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీసింది. పైవిధంగా అధికారులను ఆదేశించి, విచారణ జనవరి 9కి వాయిదా వేసింది.

# విలీన ప్రక్రియ సంపూర్ణం

### దేశంలోనే అతిపెద్ద నగరంగా ఆవిర్భవించిన హైదరాబాద్
### జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేందుకు అస్కారం
### ఒకే కార్పొరేషన్ ఏర్పాటులో సిఎం రేవంత్ రెడ్డి ధృడసంకల్పం




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) పరిధిలో 20 పురపాలికలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లు పట్టణ స్థానిక సంస్థలను (యూఎల్‌బిలు) విలీనం చేయడంతో హైదరాబాద్ పుర పాలనలో ప్రభుత్వం ఒక నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది. ఈ విలీనంతో జిహెచ్‌ఎంసి పరిధి 650 చదరపు కిలోమీటర్ల నుంచి 2,053 చదరపు కిలోమీటర్లకు విస్తరించింది. విస్తీర్ణం, జనాభా పరంగా దేశంలోనే అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్‌గా జిహెచ్‌ఎంసి ఆవిర్భవించింది. గ్రేటర్ హైదరాబాద్‌ను రెండు మూడు మున్సిపల్ కార్పొరేషన్లుగా ఏర్పాటు చేస్తారనే ప్రచారాన్ని పటాపంచలు చేస్తూ ఒకే నగరంగా రూపొందించారు. ఇదే కథనాన్ని నవంబర్ 28వ తేదీన 'ప్రజాపక్షం' ప్రచురించింది. అలాగే వార్డుల పునర్విభజన సందర్భంలో పరిపాలన సౌలభ్యం కోసం జిహెచ్‌ఎంసిలో 12 జోన్‌లు, 60 సర్కిళ్లు ఏర్పాటు చేయనున్నారని ఈనెల 12వ తేదీన 'ప్రజాపక్షం'లో కథనం ప్రచురితమైంది. ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) అనుకొని ఉన్న 27 మున్సిపల్ స్థానిక సంస్థలను జిహెచ్‌ఎంసిలో విలీనం చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ధృడసంకల్పంతో నిర్ణయం తీసుకున్నారు. దేశంలోనే సువిశాలమైన నగరంగా గ్రేటర్ హైదరాబాద్‌ను రూపొందించాలని మున్సిపల్ శాఖను సిఎం రేవంత్ రెడ్డి గతంలోనే ఆదేశించారు. అందుకు అనుగుణంగానే అధికార యంత్రాంగం విలీన ప్రక్రియను పూర్తి చేసింది. అంతేకాకుండా ఎన్నికల వార్డుల పునర్విభజన ప్రక్రియను సైతం పూర్తి చేసింది. హైదరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాలలో ఉన్న సమస్థితోష్ణతి వాతావరణం దృష్ట్యా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు ఉన్న అనేక సంస్థలు ఇప్పటికే తమ కార్యాకలాపాలను నగరంలో ప్రారంభించాయి. ప్రపంచ స్థాయి గుర్తింపును తీసుకొచ్చేందుకు మరింతగా విస్తరిస్తే ప్రయోజనం ఉంటుందనే ఉద్దేశంతోనే ప్రభుత్వం 2053 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణ వరకు నగరాన్ని విస్తరించిందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అంతేకాకుండా నగరం నలుమూలల ఎక్కడైన జాతీయ, అంతర్జాతీయ సంస్థలను నెలకొల్పేందుకు ఒకే నగరంగా ఉంటే ప్రయోజనం ఉంటుందనే ఆలోచనతోనే చేశారని చెప్తుతున్నారు. అలాగే రియల్ ఎస్టేట్ రంగానికి ఊపు తీసుకొచ్చేందుకు కూడా ఉపకరిస్తుందనే భావనలో ప్రభుత్వం ఉంది. అనేక రకాలుగా ఆలోచనలతో కసరత్తు చేసిన సర్కార్ ఒకే కార్పొరేషన్ వైపు మొగ్గుచూపింది.

**పెరిగిన వార్డుల సంఖ్య 150 నుంచి 300**

పునర్వ్యవస్థీకరణలో భాగంగా, గెజిట్‌లో నోటిఫై చేసిన సమగ్ర పునర్విభవజన ప్రక్రియ అనంతరం జిహెచ్‌ఎంసి వార్డుల సంఖ్యను 150 నుంచి 300కు పెంచారు. దీని ద్వారా ప్రజాప్రాతినిధ్యాన్ని మరింత బలోపేతం చేయడం, పరిపాలనా సామర్థ్యాన్ని పెంపొందించడం తద్వారా విస్తరించిన పట్టణ ప్రాంతాల్లో పౌర సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడం లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.

**వికేంద్రీకృత పాలనకు జోన్‌లు, సర్కిళ్ల ఏర్పాటు..**

విలీనంతో పెరిగిన పరిపాలనా బాధ్యతలను సమర్థంగా నిర్వహించేందుకు గతంలో ఉన్న 6 జోన్‌లు, 30 సర్కిళ్ల నుంచి 12 జోన్‌లుగా, 60 సర్కిళ్లకు పునర్వ్యవస్థీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ప్రస్తుతం జిహెచ్‌ఎంసి జనాభా 1.34 కోట్లకు మించి ఉండటంతో, ఈ మార్పులు వికేంద్రీకరణ, పరిపాలనా సమానత్వం, మెరుగైన సేవల అందింపునకు దోహదపడనున్నాయి.

**సమగ్ర ప్రణాళికలు, మెరుగైన పౌర సేవలు**

విస్తరించిన జిహెచ్‌ఎంసి పరిధితో సరిపడా భూలభ్యత, రవాణా, నివాసం, వర్షపు నీటి పారుదల, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల్లో సమగ్ర మెట్రోపాలిటన్ ప్రణాళికలు అమలు చేసే అవకాశం లభించింది. కొత్తగా విలీనమైన ప్రాంతాలకు జిహెచ్‌ఎంసి నిధులు, సాంకేతిక నైపుణ్యం, అలాగే పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, ప్రజారోగ్యం, దోమల నివారణ, అత్యవసర సేవలు వంటి ప్రామాణిక పౌర సేవలు అందనున్నాయి.

**సమతుల్య, సుస్థిర పట్టణ అభివృద్ధి దిశగా**

విస్తృత పన్నుల ఆధారం, సరళీకృత పరిపాలనతో జిహెచ్‌ఎంసి ఆర్థిక, సంస్థాగత సామర్థ్యం గణనీయంగా పెరిగింది. ఈ పునర్వ్యవస్థీకరణతో సమతుల్య పట్టణ అభివృద్ధి, మెరుగైన విపత్తుల, వరదల నిర్వహణ, నగర కేంద్రం నుంచి అంచు ప్రాంతాల వరకూ సమాన మౌలిక వసతుల అభివృద్ధి సాధ్యమవుతుందని అధికారులు చెబుతున్నారు. విస్తరించిన, పునర్వ్యవస్థీకరించిన జిహెచ్‌ఎంసి సమర్థ పాలన, సమగ్ర అభివృద్ధి, సుస్థిర పట్టణ వృద్ధి అనే లక్ష్యాలతో హైదరాబాద్ భవిష్యత్తుకు ఒక ఏకీకృత విధానాన్ని ప్రతిబింబిస్తోంది. ప్రపంచస్థాయి మెట్రోపాలిటన్ నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దే దిశగా ఇది కీలక అడుగుగా నిపుణులు భావిస్తున్నారు.

## విలీనంతో మెగా సిటీగా గ్రేటర్ హైదరాబాద్

### జిహెచ్‌ఎంసి కమిషనర్ కర్ణన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శివారు మున్సిపల్ స్థానిక సంస్థలను జిహెచ్‌ఎంసిలో విలీనం చేయడం ద్వారా గ్రేటర్ హైదరాబాద్ దేశంలోనే ఒక మెగా సిటీగా అవతరించిందిన కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అన్నారు. మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి)లో నూతనంగా ఏర్పాటు చేసిన జోన్‌లకు నియమకమైన కమిషనర్లు శుక్రవారం పదవీబాధ్యతలు స్వీకరించారు. నూతనంగా ఏర్పాటు చేసిన రాజేంద్రనగర్, గోల్కొండ జోనల్ కమిషనర్ కార్యాలయాలను కమిషనర్ కర్ణన్ ప్రారంభించారు. రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్‌గా అనురాగ్ జయంతి, గోల్కొండ జోనల్ కమిషనర్‌గా జి. ముకుంద రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. కమిషనర్ కర్ణన్ మాట్లాడుతూ విలీన ప్రక్రియతో జిహెచ్‌ఎంసి పరిధి విస్తృతంగా పెరిగిందని తెలిపారు. గతంలో 650 చదరపు కిలోమీటర్లుగా ఉన్న జిహెచ్‌ఎంసి విస్తీర్ణం ప్రస్తుతం 2,053 చదరపు కిలోమీటర్లకు చేరుకుందన్నారు. విస్తరించిన పరిపాలనా పరిధిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం జిహెచ్‌ఎంసి వార్డుల సంఖ్యను 150 నుంచి 300కు పెంచిందని, జోన్‌ల సంఖ్యను ఆరు నుంచి 12కు, సర్కిళ్ల సంఖ్యను 30 నుంచి 60కు పెంచిందని తెలిపారు. ఉప్పల్, కుత్బుల్లాపూర్, మల్కాజ్‌గిరి, శంషాబాద్, గోల్కొండ, రాజేంద్రనగర్ ప్రాంతాల్లో కొత్త జోన్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అదనంగా ఏర్పాటు చేసిన జోనల్, సర్కిల్ కార్యాలయాల ద్వారా ప్రజలకు పౌర సేవలు వేగంగా, సులభంగా అందుతాయని, నగరవ్యాప్తంగా అభివృద్ధి పనులు మరింత వేగవంతం అవుతాయని కమిషనర్ కర్ణన్ అన్నారు.

**బాధ్యతలు స్వీకరించిన జోనల్ కమిషనర్లు..**

నూతనంగా నియమితులైన వారితో పాటు ఇప్పటికే జోనల్ కమిషనర్లుగా కొనసాగుతున్న సికింద్రాబాద్ జోనల్ కమిషనర్లు ఎన్.రవి కిరణ్, ఎల్.బి.నగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్, కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌గా అపూర్వ చౌహాన్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు, బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా కుత్బుల్లాపూర్‌కు సందీప్ కుమార్ ఝా, చార్మినార్‌కు ఎస్.శ్రీనివాస్ రెడ్డి, గోల్కొండకు జి.ముకుంద రెడ్డి, ఖైరతాబాద్‌లో ప్రియాంక అలా, రాజేంద్రనగర్‌లో అనురాగ్ జయంతి, శంషాబాద్‌లో కె.చంద్రకళ, మల్కాజిగిరిలో సంచిత్ గంగ్వార్, ఉప్పల్ రాధికా గుప్తాలు జోనల్ కమిషనర్లుగా పదవీబాధ్యతలు స్వీకరించారు.




## డ్రగ్స్ కట్టడిపై స్పెషల్ ఫోకస్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నూతన సంవత్సర వేడుకల వేళ నగరంలో డ్రగ్స్ కట్టడిపై హైదరాబాద్ నగర పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. 'జీరో డ్రగ్స్' విధానమే లక్ష్యంగా కఠిన చర్యలు చేపట్టాలని సిటీ పోలీసు కమిషనర్ విసి సజ్జనర్ అధికారులను ఆదేశించారు. బంజారాహిల్స్‌లోని టిజిఐసిసిసి శుక్రవారం ఆయన హెచ్‌న్యూ, టాస్క్‌ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్, వెస్ట్‌జోన్, సిసిఎస్ తదితర విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించి, దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకల సందర్భంగా డ్రగ్స్ వినియోగాన్ని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. 'శుక్రవారం నుంచే నగరంలోని పబ్‌లు, హోటళ్లు, రెస్టారెంట్లు, ఈవెంట్లు జరిగే ప్రదేశాల్లో ప్రత్యేక నిఘా బృందాలను మోహరించాం. ప్రధాన వేదికలతో పాటు సర్వీస్ అపార్ట్‌మెంట్లు, హాస్టళ్లలో జరిగే ప్రైవేట్ పార్టీలపైనా మా నిఘా ఉంటుంది. గత రెండేళ్లలో డ్రగ్స్ కేసుల్లో నిందితులుగా ఉన్నవారి కదలికలను నిశితంగా గమనిస్తున్నాం. డ్రగ్స్ సరఫరా చేసేవారు, వాటికి అలవాటు పడిన వారి జాబితా సిద్ధం చేసి వారిపై నిరంతర నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించాం. నగరానికి కొత్తగా వచ్చేవారి వివరాలనూ ఆరా తీస్తున్నాం'' అని సిపి అన్నారు.

**రాత్రి 1 గంట వరకే వేడుకలకు అనుమతి..**

వేడుకల సమయపాలనపై సిపి హెచ్చరిస్తూ.. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా పబ్స్, హోటళ్లు, రెస్టారెంట్లు కచ్చితంగా రాత్రి 1 గంటకే మూసివేయాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాటి లైసెన్సులను రద్దు చేస్తామని తేల్చిచెప్పారు. నిఘా పేరుతో సామాన్య ప్రజలకు ఎలాంటి ఆటంకం కలగకుండా, వేడుకలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని అధికారులకు సూచించినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిసిపిలు ఎన్.శ్వేత, కె.అపూర్వ రావు, రక్షిత కృష్ణమూర్తి, సిహెచ్. రూపేష్, చింతమనేని శ్రీనివాస్, గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, టాస్క్‌ఫోర్స్ అదనపు డిసిపిలు అందే శ్రీనివాస రావు, ఇక్బాల్ సిద్ధిఖీ పాల్గొన్నారు.

## మనిషిని బతికించే సంజీవని పుస్తకం

### చీకటిని తొలగించే దీపాల్లా.. పుస్తకాలు జ్ఞానాన్ని ప్రసాదిస్తాయి: సుద్దాల అశోక్ తేజ
### మృత్యువు అంచున ఉన్న మనిషికి ప్రాణం పోసేది పుస్తకం: జయరాజు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** 38వ హైదరాబాద్ పుస్తక ప్రదర్శనలో 'పుస్తక స్ఫూర్తి' వేదికపై 'నేలమ్మా నేలమ్మా' అనే గీతంతో సభికులను ఉర్రూతలూగించిన సుద్దాల అశోక్ తేజ, మనిషిని బతికించే సంజీవని పుస్తకమేనని స్పష్టం చేశారు. సమాజానికి నేడు భజనకారుల కంటే సృజనకారుల అవసరం ఎంతో ఉందని, చీకటిని తొలగించే దీపాల్లా పుస్తకాలు జ్ఞానాన్ని ప్రసాదిస్తాయని కొనియాడారు.అనిశెట్టి రజిత వేదికపై శుక్రవారం సాయంత్రం పుస్తక స్ఫూర్తి, పుస్తకం ఒక దారిదీపం చర్చా కార్యక్రమం జరిగింది. హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు కవి యాకుబ్ సభను ప్రారంభించగా, సుద్దాల అశోక్ తేజ, జయరాజు సభను ఉద్దేశించి మాట్లాడారు. ఈ చర్చాగోష్ఠి కార్యక్రమానికి సమన్వయ కర్తలుగా ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్, పేర్ల రాములు వ్యవహరించారు. 'కన్ను మూసే దాకా పెన్ను మూసేదేలే.. పెన్ను మూసేదాకా కన్ను మూసేదేలే' అంటూ ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ తన అక్షర నిబద్ధతను చాటుకోగా, షడ్రుచోపేతమైన భోజనం శరీరాన్ని పోషిస్తే, నవరసోపేతమైన పుస్తకం మెదడుకు అసలైన భోజనమని ఆయన అభివర్ణించారు. ఆరో తరగతిలోనే తల్లి ప్రోత్సాహంతో మాగ్జిమ్ గోర్కీ 'అమ్మ' పుస్తకాన్ని చదివి ప్రభావితుడనయ్యానని, ప్రేమ్ చంద్ 'రంగభూమి'లోని 'గుడ్డివాడు చూడలేడు కానీ ఏడవగలడు' అన్న వాక్యం తన జీవితాన్ని మలుపు తిప్పిందని గుర్తు చేసుకున్నారు. శరత్ చంద్ర 'శేష ప్రశ్న' వంటి రచనలు తన ఆలోచనా దృక్పథాన్ని మార్చాయన్నారు.

**మృత్యువు అంచున ఉన్న మనిషికి ప్రాణం పోసేది పుస్తకం: జయరాజు**

పుస్తకం కేవలం జ్ఞానాన్ని మాత్రమే కాదు, మృత్యువు అంచున ఉన్న మనిషికి ప్రాణాన్ని కూడా పోస్తుందని ప్రముఖ ప్రజా కవి జయరాజు పేర్కొన్నారు. 'పుస్తక స్ఫూర్తి' కార్యక్రమంలో ఆయన తన జీవితానుభవాన్ని పంచుకున్నారు. 20 ఏళ్ల క్రితం క్యాన్సర్ బారిన పడి, మరో రెండు నెలలు మాత్రమే బతుకుతానని డాక్టర్లు చేతులెత్తేసిన తరుణంలో బాబాసాహెబ్ అంబేద్కర్ 'దినచర్య'కు సంబంధించిన ఒక చిన్న పుస్తకం తన ప్రాణాలను నిలిపిందని వెల్లడించారు. ఆ పుస్తకం చదివిన తర్వాత కలిగిన స్ఫూర్తితోనే అంబేద్కర్ 'జగోరే జాగో' వంటి అద్భుత గీతాలను రచించానని, ఆ సంకల్ప బలంతోనే క్యాన్సర్‌ను జయించి నేడు మీ ముందు నిలబడ్డానని తెలిపారు. జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే వంటి మహనీయుల అక్షర వెలుగులు బడుగు బలహీన వర్గాలకు మార్గదర్శకాలని కొనియాడారు. యుద్ధం (విప్లవం) నుంచి వచ్చిన తాను బౌద్ధం చదివిన తర్వాత శాంతి మార్గంలోకి మళ్లానని, మనిషి మస్తిష్కంలోకి వెళ్లే ఒక్క మంచి పుస్తకం ప్రాణాంతక రోగాలను సైతం మాయం చేస్తుందని జయరాజు స్పష్టం చేశారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు ప్రముఖ కవి యాకూబ్ మాట్లాడుతూ ఒక మంచి పుస్తకం మనిషి జీవితంలోకి ప్రవేశిస్తే అది ఆలోచనలను మేల్కొలిపి అద్భుతమైన ప్రతిభగా మారుతుందని పేర్కొన్నారు. ప్రజా కవి జయరాజు జీవితంలోకి ఒక పుస్తకం వచ్చిన తర్వాతే 'వానమ్మ ఒక్కసారన్నా ఇట్లా వచ్చి పోవమ్మ' వంటి హృదయాన్ని కదిలించే పాటలు పుట్టుకొచ్చాయని గుర్తుచేశారు. అదేవిధంగా జాతీయ స్థాయిలో సినీ గేయ రచయితగా గుర్తింపు పొందిన సుద్దాల అశోక్ తేజ గీతాలు తెలంగాణ సమాజంలో ప్రతి ఒక్కరి నాలుకపై ఆడుతుంటాయని కొనియాడారు. పుస్తక మేళాకు వచ్చిన సందర్శకుల్లో పఠనాసక్తిని పెంపొందించడానికి ఇటువంటి కళాకారుల జీవితానుభవాలు, వారి పాటలు ఎంతో స్ఫూర్తినిస్తాయని యాకూబ్ వివరించారు. భూమిలోకి వెళ్లిన విత్తనం వృక్షంగా మారినట్లే, పుస్తకంలోని అక్షరం మనిషిని కళాకారుడిగా తీర్చిదిద్దుతుందని ఆయన అభివర్ణించారు.

## 90 శాతం చర్చలు సఫలం

### యుద్ధ ముగింపు దిశగా ఉక్రేన్ పరిణామాలు!
### రేపు ట్రంప్‌తో సంభాషణ : జెలెన్‌స్కీ ప్రకటన

**కీవ్:** ఉక్రేన్‌లో యుద్ధం ముగించే సానుకూల దిశగా చర్చలు ముందుకు వెళుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. డోనాల్డ్ ట్రంప్‌తో ఆదివారం జెలెన్‌స్కీ సమావేశం కానున్నారు. ట్రంప్‌తో సంభాషణల నిమిత్తం ఫ్లోరిడాకు వెళ్ళాలనుకుంటున్నట్లు జెలెన్‌స్కీ శుక్రవారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. తద్వారా యుద్ధం ముగింపునకు దాదాపు చేరువైనట్లు ఆయన సంకేతాలిచ్చారు. 90 శాతం చర్చలు సఫలమయ్యాయని చెప్పారు. 20 అంశాల ప్రణాళిక 90 శాతం మేరకు సిద్ధంగా ఉందని చెప్పారు. ఐతే అన్నీ నూటికి నూరుశాతం సిద్ధంగా ఉండాలన్నదే తమ లక్ష్యమని, అందులో భాగంగా ట్రంప్‌ను కలవాలనుకుంటున్నాన్నారు. కొత్త సంవత్సరానికి ముందుగానే చాలా విషయాలను పరిష్కరించగలమన్నారు. ముందురోజు గురువారం ట్రంప్ దూతలు స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నర్‌లతో జెలెన్‌స్కీ సంభాషణలు జరిపారు. ఈ సంభాషణలు చాలా బాగా జరిగాయన్నారు. మొదట ట్రంప్ 28 అంశాలతో శాంతి ప్రణాళిక ప్రతిపాదించారు. అమెరికా మధ్యవర్తిత్వం ద్వారా అనేక మార్పులు చేర్పులు వడపోతలు జరిగాయి. తర్వాత జెలెన్‌స్కీ 20 అంశాలతో ప్రణాళికను ఖరారు చేశారు. ట్రంప్ ప్రణాళికతోపాటు ఉక్రేన్‌కు భద్రతా హామీలను కూడా పొందడానికి సంబంధించిన ప్రత్యేక ప్రణాళికను కూడా ట్రంప్ ముందుంచేందుకు జెలెన్‌స్కీ సిద్ధమవుతున్నారు. ఐతే ఈ ప్రణాళికలో పుతిన్ ఇష్టపడని అంశాలు ఉన్నాయి.

**జెలెన్‌స్కీ ప్రణాళికలో కీలక డిమాండ్లు ఇవే !**

– ఒప్పందాన్ని ఆమోదించిన వెంటనే కాల్పుల విరమణ అమలులోకి రావాలి
–ఒప్పంద ఉల్లంఘనలు జరిగితే ఆంక్షలు
–ఒప్పందంపై సంతకాలు జరిగిన తర్వాత ఉక్రేన్‌లో ఎన్నికలు
–శాంతి ఒప్పందానికి న్యాయబద్ధంగా కట్టుబడి ఉండాలి
–శాంతి మండలికి ట్రంప్ అధ్యక్షత వహించాలి
–భూభాగ సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదు
–ఝపోరిఝియా అణు కర్మాగారం (రష్యా అధీనంలో ఉంది) సమస్య పరిష్కారం కాలేదు
–అది అమెరికా–ఉక్రేన్ ఉమ్మడి నియంత్రణలో ఉండాలి
–ప్రస్తుతం ఉన్న సరిహద్దులను స్తంభింపజేయాలి
–ఉక్రేన్ ఒక అణ్వస్త్ర రహిత దేశంగా ఉంటుంది
–ఉక్రేన్‌కు 800 బిలియన్ డాలర్ల పునర్నిర్మాణ నిధులు కావాలి
–అమెరికా–ఉక్రేన్ మధ్య స్వేచ్ఛావాణిజ్యం సత్వరం జరగాలి
–నిర్దేశిత తేదీనాటికి ఇ.యు కూటమిలో ఉక్రేన్ చేరాలి
–ఇ.యు మార్కెట్ అందుబాటులో ఉండాలి
–పెట్టుబడుల ఒప్పందం జరగాలి
–8 లక్షలమంది సైన్యం ఉక్రేన్ వద్ద ఉంటుంది
–దురాక్రమణ చేయకుండా రష్యా చట్టం తేవాలి
–డ్నిప్రోవ్ నదీ జలాలను, నల్లసముద్రాన్ని స్వేచ్ఛగా ఉపయోగించుకోవాలి
–సముద్ర జలాల్లో రాకపోకలకు వీలుగా ఒప్పందం ఉండాలి
–కీలకమైన సైనికంగా ప్రాధాన్యతగల''కిన్‌బర్న్ స్పిట్'' ప్రాంతాన్ని నిస్సైనికీకరణ చేయాలి.
–పౌర ఖైదీలందరినీ తిరిగి అప్పగించాలి
–బాధితులకు మద్దతు ఇచ్చే నిబంధనలు ఒప్పందంలో ఉండాలి
–యుద్ధ ఖైదీలందరినీ పరస్పర మార్పిడి చేసుకోవాలి
–పిల్లలను, బందీలను తిరిగి అప్పగించాలి.
–అమెరికా చెప్పినట్లు నిస్సైనికీకరణ మండలాలుండాలి
–ఈ ప్రాంతాల సరిహద్దుల్లో భవిష్యత్తులో మార్పులు ఉండకూడదు.

**దక్షిణ మధ్య రైల్వే**

Follow us on @SCRailwayindia

దక్షిణమధ్య రైల్వే టెండరు నోటీసుల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడగలరు.

**నెం. Y/C. e-Auction/HYB/2025-26**
**తేదీ: 23.12.2025**

PUB/1665

భారత రాష్ట్రపతి తరపున, దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, హైదరాబాద్ డివిజన్‌లో పార్కింగ్ స్టాండ్, ఇతర స్థిరమైన సేవలు కేటగిరీ కింద వాణిజ్య ఒప్పందాల కేటాయింపు నిర్ణయం కోసం IREPS వెబ్‌సైట్: www.ireps.gov.in ఇ-వేలం లీజింగ్ మాడ్యూల్ ద్వారా ఇ-వేలానికి ఆహ్వానం. ఇ-వేలం షెడ్యూల్ ఇక్కడ వివరించబడింది.

**క్రమ సంఖ్య .: 01 వర్గం:** పార్కింగ్ **కేటలాగ్ నం.:** HYB-MIXED-055 **వివరాలు:** మలక్‌పేట (ప్రధాన), అల్వాల్ (పశ్చిమ వైపు) & గద్వాల్ రైల్వే స్టేషన్లలో మూడు ప్రదేశాలలో పార్కింగ్ స్థలాల కేటాయింపు నిర్ణయానికి **వేలం తేదీ:** 07.01.2026 **వేలం ప్రారంభ సమయం:** 11:30 గంటలు. **వేలం ముగింపు సమయం:** మధ్యాహ్నం 1:20 గంటలు.

**క్రమ సంఖ్య.: 02 వర్గం:** పార్కింగ్ **కేటలాగ్ నం.:** HYB-MIXED-055 **వివరాలు:** రైల్వే స్టేషన్లు కాకుండా 02 నిజామాబాద్ (బస్టాండ్ ఎదురుగా) వద్ద NFR పార్కింగ్ స్థలం కేటాయింపు నిర్ణయానికి **వేలం తేదీ:** 07.01.2026 **వేలం ప్రారంభ సమయం:** ఉదయం 11:30 గంటలు. **వేలం ముగింపు సమయం:** మధ్యాహ్నం 1:20 గంటలు.

**క్రమ సంఖ్య.: 03 వర్గం:** MSS-HYB-STPD-EVC-117-25-1(ఇతర- స్థిరమైన సేవలు EV ఛార్జింగ్ స్టేషన్లు) **కేటలాగ్ సంఖ్య:** HYB-MIXED-055 **వివరాలు:** రైల్ నిలయం ప్రాంగణంలోని EV ఛార్జింగ్ స్టేషన్, **వేలం తేదీ:** 07.01.2026 **వేలం ప్రారంభ సమయం:** ఉదయం 11:30 గంటలు. **వేలం ముగింపు సమయం:** మధ్యాహ్నం 1:20 గంటలు.


**క్రమ సంఖ్య.: 04 వర్గం:** MSS-HYB-STPD-EVC-101-25-1(ఇతర -స్థిరమైన సేవలు-EV ఛార్జింగ్ స్టేషన్లు) **కేటలాగ్ సంఖ్య:** HYB-MIXED-055 **వివరాలు:** EV ఛార్జింగ్ స్టేషన్ హైదరాబాద్ భవన్ ప్రాంగణం **వేలం తేదీ:** 07.01.2026 **వేలం ప్రారంభ సమయం:** ఉదయం 11:30 గంటలు. **వేలం ముగింపు సమయం:** మధ్యాహ్నం 1:20 గంటలు.

**క్రమ సంఖ్య.: 05 వర్గం:** MSS-HYB-UR-GZ-115-25-1(ఇతర- స్థిరమైన సేవలు గేమింగ్ జోన్) **కేటలాగ్ సంఖ్య:** HYB-MIXED-055 **వివరాలు:** ఉమ్దానగర్ రైల్వే స్టేషన్లో స్నాక్స్ బార్‌తో కూడిన గేమింగ్ జోన్. **వేలం తేదీ:** 07.01.2026 **వేలం ప్రారంభ సమయం:** ఉదయం 11:30 గంటలు. **వేలం ముగింపు సమయం:** మధ్యాహ్నం 1:20 గంటలు.

**క్రమ సంఖ్య.: 06 వర్గం:** MSS-HYB-SBBJ-STGen-109-25-1 (ఇతర -స్థిరమైన సేవలు -స్టాటిక్ జనరల్) **కేటలాగ్ సంఖ్య:** HYB-MIXED-055 **వివరాలు:** శ్రీ బాల బ్రహ్మేశ్వర జోగులాంబ హాల్ట్ స్టేషన్లో AC/నాన్-AC రిటైరింగ్ రూమ్, పార్కింగ్ మరియు ఫుడ్ ట్రక్ యొక్క ఆపరేషన్ మరియు నిర్వహణ. **వేలం తేదీ:** 07.01.2026 **వేలం ప్రారంభ సమయం:** ఉదయం 11:30 గంటలు. **వేలం ముగింపు సమయం:** మధ్యాహ్నం 1:20 గంటలు.

**క్రమ సంఖ్య.: 07 వర్గం:** MSS-HYB-KCG-PS-116-25-1 (ఇతర -స్థిరమైన సేవలు- ప్రీమియం స్టోర్స్) **కేటలాగ్ సంఖ్య:** HYB-MIXED-055 **వివరాలు:** కాచిగూడ రైల్వే స్టేషన్లోని ప్రీమియం బ్రాండ్ స్టోర్లు / స్టాల్స్ / అవుట్‌లెట్లు. వేలం తేదీ: 07.01.2026 వేలం ప్రారంభ సమయం: ఉదయం 11:30 గంటలు. వేలం ముగింపు సమయం: మధ్యాహ్నం 1:20 గంటలు.

A2120 సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, హైదరాబాద్



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఎర్రకోట పేలుడు నిందితులకు ఎన్ఐఎ కస్టడీ పొడిగింపు

**న్యూఢిల్లీ:** దేశ రాజదాని ఢిల్లీలోని ఎర్రకోట పేలుడు కేసులో ఇద్దరు నిందితులకు ఎన్ఐఎ కస్టడీని కోర్టు పొడిగించింది. నిందితుడు యాసిర్ అహ్మద్‌దారును మరో పది రోజుల పాటు కస్టడీలో ప్రశ్నించడానికి అడిషనల్ సెషన్స్ జడ్జి ప్రశాంత్ శర్మ దర్యాప్తు సంస్థకు శుక్రవారం అనుమతి ఇచ్చారు, మరో నిందితుడు డాక్టర్ బిలాల్ నసీర్ మల్లాను మరో ఎనిమిది రోజుల పాటు విచారించనున్నారు. విచారణను మీడియా కవర్ చేయడాన్ని నిషేధించారు. జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) వివరాల ప్రకారం.. నవంబర్ 10న ఎర్రకోట వెలుపల పేలిన పేలుడు ఘటనలో పేలుడు పదార్థాలతో నిండిన కారును నడుపుతున్న ఉమర్‌ఉన్‌నబి, 15 మంది ప్రాణాలను బలిగొన్న ఉగ్రవాద దాడికి ప్రణాళిక వేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) డిసెంబర్ 9న ఢిల్లీలో డాక్టర్ మల్లాను అరెస్టు చేసింది, ఆయనను కుట్రలో కీలక నిందితుడిగా పేర్కొంది. ఎన్ఐఎ దర్యాప్తు ప్రకారం నసీర్ ఉమర్‌ఉన్‌నబీకి ఉద్దేశపూర్వకంగా మద్దతు అందించడం ద్వారా ఆశ్రయం కల్పించాడని తెలుస్తోంది.

## మనోహ్మాన్‌సింగ్‌కు ఘననివాళి

•మాజీ ప్రధాని వినయం, నిజాయితీ, వారసత్వం భవిష్యత్ తరాలకు స్పూర్తి అని శ్లాఘించిన కాంగ్రెస్ నేతలు



**న్యూఢిల్లీ:** మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ వినయం, నిజాయితీ, వారసత్వం భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయని కాంగ్రెస్ నేతలు కొనియాడారు. మన్మోహన్ తొలి వర్ధంతి సందర్భంగా శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ఆయనకు నివాళులు అర్పించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ సింగ్‌ను పరివర్తన కలిగించే నాయకుడిగా అభివర్ణించారు. ఆయన దేశ ఆర్థిక మార్గాన్ని పునర్నిర్మించారని, ఆర్థిక సంస్కరణల ద్వారా లక్షలాది మందికి అవకాశాలను విస్తరించారని, లక్షలాది మందిని పేదరికం నుండి బయటపడేశారన్నారు. 'తన వినయం, సమగ్రత, జ్ఞానానికి పేరుగాంచిన సింగ్... గౌరవం, కరుణతో నాయకత్వం వహించారని, పురోగతి అందరినీ కలుపుకుని ఉండేలా, సంక్షేమం అత్యంత అవసరమైన వారికి చేరేలా చూసుకున్నారు. హక్కుల ఆధారిత నమూనా ఆ విధానానికి నిదర్శనమని, ఆయన దార్శనికత కింద తాము బలమైన భారతదేశాన్ని నిర్మించామని చెప్పారు. 'నిజాయితీ గల ప్రజా సేవ, శాశ్వత సంస్కరణల వారసత్వం తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉండే రాజనీతిజ్ఞుడికి హృదయపూర్వక నివాళి అర్పిస్తున్నాము' అని కాంగ్రెస్ చీఫ్ ఎక్స్‌లో పోస్టు చేశారు. లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ కూడా మాజీ ప్రధానికి నివాళులు అర్పించారు. 'తన దార్శనిక నాయకత్వం ద్వారా, ఆయన భారతదేశాన్ని ఆర్థికంగా సాధికారపరిచారు. ఆయన చారిత్రాత్మక ప్రయత్నాలు, పేదల కోసం సాహసోపేతమైన నిర్ణయాలు ప్రపంచ వేదికపై భారతదేశానికి కొత్త గుర్తింపును ఇచ్చాయి' అని గాంధీ అన్నారు. 'ఆయన వినయం, కృషి, నిజాయితీ ఎల్లప్పుడూ మనందరికీ స్ఫూర్తిదాయకంగా ఉంటాయి' అని ఆయన అన్నారు. 'సమగ్రత, వినయం, దార్శనికత కలిగిన రాజనీతిజ్ఞుడిని గుర్తుంచుకుంటాము' అని కాంగ్రెస్ ఎక్స్‌లో పేర్కొంది. మన్మోహన్ నాయకత్వం భారతదేశ ఆర్థిక వ్యవస్థను, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసిందని, నిస్వార్థంగా, దృఢ సంకల్పంతో దేశానికి సేవ చేసిన ప్రధానమంత్రికి నివాళులు అని పార్టీ పేర్కొంది. 'మన్మోహన్ సింగ్ జీ సమానత్వంలో బలమైన విశ్వాసం, బలమైన, ధైర్యవంతుడు, గౌరవప్రదమైన వ్యక్తి, దేశ పురోగతికి నిజంగా అంకితభావంతో ఉన్నారు. ఆయన సరళత, నిజాయితీ, దేశం పట్ల అంకితభావం ఎల్లప్పుడూ మనందరికీ స్ఫూర్తినిస్తాయి' అని ప్రియాంక గాంధీ వాద్రా అన్నారు. 2004 నుండి 2014 వరకు ప్రధానమంత్రిగా పనిచేసిన సింగ్ గత సంవత్సరం 92 సంవత్సరాల వయసులో మరణించారు. నరసింహారావు ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా పనిచేశారు. ఆర్థిక సంస్కరణల సమగ్ర విధానాన్ని ప్రవేశపెట్టిన ఘనత పొందారు.

## బాలల్లో నిండి ఉన్న దేశభక్తి, ఉన్నత ఆదర్శాలే...

# దేశం ఔన్నత్యాన్ని ఇనుమడిస్తుంది

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- 'వీర్ బాల్ దివస్'లో భాగంగా 20మంది బాలలకు 'ప్రధాన్ మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్' ప్రదానం



**న్యూఢిల్లీ:** రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో అవార్డులు ప్రకటించబడుతోన్న ఆ 20 మంది బాలలు...పేరుకే బాలలు. కానీ... ధైర్యసహసాలు, ఉదారత, సమయస్ఫూర్తి నిండిన సమ్మిళిత సమర్థతను అఖండ భారతానికి చాటిచెప్పిన అసహాయ శూరులు. మానవత్వం నిలువెత్తునా పరిమళించిన చిన్నారులు. వారందరూ యావత్ భారత్‌దేశానికి నిత్యజ్వలిత స్ఫూర్తి ప్రదాతలు. ఆ చిన్నారి చిరుతలు ధైర్యసహసాలు ప్రదర్శిస్తున్న సమయంలో అక్కడికక్కడే అసువులు బాసిన వాళ్లు కొందరు ఉన్నారు. వారి తరపున అవార్డు స్వీకరణకు బరువెక్కిన బాధాతప్త హృదయులై హాజరైన తల్లిదండ్రులు కొందరుకాగా, రికార్డులు సృష్టించిన ఇంకొందరు చిన్నారులు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా శుక్రవారం నాడు 'ప్రధాన్‌మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్'ను అందుకునే అరుదైన అద్భుత సందర్భం...రాష్ట్రపతిభవన్ లో సంతోషం ఒకవైపు నిర్వేదం మరొకవైపు సమానంగా ఆవరించిన ఒక ఘట్టం ఆవిష్కృతమైంది. ధైర్య సాహసాలు, సామాజిక సేవ, పర్యావరణం, క్రీడలు, కళలు, సంస్కృతి, సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాలలో అసాధారణ విజయాలు సాధించడాన్ని గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఎంపికచేసిన 20మంది బాలలు ప్రతి ఏటా డిసెంబరు 26న జరుపుకునే 'వీర్ బాల్ దివస్'లో భాగంగా ప్రధాన్‌మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్‌లను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ముర్ము మాట్లాడుతూ తొలుత ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్ గ్రహీతలను అభినందించారు. అవార్డులు గెలుచుకున్న బాలలు వారి కుటుంబాలకు, సమాజాలకు, దేశానికి కూడా గర్వకారణమని అన్నారు. ఈ అవార్డులు దేశవ్యాప్తంగా ఉన్న పిల్లలందరికీ స్ఫూర్తినిస్తాయని రాష్ట్రపతి విశ్వాసం వ్యక్తం చేశారు. ధైర్య సాహస ప్రతిభావంతులైన వారిని ప్రోత్సహించేందుకు ఈ పురస్కారాలు అందజేస్తున్నాయని ఆమె తెలియజేశారు. డిసెంబరు 26న జరుపుకునే 'వీర్ బాల్ దివస్' ప్రాముఖ్యత గురించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ దాదాపు 320సంవత్సరాల క్రితం భారతీయులు అందరూ గౌరవించే పదవ సిక్కు గురువు గురు గోవింద్ సింగ్ జీ, అతని నలుగురు కుమారులు సత్యం, న్యాయానికి మద్దతుగా పోరాడుతూ 'అత్యున్నత త్యాగాలు' చేశారని ఆమె శ్లాఘించారు. బాబా జోరావర్ సింగ్, బాబా ఫతే సింగ్ అనే ఇద్దరు చిన్న సాహిబ్జాదాల ధైర్యాన్ని భారతదేశమే కాకుండా విదేశాలలో కూడా గౌరవిస్తున్నారని రాష్ట్రపతి చెప్పారు. అదే సమయంలో సత్యం, న్యాయం కోసం ప్రాణాలర్పించిన ఇక్కడి గొప్ప బాల కథానాయకులు, నాయకురాళ్లను ఆమె గుర్తుచేశారు. ఒకదేశం గొప్పతనం ఆ దేశ పిల్లల్లో దేశభక్తి, ఉన్నత ఆదర్శాలు నిండిఉంటే ఖచ్చితంగా ఇనుమడిస్తుందని ముర్ము చెప్పారు. ధైర్యం, కళ, సంస్కృతి, పర్యావరణం, ఆవిష్కరణలు, సైన్స్ అండ్ టెక్నాలజీ, సామాజిక సేవ, క్రీడల వంటి వివిధ రంగాలలో పిల్లలు తమ అసాధారణ ప్రతిభను ప్రదర్శించారని గమనించి తాను చాలా సంతోషిస్తున్నానని రాష్ట్రపతి తెలియజేశారు. 'ఏడేళ్ల వాకా లక్ష్మి ప్రాగ్నిక వంటి ప్రతిభావంతులైన పిల్లల కారణంగానే భారతదేశం 'ప్రపంచ చెస్ పవర్ హౌస్'గా పరిగణించబడుతోందని అన్నారు. తమ ధైర్యం, తెలివితేటలతో ఇతరుల ప్రాణాలను కాపాడిన అజయ్‌రాజ్‌చ, మహ్మద్ సిదాన్. పి అన్ని ప్రశంసలకూ, పురస్కారాలను స్వీకరించేందుకు అర్హులు' అని ముర్ము పేర్కొన్నారు. తొమ్మిదేళ్ల కూతురు వ్యోమ ప్రియ, 11ఏళ్ల కుమారుడు కమలేష్ కుమార్ వారి ధైర్యంతో ఇతరుల ప్రాణాలను కాపాడుతూ ప్రాణాలు కోల్పోయారని, ఆపరేషన్ సిందూర్ సమయంలో యుద్ధ ప్రమాదాల మధ్య పదేళ్ల శ్రావణ్ సింగ్ తన ఇంటికి దగ్గరలోని సరిహద్దులో ఉన్న భారత సైనికులకు క్రమం తప్పకుండా నీరు, పాలు, లస్సీని సరఫరా చేసేవాడని దివ్యాంగురాలైన కూతురు శివానీ హోసురు ఉప్పర ఆర్థిక, శారీరక పరిమితులను అధిగమించి క్రీడా ప్రపంచంలో అసాధారణ విజయాలు సాధించిందని రాష్ట్రపతి ముర్ము చెప్పారు. అత్యంత పోటీతత్వం, ప్రతిభతో నిండి ఉన్న క్రికెట్ ప్రపంచంలో వైభవ్ సూర్యవంశీ తన కంటూ పేరు తెచుచకునేలా అనేక రికార్డులు నెలకొల్పాడని అవార్డులు గెలుచుకున్న కొంతమంది బాలల గురించి రాష్ట్రపతి ప్రస్తావించారు. ఈ ఏడాది 18 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుండి 20మంది ప్రతిభావంతులైన పిల్లలను సత్కరిస్తున్నట్లు ప్రకటించడం తనకు ఎంతో సంతోషంగా ఉందని, ఈ యువ హీరోలు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చారని రాష్ట్రపతి వివరించారు.

## వందేళ్ల సిపిఐ ఉత్సవాలు













# 'జెన్-జీ'పై గొప్ప నమ్మకం

మీరు దేశాభివృద్ధికి కృషి చేయాలి
ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ :** జెన్–జీ సామర్థ్యాలను, ఆత్మవిశ్వాసాన్ని చూస్తున్నానని, వారు కష్టపడి పనిచేసి, క్రమశిక్షణతో దేశాభివృద్ధికి కృషి చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. తద్వారా వికసిత్ భారత్ లక్ష్యాన్ని నెరవేర్చాలని సూచించారు. యువతకు వివిధ రంగాల్లో అపారమైన అవకాశాలు ఉన్నాయని అన్నారు. శుక్రవారం 'వీర్ బాల్ దివస్' సందర్భంగా జరిగిన జాతీయ కార్యక్రమంలో ప్రధాని మోదీ ఈ మేరకు యువతను ప్రోత్సహించారు. వయస్సుతో సంబంధం లేకుండా పెద్ద సవాళ్లను ఎదుర్కోవాలని మోదీ యువతకు సలహా ఇచ్చారు. 'మీరు అందరూ జెన్–జీ, జెన్‌ఆల్ఫా తరంవారు. మీ తరం భారత్‌ను అభివృద్ధి చెందిన దేశం అనే లక్ష్యం వైపు తీసుకువెళ్తుంది. నేను జెన్–జీ సామర్థ్యాలను, ఆత్మవిశ్వాసాన్ని చూస్తున్నాను. వారిని అర్థం చేసుకుంటున్నాను. మీకు నాకు గొప్ప నమ్మకం ఉంది. ఎవరు చిన్నవారు, ఎవరు పెద్దవారు అనేది వయస్సు నిర్ణయించదు. మీరు చేసే పనులు, సాధించే విజయాల ఆధారంగా గొప్పవారు అవుతారు. మీరు వయస్సులో చిన్నవారు అయినప్పటికీ, ఇతరులు మీ నుంచి స్ఫూర్తి పొందేలా మీరు పని చేయగలరు' అని అన్నారు. స్వల్పకాలిక ప్రజాదరణ (పాపులారిటీ) వల్ల యువత పరధ్యానానికి గురికావద్దని ప్రధాని మోదీ సలహా ఇచ్చారు. దేశ నిర్మాణానికి సహకరించిన మహానుభావుల నుంచి, గొప్ప వ్యక్తుల నుంచి ఆదర్శాలను, మంచి విషయాలను నేర్చుకోవాలని సూచించారు. తమ విజయాన్ని తమకే పరిమితం చేసుకోకుండా, దేశ విజయంగా మార్చడమే లక్ష్యంగా పని చేయాలని చెప్పారు. ఎన్‌డిఎ ప్రభుత్వ హయాంలో అనేక కార్యక్రమాలను చేపట్టి దేశంలోని నిరాశ, నిస్సహాయత వాతావరణాన్ని రూపుమాపిందని, ఇప్పుడు యువతకు ప్రతి రంగంలో పురోగతి సాధించడానికి అవకాశం ఏర్పడిందని మోదీ అన్నారు. 'గతంలో యువత కలలు కనడానికి కూడా భయపడేవారు. ఎందుకంటే పాత వ్యవస్థలు మంచి ఏదీ జరగదనే వాతావరణాన్ని సృష్టించాయి. అప్పట్లో ప్రతి చోట నిరాశ, నిస్సహాయత నెలకొని ఉండేది. కష్టపడి పనిచేయడం వల్ల కలిగే ప్రయోజనం ఏమిటని ప్రజలు ఆలోచించారు. కానీ నేడు పరిస్థితి మారింది. నేడు మన దేశం ప్రతిభను వెతికి పట్టుకుని, వారికి సరైన వేదికను అందిస్తోంది. 140 కోట్ల దేశ ప్రజల బలం వారి కలల వెనుక ఉంది' అని మోదీ అన్నారు. 'డిజిటల్ ఇండియా విజయంతో, ప్రజలకు ఇంటర్నెట్ అనే శక్తి అందుబాటులోకి వచ్చింది. నేడు మీరు నేర్చుకోవడానికి కావాల్సిన వనరలు ఉన్నాయి. సైన్స్, టెక్నాలజీ, స్టార్టప్ రంగాల్లో ప్రవేశించాలని అనుకునేవారికి స్టార్టప్ ఇండియా లాంటి మిషన్లు ఉన్నాయి. క్రీడల్లో రాణించాలని అనుకునేవారికి ఖేలో ఇండియా మిషన్ ఉంది' అని మోదీ అన్నారు. వీర్ సాహిబ్జాదాలను ప్రస్తావిస్తూ, వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని, యువత పెద్ద పెద్ద కలలు కనాలని, కష్టపడి పనిచేయాలని, తమ ఆత్మవిశ్వాసాన్ని ఎప్పుడూ సడలనివ్వకూడదని మోదీ సూచించారు. యువత భవిష్యత్ ఉజ్వలంగా ఉంటేనే భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని, వారి ధైర్యం, ప్రతిభ, అంకిత భావం దేశ ప్రగతికి మార్గనిర్దేశం చేస్తాయని మోదీ అన్నారు. 2022 జనవరి 9న ప్రధాన నరేంద్ర మోదీ కీలక ప్రకటన చేశారు. గురు గోవింద్ సింగ్ జీ కుమారుల అమరత్వాన్ని స్మరించుకుంటూ డిసెంబర్ 26ను 'వీర్ బాల్ దివస్'గా పాటిస్తామని ప్రకటించారు. అప్పటి నుంచి ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

# సుప్రీంకోర్టుకు వెళ్తాం

- 'ఉన్నావ్' అత్యాచార కేసులో దోషి కుల్దీప్ సింగ్ బెయిల్ రద్దు చేయాలి
- ఢిల్లీ హైకోర్టు వెలుపల బాధితురాలు తల్లి ఆందోళన



**న్యూఢిల్లీ:** 'ఉన్నావ్' అత్యాచార కేసులో దోషి కుల్దీప్ సింగ్‌కు విధించిన జీవిత ఖైదు శిక్షను నిలిపివేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం ఢిల్లీ హైకోర్టు వెలుపల బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. ఆల్ ఇండియా డెమోక్రటిక్ ఉమెన్స్ అసోసియేషన్ కార్యకర్తలు, సామాజిక కార్యకర్త యోగితా భయానా బాధితురాలి తల్లితో కలిసి కోర్టు వెలుపల నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బహిష్కృత బిజెపి ఎమ్మెల్యే సెంగార్ బెయిల్‌ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. గత వారం వెలువడిన తీర్పుకు వ్యతిరేకంగా ఢిల్లీ హైకోర్టు వెలుపల జరిగిన నిరసనలో పాల్గొన్న ఉన్నావ్ అత్యాచార బాధితురాలి తల్లి పిటిఐతో మాట్లాడుతూ దోషి కుల్దీప్ సింగ్‌కు విధించిన జీవిత ఖైదు శిక్షను నిలిపివేయడాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానని చెప్పారు. తన కుమార్తె తీవ్రమైన బాధను అనుభవించినందున నిరసన తెలిపేందుకు తాను హైకోర్టుకు వచ్చానని బాధితురాలి తల్లి చెప్పారు. తాను మొత్తం హైకోర్టును నిందించడం లేదని, కేవలం ఇద్దరు న్యాయమూర్తులను మాత్రమే నిందిస్తున్నానని, వారి నిర్ణయం తమ నమ్మకాన్ని దెబ్బతీసిందన్నారు. గతంలో న్యాయమూర్తులు తమ కుటుంబానికి న్యాయం చేశారని, కానీ ఇప్పుడు నిందితుడికి బెయిల్ మంజూరు చేశారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఇది మా కుటుంబానికి జరిగిన అన్యాయం. నాకు సుప్రీంకోర్టుపై నమ్మకం ఉంది, మేము దానిని ఆశ్రయిస్తాము' 'అని ఆమె పిటిఐతో అన్నారు. 'కుల్దీప్ సెంగార్ జీవిత ఖైదు శిక్ష కొనసాగాలి, మహిళల గౌరవంతో ఆటలాడటం తగదు' అనే నినాదాలు రాసిన ప్లకార్డులను పట్టుకుని పెద్ద సంఖ్యలో నిరసనకారులు హైకోర్టు వెలుపల ఆందోళన నిర్వహించారు. ఉన్నావ్ అత్యాచార బాధితురాలికి మద్దతుగా వారు 'అత్యాచారాలకు పాల్పడిన వారికి రక్షణ కల్పించడం ఆపండి', 'నేరస్థులను రక్షించడం ఆపండి' వంటి నినాదాలు చేశారు. ఈ తీర్పుపై కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తూ, నిరసనకారులలో ఒకరు మాట్లాడుతూ, బిజెపి ప్రభుత్వం లేదా కోర్టు అతనికి ఎలా బెయిల్ ఇవ్వగలవు అని ప్రశ్నించారు. వారు అతని బెయిల్‌ను రద్దు చేయాలి లేదా ఈ ప్రభుత్వం దిగిపోవాలని డిమాండ్ చేశారు. 'కోర్టు సెలవులకు కేవలం రెండు రోజుల ముందు బెయిల్ మంజూరు చేయడం యాదృచ్ఛికం కాదు. ఇది ఒక ప్రణాళిక ప్రకారం చేసిన పని. ఈ దేశ పౌరులు మూర్ఖులు కాదు. ఇంకెంత కాలం మమ్మల్ని మోసం చేస్తూ ఉంటారు...'అని మరో మహిళ అన్నారు. సెంగార్ బెయిల్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, మరో నిరసనకారుడు మాట్లాడుతూ, 'అతను ఒక అమ్మాయిపై అత్యాచారం చేసి, ఆమె తండ్రిని చంపాడు, దానివల్లే ఆమె ఇప్పటికీ ఈ పరిస్థితిలో ఉంది. అత్యాచారానికి పాల్పడిన వారికి రక్షణ కల్పించడం ఆపి, బాధితులను రక్షించండి' అని అన్నారు. ఆందోళనకారులు తమ నిరసనను కొనసాగిస్తుండగా, ఢిల్లీ పోలీసులు మైక్రోఫోన్ ద్వారా ఢిల్లీ హైకోర్టు ముందు ప్రదర్శనలు అనుమతించబడవని ప్రకటించి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారిని హెచ్చరించారు. కాగా, మంగళవారం నాడు ఢిల్లీ హైకోర్టు, 2019 డిసెంబర్‌లో ట్రయల్ కోర్టు విధించిన శిక్షపై సెంగర్ దాఖలు చేసిన అప్పీల్ విచారణ పూర్తయ్యే వరకు అతనికి బెయిల్ మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఎమ్మెల్యే బాధితురాలి నివాసానికి ఐదు కిలోమీటర్ల పరిధిలోకి రాకూడదని లేదా అత్యాచార బాధితురాలిని గానీ, ఆమె తల్లిని గానీ బెదిరించకూడదని కోర్టు ఆదేశించింది. ఈ షరతులను ఉల్లంఘిస్తే అతని బెయిల్ స్వయంచాలకంగా రద్దు అవుతుందని కూడా పేర్కొంది. అయితే, బాధితురాలి తండ్రి కస్టడీలో మరణించిన కేసులో కూడా సెంగర్ 10 సంవత్సరాల జైలు శిక్ష అనుభవిస్తున్నందున, ఆ కేసులో అతనికి బెయిల్ మంజూరు కానందున, అతను జైలులోనే ఉన్నాడు.

## హిందువులపై దాడులకు నిరసనగా భారీ ర్యాలీ

**కోల్‌కతా:** బంగ్లాదేశ్‌లో మైనారిటీ హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా శుక్రవారం కోల్‌కతాలోని బంగ్లాదేశ్ డిప్యూటీ హైకమిషన్ కార్యాలయం వరకు హిందూ అనుకూల సంస్థ అయిన హిందూ సంహతి కార్యకర్తలు ర్యాలీ నిర్వహించిచారు. మిషన్ అధికారులకు ఆరు సూత్రాల డిమాండ్ల పత్రాన్ని సమర్పించారు. సంస్థకు చెందిన ముగ్గురు సభ్యుల ప్రతినిధి బృందం దౌత్య కార్యాలయానికి చెందిన ఒక సీనియర్ అధికారిని కలిసి తమ డిమాండ్లను సమర్పించింది. డిసెంబర్ 18న మెయమెన్‌సింగ్‌లో దీపు చంద్ర దాస్ హత్యకు పాల్పడిన వారికి కఠిన శిక్ష విధించాలని, బంగ్లాదేశ్‌లో మైనారిటీలకు, వారి మత సంస్థలకు భద్రత కల్పించాలని ఈ డిమాండ్లలో పేర్కొన్నారు. 'దీపు దాస్ హంతకులకు, అలాగే ఈ ఘటనను చూసీచూడనట్లు వ్యవహరించిన పోలీసు అధికారులకు కఠిన శిక్ష విధించాలని మేము డిమాండ్ చేశాము.హిందువులు, ఇతర మైనారిటీలపై పుకార్లు వ్యాప్తి చేస్తూ, ఇటువంటి దాడులకు కారణమవుతున్న వారిపై బంగ్లాదేశ్ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కూడా మేము పట్టుబట్టాము' అని హిందూ సంహతి సలహా కమిటీ సభ్యుడు, ప్రతినిధి బృందంలో సభ్యుడైన రజత్ రాయ్ అన్నారు. తాము చేసిన డిమాండ్లను బంగ్లాదేశ్ ప్రభుత్వానికి పంపుతానని ఆ దౌత్యవేత్త తమకు హామీ ఇచ్చారని ప్రతినిధి బృందం సభ్యులు విలేకరులకు తెలిపారు.

## తిరువనంతపురం మేయర్‌గా

# వి.వి.రాజేశ్ ప్రమాణం



**తిరువనంతపుర:** కేరళ రాజధాని తిరువనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా బిజెపికి చెందిన వి.వి.రాజేశ్ ఎన్నికయ్యారు. మేయర్ ఎన్నికలో ఆయనకు 51 ఓట్లు వచ్చాయి. 101మంది సభ్యులున్న తిరువనంతపురం కార్పొరేషన్‌లో బిజెపికి చెందిన 50మంది కౌన్సిలర్లతోపాటు ఓ స్వతంత్ర సభ్యుడూ రాజేశ్‌కు మద్దతు ఇచ్చారు. ఎల్‌డిఎఫ్ మేయర్ అభ్యర్థి ఆర్‌పి శివాజీకి 29 ఓట్లు, యుడిఎఫ్ మేయర్ అభ్యర్థి కెఎస్ శబరినాథన్‌కు 17ఓట్లు వచ్చాయి. యుడిఎఫ్‌కు అనుకూలంగా పడిన మరో రెండు ఓట్లు తర్వాత తిరస్కరణకు గురయ్యాయి. ఎన్నికల ఫలితాల ప్రకటన తర్వాత తిరువనంతపురం మేయర్‌గా బిజెపికి చెందిన రాజేశ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్, మాజీ కేంద్ర మంత్రులు వి. మురళీధరన్, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కే సురేంద్రన్ సహా సీనియర్ నేతలు పాల్గొన్నారు. 'కేరళ రాజకీయాలను మలుపు తిప్పే చారిత్రక ఘట్టం ఇది. తిరువనంతపురంలో మారిన రాజకీయ పరిస్థితులు యావత్ కేరళను ప్రభావితం చేస్తాయి. అందరిని కలుపుకొని ముందుకు సాగుతాం. కార్పొరేషన్‌లోని 101 స్థానాలను సమాన ంగా అభివృద్ధి చేస్తాం. తిరువనంతపురాన్ని దేశంలోని అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దుతాం' అని వివి అన్నారు.

**తిరువనంతపురం కార్పొరేషన్ ఎన్నికల్లో బిజెపి విజయం**

ఇటీవల జరిగిన తిరువనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బిజెపి తొలిసారి విజయం సాధించింది. నాలుగు దశాబ్దాలపాటు అప్రతిహతంగా మేయర్ పదవిలో కొనసాగిన ఎల్‌డిఎఫ్ తొలిసారి ఓటమిపాలైంది. తిరువనంతపురం కార్పొరేషన్‌లోని 101 వార్డుల్లో బిజెపి 50, ఎల్‌డిఎఫ్ 29, యుడిఎఫ్ 19, స్వతంత్ర అభ్యర్థులు రెండు స్థానాలు గెలుచుకున్నారు. తిరువనంతపురం కార్పొరేషన్‌తో పాటు త్రిపుంతుర, పాలక్కాడ మున్సిపాలిటీలను బిజెపి గెలుచుకుంది. అటు కొల్లాం కార్పొరేషన్ మేయర్‌గా యుడిఎఫ్ అభ్యర్థి ఎకె హఫీజ్ ఎన్నికయ్యారు. కొచ్చి కార్పొరేషన్ మేయర్‌గా నాలుగుసార్లు కౌన్సిలర్‌గా గెలిచిన వికె మినిమోల్ ఎంపికయ్యారు. త్రిస్సూర్ మేయర్‌గా యూడీఎఫ్ అభ్యర్థి డాక్టర్ నితిన్ జస్టిన్ గెలిచారు. మొత్తం ఆరు కార్పొరేషన్లకు ఎన్నికలు జరగగా ఇందులో నాలుగు యుడిఎఫ్ గెలుపొందగా, బిజెపి, ఎల్‌డిఎఫ్ చెరొక కార్పొరేషన్‌ను దక్కించుకున్నాయి.

## శబరిమల బంగారం అదృశ్యం కేసులో తమిళనాడులో సిట్ దర్యాప్తు

**తిరువనంతపురం :** శబరిమల బంగారం అదృశ్యం కేసులో ఒక వ్యాపారవేత్త కోసం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) శుక్రవారం తన దర్యాప్తును తమిళనాడుకు విస్తరించిందని పోలీసులు తెలిపారు. పోలీసులు తమిళనాడులోని దిండిగల్‌కు చెందిన డి మణి అలియాస్ బాలమురుగన్ అనే నగల వ్యాపారి కోసం గాలిస్తున్నారు. పోలీసు వర్గాల ప్రకారం, శబరిమల బంగారం అదృశ్యం ఘటనలో ఒక అంతర్జాతీయ పురాతన వస్తువుల రాకెట్ ప్రమేయం ఉందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రమేష్ చెన్నితాల ఒక ప్రకటన చేసిన తర్వాత, మణి, అతని సహచరుడు సిట్ దృష్టికి వచ్చారు.


SHRIRAM Finance

**వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | AP24TV 0063 | Murtaza Shaik | TATA LPT 3118 CUMMINS FBT | 2013 |
| 2 | TS08UB 4002 | Srikanth Puli | TATA ACE | 2015 |
| 3 | TG03T 2271 | Kalyan Emmadi | APE XTRA LDX CLASSIC BS6 DIESEL | 2025 |
| 4 | TS03EE 7189 | Murtaza Shaik | ZEST 1.3L XM QUADRAJET 90PS DIESEL 5 SEATER | 2015 |
| 5 | TS03UB 7151 | Anand Bopparati | TATA ACE | 2016 |

AUCTION DATE 27-12-2025

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును

SHRIRAM FINANCE LIMITED

D No :19-11-409/3. 1st floor, Beside GMR Gokul Appartments Shambunipet, Warangal - 506002, Cell 9989809938, 9000298883



**ప్రకటన**

ఇందు మూలముగా సమస్త ప్రజానికానికి, అధికార, అనధికారులకు తెలియపడుచునది ఏమనగా, నేను అనగా నల్ల పద్మ, W/o నల్ల రామకృష్ణయ్య, వయస్సు: 61 సంవత్సరాలు, నివాసం: పోచన్న పేట గ్రామం, బచ్చన్న పేట మండలం, జనగామ జిల్లా, సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం తల్లిదండ్రులకు సంక్రమించిన అధికారాల ప్రకారం నా పెద్ద కొడుకైన నల్ల అశోక్ కుమార్, S/o నల్ల రామకృష్ణయ్య, రెండవ కుమారుడైన నల్ల శ్రవణ్, S/o నల్ల రామకృష్ణయ్యను మరియు నా పెద్ద కుమార్తె నల్ల నిర్మల, S/o నల్ల రామకృష్ణయ్యను నా కుటుంబం నుండి శాశ్వతంగా బహిష్కరించుచున్నాను. దీని పర్యవసానంగా కీర్తి శేషులైన నా భర్త నల్ల రామకృష్ణయ్య నుండి నాకు సంక్రమించిన స్థిర, చరాస్తుల్లోను, ఇల్లు, వ్యవసాయ భూమి, బంగారం, వెండి, నగదు మరియు ప్రభుత్వం నుంచి వచ్చే పెన్షన్ మొదలైన ఎట్టి పరిహారం లోనూ ఈ ముగ్గురికి ఎలాంటి భాగస్వామ్యం లేదు. కారణమేమనగా ఈ ముగ్గురు నన్ను తిండికి, బట్టకు, మందులకు దూరం చేసి నానా యాతనలకు గురి చేసి నేను చనిపోయేలా చేస్తున్నారు. అందుకే ఈ బహిష్కరణ వేటు వేయనైనది.

ఇట్లు
**నల్లపద్మ**
ఇ.నెం.10-100-221, పోచన్నపేట,
బచ్చన్నపేట మండలం, జనగామ జిల్లా.

ప్రజాపక్షం
శనివారం, 27 డిసెంబరు

## క్రిస్మస్ రోజున మతవిద్వేషం

డిసెంబర్ 25 – క్రీస్తు జననాన్ని ప్రపంచవ్యాప్తంగా తరతమస్థాయిలో వేడుకగా ఆహ్వానించే రోజు. క్రైస్తవ మతావలంబకులకు అది మహాపర్వదినం. అధికారం కోసం, పదవులకోసం దశాబ్దంపైబడి రాజ్యాంగ విరుద్ధంగా మత విభజన రాజకీయాలు నడిపిస్తున్న లౌకిక భారతదేశంలో గురువారంనాడు పలు రాష్ట్రాల్లో హిందూత్వవాదులమని చెప్పుకునే మూకలు క్రైస్తవ ఉత్సవ కేంద్రాలపై దాడి చేయటం, వేడుకల సామాగ్రి ధ్వంసం చేయటం, క్రైస్తవ మత వ్యతిరేక నినాదాలు చేయటం సిగ్గుపడాల్సిన విషయం. హిందూత్వ ఆధిపత్య వాదానికి ఫౌంటైన్ హెడ్ లాంటి ఆర్ఎస్ఎస్‌కు చెందిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ న్యూఢిల్లీలో కేథడ్రల్ చర్చి ఆఫ్ రిడంప్షన్‌లో గురువారం ఉదయం ప్రార్థనల్లో స్వయంగా పాల్గొన్నారు. "ఆ ఆరాధన కార్యక్రమం ప్రేమ, శాంతి, కరుణ అనే సర్వకాల సందేశాన్ని ప్రతిబింబించింది. క్రిస్మస్ స్ఫూర్తి మన సమాజంలో సామరస్యం, సద్భావనను ఉత్తేజితం చేయుగాక" అని ప్రధాని ఎక్స్‌లో తన సందేశం పోస్టు చేశారు. దేశ పౌరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. "శాంతి, కరుణ, ఆశాభావం నిండిన హృదయాలతో ప్రతి ఒక్కరూ సంతోషంగా క్రిస్మస్ జరుపుకోవాలని ఆకాంక్షించిన ప్రధాని మోదీ జీసస్ క్రైస్ట్ బోధనలు మన సమాజంలో సామరస్యాన్ని పటిష్టవంతం చేయుగాక" అని అభిలషించారు. అజ్మీర్‌లోని ప్రసిద్ధ సూఫీ ప్రవక్త ఖ్వాజా మహమ్మద్ చిస్తి దర్గాకు కొద్దిరోజుల క్రితం ప్రేమపూర్వకంగా చద్దర్ పంపారు. లౌకికవాదంలో ఆయన విశ్వాసం సందేహాస్పదం అయినా ప్రధానిగా ఇవి మంచి సంకేతాలు.

ఆర్ఎస్ఎస్ వారు తమ లెక్కకుమిక్కిలి అంగాల ద్వారా తమ మత ప్రచారం తాము చేసుకోవచ్చు. మత రహితమైన భారత రాజ్యాంగం పౌరులకు మత విశ్వాస, ఆరాధన, ప్రచార స్వేచ్ఛ ఇచ్చింది. కాని ఇతర మతస్థులకు ఉన్న అదే స్వేచ్ఛను వ్యతిరేకించటం, హరించే విధంగా దాడులకు పాల్పడటం ఖండనార్హం, చట్టప్రకారం శిక్షార్హం. ప్రధాని మోదీ ఢిల్లీలో చర్చి సర్వీసులో పాల్గొన్న రోజే దేశంలోని వివిధ ప్రాంతాల్లో విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్, సర్వ హిందూ సమాజ్ తదితర సంస్థలకు చెందిన అల్లరిమూకలు క్రిస్మస్ వేడుకలు జరుపుకునే ప్రదేశాలపై దాడి చేయటం, అలంకరణలు ధ్వంసం చేయటం, సామాగ్రి తగలబెట్టటం వంటి దుశ్చర్యలకు పాల్పడ్డారు. క్రైస్తవ సంస్థలకు విదేశాలనుంచి నిధులు వస్తున్నాయని, ఆ ధనంతో పేదలను ప్రలోభపెట్టి మత మార్పిడులకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఎప్పటినుంచో ఉన్నవే. పేదలేకాదు, అగ్రవర్ణాల్లో సైతం స్వచ్ఛందంగా క్రైస్తవం స్వీకరిస్తున్నవారు ఎందరో ఉన్నారు. అది వారి విశ్వాసం. కాని 2014 నుంచి ఎన్నికల్లో గెలుపుకోసం ఆర్ఎస్ఎస్–బిజెపి మతవిభజనను ఆయుధంగా ఉపయోగించటం, ముఖ్యంగా ఇస్లాం, క్రైస్తవ మతాలవారిపై దాడి చేయటం పెరిగిన దరిమిలా సమాజంలో సామరస్యం బదులు ద్వేషభావం పెచ్చరిల్లింది. దాని పర్యవసానమే క్రిస్మస్ సందర్భంగా దాడులు.

బిజెపి పరిపాలనలో ఛత్తీస్‌ఘడ్‌లోని రాయ్‌పూర్‌లో క్రిస్మస్ ముందురోజు ఒక గుంపు క్రిస్మస్ అలంకరణ సామాగ్రి విక్రయించే ఒక దుకాణంపై దాడి చేశారు. ఉత్తరప్రదేశ్, అసోం, ఢిల్లీలో కూడా దాడులు జరిగాయి. యుపిలోని బరేలీలో హిందూత్వ కార్యకర్తలు చర్చిలముందు హనుమాన్ చాలీసా పఠిస్తూ కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. కొన్నిచోట్ల ఉత్సవ ఏర్పాట్లను ధ్వంసం చేశారు. అసోంలోని నల్బరీలో విహెచ్‌పి, బజరంగ్‌దళ్ కార్యకర్తలు ఒక స్కూలులో క్రిస్మస్ వేడుక అలంకరణలను ధ్వంసం చేశారు. ఢిల్లీలో వేడుక జరుపుకుంటున్న స్త్రీలు, పిల్లలతో, శాంతా టోపీలు ధరించిన వారితో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు గొడవపడ్డారు. మధ్యప్రదేశ్‌లో మరో ఘటనలో ఒక అంధురాలితో బిజెపి కార్యకర్త గొడవకుదిగాడు. ఛత్తీస్‌ఘడ్‌లోని వివిధ సామాజిక, గిరిజన, హిందూ సంఘాలతో కూడిన సర్వ హిందూ సమాజ్ 24వ తేదీన రాష్ట్రబంద్‌కు పిలుపు ఇచ్చింది. క్రైస్తవులపై మత మార్పిడుల ఆరోపణతో నిరసన అంటూ క్రిస్మస్ ముందురోజు బంద్‌కు పిలుపు ఇవ్వటంలో దురుద్దేశం స్పష్టం. కేరళలోని పాలక్కాడ్‌లో బాలల గానబృందంపై ఆర్ఎస్ఎస్ అనుయాయులు దాడి చేశారు. వెలుగులోకి రాని ఇలాంటి ఘటనలు ఇంకెన్నో జరిగి ఉండవచ్చు. తలకెక్కిన మత విద్వేష విషం ఈ ఘటనలకు మూలం. ప్రధాని కోరిన సామరస్యం, సద్భావంలో నిజంగా విశ్వాసం ఉంటే ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థల నేతల మెదళ్లు శుభ్రపరిచే కృషి మొదలుపెట్టాలి.

ఇటువంటి విద్వేషపూరిత సంఘటనలు మత సామరస్యాన్ని భంగపరుస్తాయి. మైనారిటీల్లో భయం నింపుతాయి. క్రిస్మస్ క్రైస్తవుల్లో "భయం, ఆందోళన" కలుగజేసిందని ఈ గుండాగిరీ చర్యల నేపథ్యంలో కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ వ్యాఖ్యానించారు. ఆందోళన కలిగించే ఇటువంటి ఘటనలు ఖండించదగినవని కాంగ్రెస్ నాయకుడు, రాజస్తాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ అన్నారు. శాంతిభద్రత యంత్రాంగం, న్యాయవ్యవస్థ రాజ్యాంగాన్ని పరిరక్షిస్తూ కఠిన చర్యలు తీసుకోవటం అవసరం.

# అసెంబ్లీ సాక్షిగా 'వాటర్ వార్'!



ఎస్.కె.జకీర్

అసెంబ్లీ సమావేశాల్లో ఇరిగేషన్ రంగంపై వాడి, వేడీ చర్చ జరగనున్నది. డిసెంబర్ 24న కోస్గి సభలో రేవంత్ ప్రసంగం అసెంబ్లీ సమావేశాలకు శాంపిల్ వంటిది. ఈ సమావేశాలకు కెసిఆర్ హాజరయ్యేది లేనిదీ ఇంకా స్పష్టత రాలేదు. ఆయన అసెంబ్లీకి హాజరవుతారని, సిఎం రేవంత్ రెడ్డిని చెండాడుతారని ఎపి మాజీ ముఖ్యమంత్రి జగన్ మీడియాలో కథనాలు వస్తున్నాయి.

ఎపి, తెలంగాణకు కృష్ణా, గోదావరి నీటి కేటాయింపులు, పాలమూరు–రంగారెడ్డి సహా పెండింగ్ ప్రాజెక్టులపై చర్చకు ప్రభుత్వం సిద్ధమైంది. అసెంబ్లీ శీతాకాల సమావేశాలలో కాంగ్రెస్, బిఆర్ఎస్ మధ్య మాటల యుద్ధంతో హఠాత్తుగా ఉష్ణోగ్రతలు పెరగవచ్చు. అయితే ఇదంతా ప్రధాన ప్రతిపక్ష నాయకుడు కెసిఆర్ పాల్గొనడం, పాల్గొనకపోవడాన్ని బట్టి ఉంటుంది. కానీ బిఆర్ఎస్ పార్టీ వర్గాల కథనం ప్రకారం కెసిఆర్ గైరుహాజరు అవకాశాలే ఎక్కువ. రేవంత్ రెడ్డిని, కెసిఆర్ తన సమఉజ్జీగా భావించడం లేదు కనుక రారన్నది ఆ వర్గాల అభిప్రాయం. కెసిఆర్ మాత్రమే తనతో సమానుడు అని ముఖ్యమంత్రి రెడ్డి భావన. ఆయన కెటిఆర్, హరీష్ రావు వంటి వారిని ఖాతరు చేయదలచుకోలేదని ఇదివరకటి అసెంబ్లీ సమావేశాల తీరు తెన్నులు, తరచూ సిఎం.రేవంత్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలను బట్టి మనం అర్థం చేసుకోవచ్చు.

2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన తరువాత బిఆర్ఎస్ చీఫ్, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఎక్కువగా తన ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారు. గత ఏడాదికాలంలో కెసిఆర్ ఒక్కసారి కూడా అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనలేదు. ''కెసిఆర్ వచ్చే నాలుగేళ్ల పాటు సభకు హాజరుకావడం లేదనే విషయం నిజమే. సీనియర్ ఎన్టీఆర్, జయలలిత, ఇతర మాజీ సిఎంలు కూడా చాలా కాలంపాటు అసెంబ్లీకి దూరంగా ఉన్నారు. మళ్లీ ప్రజాతీర్పుతో గెలిచి సిఎంలుగా అడుగుపెట్టారు. వచ్చే ఎన్నికల్లో కెసిఆర్ ముఖ్యమంత్రిగానే మళ్లీ అసెంబ్లీలో అడుగు పెడతారు. నేను, మా పార్టీ నేతలు కూడా అసెంబ్లీకి రావద్దని కెసిఆర్‌కి సలహా ఇస్తున్నాం. ఆయనను అసెంబ్లీకి రాకుండా అడ్డుకుంటున్నాం. ఆయన అసెంబ్లీకి ఎందుకు రావాలి? కాంగ్రెస్ సభ్యుల దిక్కుమాలిన శాడిజంతో అవమానిస్తుంటే మహానేత కెసిఆర్ భరించాలా?''అని ఏడాది కిందటే కెటిఆర్ నిర్మొహమాటంగా అన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులు, నీటి కేటాయింపుల విషయంలో బిఆర్ఎస్ చేస్తున్న విప్రచారాన్ని, అబద్ధాలను అసెంబ్లీ వేదికగా తిప్పికొడదామన్న నిర్ణయానికి రేవంత్ రెడ్డి వచ్చారు. నదీ జలాలకు సంబంధించి ఉమ్మడి రాష్ట్రంలో కంటే పదేళ్ల కెసిఆర్ పాలనలోనే తెలంగాణకు ఎక్కువ అన్యాయం జరిగిందని సిఎం రేవంత్ రెడ్డి అంటున్నారు. చంద్రబాబు ప్రభుత్వం పట్టిసీమ ప్రాజెక్టును చేపట్టడాన్ని తెలంగాణ అసెంబ్లీ వేదికగా కెసిఆర్ ప్రశంసించిన వీడియోను అసెంబ్లీలో ప్రదర్శించనున్నారు. కృష్ణా నీటి కేటాయింపుల్లో కెసిఆర్ తీరుతో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని పలుమార్లు ముఖ్యమంత్రి రేవంత్ ప్రస్తావించారు. ఈ అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సహచర మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులకు సిఎం చెప్పారు. ప్రాజెక్టులు, నీటి కేటాయింపుల్లో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని అసెంబ్లీలో సిఎం పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇవ్వనున్నారు.ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లు జరుగుతున్నవి. ప్రాజెక్టులకు సంబంధించి కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న అంశాలు, అనుమతులు లేకుండా ఎపి కడుతున్న అక్రమ ప్రాజెక్టులను అడ్డుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన చర్యలనూ ఈ సందర్భంగా సిఎం వివరిస్తారు.

కృష్ణా నదీ జలాల విషయంలో కర్ణాటక, మహారాష్ట్ర, ఎపి, తెలంగాణల మధ్య వివాదాలు తరచూ వస్తున్నాయి. పెద్ద నదుల్లో కృష్ణ నాలుగోది. మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ప్రవహిస్తోన్న ఈ నది, పొడవులో గంగ, బ్రహ్మపుత్ర, గోదావరుల తరువాతి స్థానంలో ఉంటుంది.

దాదాపు 1300 కిలోమీటర్లు ప్రవహించే ఈ నది, మహారాష్ట్ర నుంచి కర్ణాటక, అక్కడి నుంచి తెలంగాణ, ఆ తరువాత ఆంధ్రాలోకి వస్తుంది. సుమారు 90 కిలోమీటర్ల దూరం తెలంగాణలో ప్రవహించి, ఆ తరువాత తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాల సరిహద్దుగా ఉంటుంది. అంటే నదికి ఒకవైపు తెలంగాణ, మరోవైపు ఆంధ్రప్రదేశ్ ఉంటాయి. అలంపురం నుంచి ముక్త్యాల వరకు ఈ నది రెండు రాష్ట్రాలకు సరిహద్దు. ఆ తరువాత పూర్తిగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రవహించి సముద్రంలో కలుస్తుంది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పుడు మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ మధ్య నీటి పంపకాల వివాదాలు ఉండేవి. ఒకే రాష్ట్రంలో ఉన్నప్పటికీ, తెలంగాణ, ఆంధ్ర మధ్య కూడా కృష్ణా నీటి విషయంలో వివాదం ఉంది. అంతేకాదు, ఎపిలో కూడా రాయలసీమ, కోస్తా ప్రాంతం మధ్య కూడా కృష్ణా నీటి విషయంలో వివాదం ఉంది. కృష్ణానదిపై శ్రీశైలం, నాగార్జున సాగర్, పులిచింతల ప్రాజెక్టులు తెలంగాణ, ఆంధ్రాలకు ఉమ్మడిగా ఉన్నాయి. ఈ ప్రాజెక్టులకు కుడి వైపున ఎపి ఉండగా, ఎడమవైపున తెలంగాణ ఉంది.

వీటికి ఎగువన ఉన్న జూరాల ప్రాజెక్టు తెలంగాణ భూభాగంలో ఉండగా, దిగువన ఉన్న ప్రకాశం బ్యారేజీ ఎపి భూభాగంలో ఉంది. ఇవికాక అనేక లిఫ్టు పథకాలు ఉన్నాయి. రెండు రాష్ట్రాల అవసరాలను ఈ ప్రాజెక్టులు తీరుస్తున్నాయి.

కృష్ణానదిలో మొత్తం 2060 టిఎంసిల నీరు నికరంగా ఉంటుందని లెక్కేసి, అప్పటి మూడు రాష్ట్రాలకు ఆ నీటిని పంచారు. అందులో 560 టిఎంసిలు మహారాష్ట్రకు, 700 టిఎంసిలు కర్ణాటకకు, 800 టిఎంసిలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించారు. ఈ నీళ్లను నది లో ఎక్కడి నుంచైనా, ఏ ప్రాజెక్టు ద్వారానైనా వాడుకోవచ్చని చెప్పారు.

ఇక నదిలో మిగులు జలాలు 330 టిఎంసిలుగా అంచనా వేశారు. మిగులు జలాల్లో మహారాష్ట్రకు 25 శాతం, కర్ణాటకకు 50 శాతం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 25 శాతం ఇస్తారు. ఈ మిగులు జలాల పంపిణీ విషయంలో రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం లేకపోతే అప్పుడు పార్లమెంటు జోక్యం చేసుకుని నిర్ణయం తీసుకోవాలని రాశారు. అయితే 1976 నాటికి ఈ మిగులు జలాల గురించిన తీర్పు ను కేంద్రం ఆమోదించకపోవడంతో తాత్కాలికంగా మిగులు జలాలపై ఆంధ్రప్రదేశ్‌కు అవకాశం ఇచ్చారు. కానీ అది హక్కు కాదు. అంటే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, దిగువన ఉంది కాబట్టి మిగులు జలాల పై సహజ వెసులుబాటును గుర్తించారు. జస్టిస్ బ్రిజేశ్ కుమార్ అధ్యక్షులుగా, జస్టిస్ ఎస్‌పి శ్రీవాస్తవ, జస్టిస్ డికె సేర్ సభ్యులుగా 2004 ఏప్రిల్‌లో కొత్త ట్రిబ్యునల్ వేశారు. అందులో శ్రీవాస్తవ మధ్యలో మరణించగా, ఆయన స్థానంలో బిపి దాస్‌ను నియమించారు. బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ 2007 జూలైలో పని ప్రారంభించి 2010 డిసెంబరులో ఒక ముసాయిదా తీర్పు ఇచ్చింది. ఈ తాజా ముసాయిదా తీర్పు కింద ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కి 1001 టిఎంసిలు, కర్ణాటకకు 911 టిఎంసిలు, మహారాష్ట్రకు 666 టిఎంసిల నీరు ఇచ్చారు. మొత్తం నది నీటిలో 65శాతం లభ్యత లెక్కేసి ఈ కేటాయింపులు చేశారు. 2013 నవంబరులో బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ తుది తీర్పు ఇచ్చింది. అందులో కర్ణాటకకు నాలుగు టిఎంసిలు తగ్గించి ఆంధ్రకు పెంచారు.

అయితే ఈ తీర్పులను పాటించలేదని పలు రాష్ట్రాలు పక్క రాష్ట్రాలపై పలు సందర్భాల్లో కేసులు వేశాయి. ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత కృష్ణా జలాల వ్యవహారం రెండు రాష్ట్రాలు, మూడు ప్రాంతాల మధ్య వివాదంగా మారింది. బచావత్ ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కి కృష్ణా నీళ్లు కర్ణాటక కంటే ఎక్కువ వచ్చాయి. సహజ నదీ సూత్రాల ప్రకారం, కృష్ణా నది, దాని ఉప నదులు ఎక్కువగా ప్రవహించే కర్ణాటకకే సహజంగా ఎక్కువ నీటి కేటాయింపులు జరగాలి. ఆ నది బేసిన్ సింహభాగం కర్ణాటకలోనే ఉంది. కరెంటు కోసం కట్టిన శ్రీశైలం ప్రాజెక్టును ముందుగా తాగునీటి కోసం, తరువాత సాగునీటి కోసం వాడుకోవడం క్రమంగా మొదలైంది. ఆ క్రమంలో చెన్నైకి తాగునీరు ఇచ్చేందుకు తెలుగు గంగ పథకం చేపట్టారు. ఆ తెలుగుగంగ కాలువలోకి నీటిని తీసుకోవడం కోసం కర్నూలు జిల్లాలోని పోతిరెడ్డిపాడు అనే చోట హెడ్ రెగ్యులేటర్ వ్యవస్థ నిర్మించారు.

శ్రీశైలం డ్యామ్ నుంచి నీటిని కాలువల్లోకి ఎత్తిపోసే వ్యవస్థే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్. మొదట్లో దీన్ని 11,500 క్యూసెక్కుల నీటిని కాలువల్లోకి పారించే సామర్థ్యంతో నిర్మించారు. దీని ద్వారా చెన్నైకి తాగునీరే కాకుండా, కృష్ణాలో వరద వచ్చినప్పుడు అదనంగా వచ్చే నీటిని రాయలసీమకు ఇవ్వవచ్చు. వాస్తవానికి రాయలసీమలో చాలా భాగం పెన్నా నది బేసిన్‌లో ఉంటుంది. కృష్ణా నది బేసిన్ పరిధిలోకే వచ్చే మహబూబ్‌నగర్ వంటి ప్రాంతాలు తీవ్ర కరవుతో ఉన్నప్పుడు, ముందు మహబూబ్‌నగర్‌కి ఇవ్వకుండా అసలు కృష్ణా బేసిన్‌లో లేని రాయలసీమకు నీరు ఇవ్వడం సరికాదని తెలంగాణ వాదన. అందుకే తరచూ పోతిరెడ్డిపాడు విషయంలో రాయలసీమ తెలంగాణ మధ్య గొడవ వస్తుంది.

పోతిరెడ్డిపాడు వల్ల రాయలసీమకు లాభమే కానీ తెలంగాణకు నష్టం లేదని ఆంధ్రప్రదేశ్ వాదన. కానీ దీనికి అప్పట్లో కోస్తా రైతుల నుంచి కూడా అభ్యంతరం వచ్చింది. పోతిరెడ్డిపాడు సామర్థ్యం పెంచి శ్రీశైలం నీటిని రాయలసీమకు ఇస్తే, తమకు నీరు లోటు రావచ్చని భయపడి ఆ నిర్ణయానికి వ్యతిరేకంగా కోస్తా రైతులు ఆందోళన చేసారు.

ఇది ఒక దశలో రాయలసీమ వర్సెస్ కోస్తా అండ్ తెలంగాణలా అయింది. మొత్తానికి పోతిరెడ్డిపాడు సామర్థ్యం పెంచారు. అటు పులిచింతల, ఇటు పట్టిసీమ వల్ల కృష్ణా డెల్టా రైతులకు సాగునీటికి భరోసా దక్కింది. దీంతో వారు రాయలసీమకు నీటిని తీసుకెళ్లే పథకాలపై పెద్దగా అభ్యంతరం పెట్టడం మానేశారు. కానీ రాయలసీమ, తెలంగాణ మధ్య వివాదం అలానే ఉండిపోయింది. శ్రీశైలం నుంచి నీటిని ముందే సీమకు తోడేస్తే కింద నాగార్జున సాగర్‌లోకి నీరు రాక, సాగర్ కుడి కాలువ చివర్లో ఉన్న తమకు నీరు అందడంలో ఇబ్బంది ఉంటుందని ప్రకాశం జిల్లాలోని కొన్ని ప్రాంతాల వారు కూడా అభ్యంతరం చెబుతున్నారు. ఇది మరో వివాదం. రాయలసీమలో చాలా భాగం పెన్నా బేసిన్‌లో ఉంటుంది కాబట్టి, ముందు తెలంగాణ వాడుకున్న తరువాతే రాయలసీమలోని కృష్ణా బేసిన్ కాని భాగాలకు నీరు ఇవ్వాలని తెలంగాణ వాదన. అయితే, తాము అలానే చేస్తున్నామని, కేవలం మిగులు, వరద జలాలు తప్ప నికర జలాల్లోంచి రాయలసీమలోని పెన్నా బేసిన్‌కి నీరు ఇవ్వడం లేదని ఆంధ్రప్రదేశ్ చెబుతోంది. ఎపి చెప్పేది నిజం కాదని, తెలంగాణకు నికరంగా రావాల్సిన నీటిని కూడా రాయలసీమకు తరలించుకుపోతోందని తెలంగాణ ఆరోపణ. ఈ పరిస్థితుల్లో 2014లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విడిపోయాయి. బేసిన్ల లెక్కల ప్రకారం చూస్తే తెలంగాణ రాష్ట్రంలో కృష్ణా బేసిన్ 68శాతం ఉండగా, నీటి వాటా 37శాతం వచ్చింది. ఇక ఆంధ్రలో కృష్ణా బేసిన్ 32శాతం ఉండగా, నీటి వాటా 64శాతం వచ్చింది.

ఉమ్మడి రాష్ట్రానికి ముందు నుంచి ఉన్న 811 టిఎంసిల నీటిని రెండు రాష్ట్రాలు పంచుకున్నాయి. ఎపికి 512 టిఎంసిలు, తెలంగాణ కు 299 టిఎంసిలు అనుకున్నారు. ఇది తాత్కాలిక సర్దుబాటు మాత్రమే. ఆంధ్రాకు వచ్చిన దాంట్లో తిరిగి కోస్తాకు 367 టిఎంసిలు, సీమకు 145 టిఎంసిలు అనుకున్నారు. ఇది కేవలం ఒప్పందం మాత్రమే. తీర్పు కాదు. నిజానికి కృష్ణా బేసిన్ తక్కువ ఉన్నప్పటికీ, ఆంధ్రాకు ఎక్కువ నీటి కేటాయింపు రావడానికి ముందు చెప్పుకున్న ట్టు కృష్ణా డెల్టా తన హక్కు ఉపయోగించడం, దిగువన ఉండడం వంటివి కారణాలు. సహజ జల సూత్రాల్లో బేసిన్ నిబంధన ప్రామాణికంగా తీసుకుంటే తెలంగాణకు, మొదటి వినియోగదారు నిబంధ న ప్రామాణికంగా తీసుకుంటే ప్రత్యక్షంగా కోస్తా, పరోక్షంగా రాయలసీమకు మేలు. కాబట్టి బేసిన్ రూల్‌కోసం తెలంగాణ, ఫస్ట్ యూజర్ రూల్ కోసం ఆంధ్రప్రదేశ్ పట్టుబడుతుంటాయి. విభజన చట్టం కింద కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డును ఏర్పాటు చేశారు. విడిపోయిన తరువాత నీటి పంపకాలు కూడా కొత్తగా చేపట్టాలని తెలంగాణ కోరింది.

అంతకుముందు తీర్పుల సమయంలో తెలంగాణలేదు కాబట్టి, తెలంగాణ వాదన వినేలా కొత్త ట్రిబ్యునల్ కావాలని తెలంగాణ వాదించింది. అందుకోసం కొత్తగా ట్రిబ్యునల్ వేయాలని 2014లో కేంద్రానికి లేఖ రాసింది తెలంగాణ ప్రభుత్వం. లేదంటే ఉన్న ట్రిబ్యునలే కొత్తగా నీటి పంపకాలు చేయాలని డిమాండ్ చేసింది. కేంద్రం మాత్రం పాత ట్రిబ్యునల్‌ని మరో రెండేళ్లు పొడిగించింది. అసలు మొత్తం కేటాయింపులు కొత్తగా చేయాలని తెలంగాణ పట్టుపడుతోంది. దీనికి కర్ణాటక, మహారాష్ట్ర ఒప్పుకోలేదు. విడిపోయిన రెండు రాష్ట్రాలూ వాటి మధ్య పంపకాల సంగతి చూసుకోవాలి తప్ప, మొత్తం నది నీళ్లు తిరిగి పంపకాలు చేయడం కుదరదన్న మహారాష్ట్ర, కర్ణాటక, ఇదే విషయాన్ని బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ ముందు చెప్పాయి. ట్రిబ్యునళ్ల తీర్పులున్నా తెలంగాణ, ఎపి ల మధ్య జలవివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి.

అంతేకాదు, ఇక్కడి పంచాయితీ నడుస్తుండగానే, ఆ పాత తీర్పునే వెంటనే ప్రచురించాలని కోరుతూ ఆ రెండు రాష్ట్రాలు కోర్టుకు వెళ్లాయి.

రాష్ట్రం విడిపోయిన తరువాత కొత్త ప్రభుత్వాలు రెండూ పోలవరం, కాళేశ్వరం సహా అనేక ప్రాజెక్టులపై శ్రద్ధ పెట్టాయి. ఆ క్రమంలోనే రాయలసీమకు నీరు అందించేందుకు, గోదావరి–కృష్ణా నదులను అనుసంధానం చేసేలా రెండు రాష్ట్రాలూ ప్రణాళిక వేసుకున్నాయి.

వాటిలో పట్టిసీమ ఒక్కటే పూర్తయి డెల్టా రైతులకు మేలు చేసింది. రాయలసీమ, ప్రకాశం, తెలంగాణలోని పలు జిల్లాల కోసం తలపెట్టిన పలు ఎత్తిపోతల పథకాలు వివిధ దశల్లో ఉన్నాయి. వీటి అనుమతుల విషయంలోనూ గొడవలున్నాయి. పరస్పరం కేసులు వేసుకున్నాయి.

ఆ క్రమంలో 2020వ సంవత్సరంలో పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని రెట్టింపు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భావించింది. అది కాకుండా రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పేరుతో మరో ఎత్తిపోతలకు ప్రతిపాదించింది ఆంధ్ర. ఇటు తెలంగాణ కూడా పాలమూరు–రంగారెడ్డి వంటి కొన్ని లిఫ్టులకు ప్రతిపాదించింది. మరికొన్ని లిఫ్టుల సామర్థ్యం పెంచే పని ప్రారంభించింది. ఇద్దరి ఉద్దేశమూ శ్రీశైలం నీటిని తమ ప్రాంతాలకు తీసుకెళ్లడం. కానీ ఎవరు ఎంత ఎప్పుడు తీసుకెళ్తారు అన్న ప్రశ్న, తమకు మిగలకుండా తీసుకుపోతారన్న అనుమానం ఇద్దరిదీ. అయితే కృష్ణా జలాలకు సంబంధించి 2015, 2016లలో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశాల్లో తెలంగాణకు 299 టిఎంసిల కేటాయింపులకు అంగీకరిస్తూ కెసిఆర్ ముఖ్యమంత్రి హోదాలో సంతకం పెట్టిన కారణంగా రాష్ట్రానికి ఆయన మరణ శాసనం రాసినట్టు కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖ మాజీ సలహాదారు వెదిరె శ్రీరామ్ అంటున్నారు.

అసెంబ్లీలో చర్చకు రావాలని కెసిఆర్ కు ముఖ్యమంత్రి సవాల్ చేశారు. అసెంబ్లీ సమావేశాలకు కెసిఆర్ రావాలని, నీళ్లు, నిధులు, నియామకాలు, ప్రభుత్వ పథకాలపై ఎన్నిరోజులైనా చర్చిద్దామని అన్నారు. కాళేశ్వరం పాపాలే కాకుండా, కృష్ణా, గోదావరి జలాలపై అయినా, టెలిఫోన్ ట్యాపింగ్‌పై అయినా చర్చిద్దామన్నారు. సభకు ప్రతిపక్ష నేతగా రావాలని, అర్థవంతమైన చర్చ చేద్దామని పిలుపు నిచ్చారు.

# రైతును కాపాడుకుందాం

భారతదేశ వ్యవసాయదారులు 'అప్పుల్లోనే పుట్టి అప్పుల్లోనే చనిపోతున్నారు'. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు దాటినా... పైన ఉన్న నానుడిలో ఎలాంటి మార్పు లేకపోగా నిత్యం రైతుల ఆత్మహత్యల పరంపర కొనసాగుతూనే ఉంది. దేశంలో ప్రతి అర్ధగంటకు ఒక రైతు ఆత్మహత్య చేసుకుంటున్నారు. ప్రతిరోజు 2000–3000 మంది రైతులు వ్యవసాయాన్ని వదిలిపెట్టి ఇతర రంగాలకు వలస పోతున్నారంటే అతిశయోక్తి కాదు.

మిగతా 40 శాతం మంది రైతులు వ్యవసాయంలో లాభాలు వచ్చి వ్యవసాయం చేయడం లేదు. కేవలం వారు ఉన్న ఊరును, తల్లిదండ్రులను, భార్యా పిల్లలను వదిలిపెట్టి ఇంకో ప్రాంతానికి వెళ్లలేక ఇంకొక పని చేయలేక బిక్కుబిక్కు మంటూ చావు బతుకుల మధ్య వ్యవసాయాన్ని కొనసాగిస్తున్నారు. మనదేశంలో మానవ సంపద పుష్కలంగా ఉంది. భిన్నమైన వాతావరణ పరిస్థితులు అన్ని రకాల పంటలు, పండే నేలలు, పండించే రైతులు ఉన్నారు. ఆదాయ భద్రతలేని ఏకైక రంగం వ్యవసాయం. పంటలు సరిగా పండక, పండిన పంటలకు గిట్టుబాటు ధర లేక కనీసం పెట్టిన పెట్టుబడులు రాక కుటుంబాన్ని పోషించుకోలేక తెచ్చిన అప్పులను తీర్చే మార్గం లేక వారి పంట పొలాల్లోనే ఉరికొయ్యలను ముద్దాడుతున్న రైతుల శవాలను ప్రతిరోజు వివిధ దినపత్రికలలో చూస్తూనే ఉన్నాం.

ఇప్పటికీ భారతదేశ ప్రజలు సుమారు 63శాతం మంది వ్యవసాయ రంగంపై ఆధారపడి వ్యవసాయ ప్రాధాన్యత గల దేశంగా పేరుగాంచిన మనదేశంలో రైతులు ఆత్మహత్య చేసుకోవడం చాలా దురదృష్టకరం. ఇప్పటికీ వ్యవసాయ విధానం లేకపోవడం, వ్యవసా యం పట్ల ప్రభుత్వాలకు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం. 2004వ సంవత్సరంలో ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త డా.స్వామినాథన్ కమిషన్ వేసి వారు ఇచ్చిన రిపోర్టు ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదు. మోదీ గారు మొదటిసారి ప్రధానమంత్రి కావడానికి ముందు జరిగిన చాలా సభలలో మేము అధికారంలోకి రాగానే స్వామినాథన్ కమిషన్ రిపోర్టను అమలు చేస్తామని అన్నారు. కానీ తర్వాత స్వామినాథన్ రిపోర్టు మాటనే తీయడం లేదు. పైగా శ్రీ నరేంద్ర మోదీ 2018లో వివిధ సభలలో మాట్లాడు తూ 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని అన్నాడు. రెట్టింపు మాట పక్కన పెడితే కనీసం రైతుకు గిట్టుబాటు ధరను ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వా లు ఉన్నా యి.

ప్రధాన మంత్రులు, ముఖ్యమంత్రులు, ప్రభుత్వాలు మారినంత మాత్రాన రైతుల ఆత్మహత్యలు ఆగవు. వ్యవసాయ విధానం లేకపోవడంతో దేశ వ్యాప్తంగా 1995 నుండి 2023 వరకు 4,08,326 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నట్లు NCRB నివేదికలు తెలుపుతున్నాయి.

పంటలు కాపాడుకోవాలనే ఉద్దేశంతో అప్పులు చేసి బోర్లువేస్తూ బోర్లలో నీళ్లు రాక పంటలు ఎండిపోవడంతో పాటు, కనీసం పెట్టుబడులురాక అప్పులపాలై రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇప్పుడు రైతాంగానికి బతుకు పైన భరోసా ఇచ్చి రైతాంగాన్ని కాపాడుకోవాల్సిన ప్రధాన బాధ్యత ప్రభుత్వం పైన ఉంది.

నీటి కరువు ఒక వైపు, అప్పులు, కుటుంబ పోషణభారం, ప్రకృతి వైపరీత్యాలు మరోవైపు, నకిలీ విత్తనాలు ప్రపంచీకరణలో భాగంగా జీవన విధానం, రైతుని ఎప్పుడు కుంగదీస్తూనే ఉండడంతో భవిష్యత్తు మీద భరోసా లేక అప్పుల బాధతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

వాస్తవానికి వ్యవసాయం సంక్షోభంలో లేదు. రైతు మాత్రమే సంక్షోభంలోకి నెట్టబడి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఒకవేళ వ్యవసాయం సంక్షోభం లో ఉంటే విత్తన కంపెనీలు, పెస్టిసైడ్స్ కంపెనీలు ఎరువుల కంపెనీలు, రైస్, ఆయిల్ మిల్లులు కరెంట్ మోటర్లు తయారు చేస్తున్న కంపెనీలు లాంటివి నష్టాల బాటలో నడవాలి కానీ ఎండనక వాననక ఆరుగాలం కష్టపడిన నిజమైన రైతు మాత్రమే ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

కార్పొరేట్ కంపెనీలు, ప్రభుత్వాలు కలిసి రైతుల దగ్గర నుంచి క్రమంగా విత్తనాలను దూరంచేసి, పెస్టిసైడ్స్ ఫర్టిలైజర్ అలవాటుచేసి పశుసంపదం దూరంచేసి వీటన్నిటితో ఒకప్పుడు వ్యవసాయం స్వయం సమృద్ధి సాధించి ఉండేది. కానీ నేడు వ్యవసాయరంగం మొత్తం కార్పొరేట్ కంపెనీల పైన ఆధారపడి వ్యవసాయం నడుస్తుందంటే అతిశయోక్తి కాదు.

ఈ మధ్యనే మనం ఇండిగో విమాన సర్వీసులను రద్దు చేస్తే ఎంత సమస్య తలెత్తిందో ప్రత్యక్షంగా చూసాం. అదేవిధంగా విత్తన కంపెనీలు విత్తనాలు సరఫరాను నిలిపివేస్తే వ్యవసాయరంగం ఎట్లా ఉంటుందో మనం ఊహించుకోవచ్చు! కాబట్టి ఇప్పటికైనా కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసం కాకుండా రైతుల, దేశ ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకొని వ్యవసాయ విధానం తయారుచేసి రైతులను కాపాడుకోవాలి.

**రైతులను కాపాడుకోవడం కోసం కొన్ని సూచనలు:**
1) పంటలన్నింటికీ లాభసాటి ధర నివ్వాలి. పంటలన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. 2)వాస్తవ సాగుదారులకు పెట్టుబడి సహాయం అందించాలి. 3)అన్ని పంటలకు బీమా సౌకర్యం కల్పించాలి 4) రైతులకు, రైతు కూలీలకు బీమా సౌకర్యం కల్పించాలి. 5) పురుగు మందులు, రసాయనిక ఎరువులు లేని వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి. 6) చిన్న యంత్ర పరికరాలను అందుబాటులోకి తేవాలి. 7) ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్లో ప్రవేశపెట్టాలి. 8) విద్య, వైద్యం ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలి. 9) అసెంబ్లీ పార్లమెంట్లలో వ్యవసాయ రంగం పైన ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలి. 10) స్వామినాథన్ కమిషన్ రిపోర్టును అమలు చేయాలి.ఇప్పటికైనా ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు GO .Ms.NO.194 ప్రకారం ప్రతి కుటుంబానికి ఆరు లక్షల రూపాయలు ఇచ్చి రైతు కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వానికి రైతాం గం విజ్ఞప్తి చేస్తుంది. రైతులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం, ప్రతి రాజకీయ పార్టీ, పౌర సమాజం పైన ఉంది. రైతన్నలారా ఎవరు కూడా అధైర్యపడి ఆత్మహత్యలు చేసుకోవద్దు. మీకు అండగా తెలంగాణ సమాజం ఉంది.

**పులి రాజు**, 9908383567.

# కోట్లాదిమందికి ప్రాణదాత లూయీ పాశ్చర్

నిజజీవిత సమస్యల సుడిగుండాలలో చిక్కుకున్నప్పుడు మానవ మేధస్సులో ఆ సమస్యల కు తగిన పరిష్కారం కనుగొనేందుకు వీలైన ఆలోచనలు, ఆవిష్కరణలు ఉద్భవిస్తుంటాయి. ఆ ఆవిష్కరణలు కొంతమంది మహామహుల విశేష కృషి వల్ల వెలుగులోకి వచ్చి అదే సమస్యలతో బాధపడుతున్న ఎంతోమంది జీవితాలలో ఆ గ్రహణం వీడి వెలుగులు నింపడానికి దోహదపడుతుంది. అటువంటి సమస్యల పరిష్కారానికి సరికొత్త మార్గాలను అన్వేషించిన ఆదర్శ మూర్తులలో లూయీ పాశ్చర్ ఒకరు. ఆంత్రాక్స్, రేబిస్ తదితర వ్యాధులకు మందులను కనిపెట్టడంలో మూలపురుషుడై అవిరళ కృషి సల్పిన సూక్ష్మ జీవ శాస్త్రవేత్త లూయీ పాశ్చర్.

లూయీ పాశ్చర్ 1822 సంవత్సరం డిసెంబరు 27న ఫ్రాన్స్ లోని డోల్ గ్రామంలో జన్మించాడు. నెపోలియన్ సైన్యంలో పనిచేసి న తండ్రి జీన్ పాశ్చర్ తోలు వ్యాపారం చేసి జీవించేవారు. పాశ్చర్ పాఠశాలకు వెళ్ళకుం డా కొంతవరకు విద్యావంతుడయ్యాడు. చిత్రలేఖనంలో మంచి ప్రతిభ కనపరిచేవాడు. తల్లిదండ్రులతో పాటు ఇరుగుపొరుగు వారివి, హితులవి బొమ్మలు పెయింట్ చేశాడు. చాలా చిత్రాలు ఇప్పటికీ పాశ్చర్ మ్యూజియంలో భద్రపరచబడ్డాయి. గణితం, భౌతిక, రసాయనిక శాస్త్రాలంటే ఇష్టమున్న పాశ్చర్ ఉపాధ్యాయ జీవితాన్ని గడపాలనుకొనేవాడు. పదహారేళ్ల వయసులో కాలేజీ చదువు కోసం పారిస్‌లో అడుగుపెట్టాడు. డాక్టరేట్ పూర్తి చేసి 1848లో స్ట్రాస్ బర్గ్ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌కు వారి అమ్మాయి మేరీ లారెంట్‌ను పెళ్ళిచేసుకుంటానని అనుమతి కోసం లేఖ రాశాడు. వివాహానంతరం వీరిద్దరూ ఆదర్శదంపతుల్లాగా జీవించారు. వీరికి అయిదుగురు పిల్లలు పుట్టినా ముగ్గురు మరణించారు; టైఫాయిడ్ వల్ల ఇద్దరు, మశూచి వల్ల ఒకర్ని పోగొట్టుకొన్నాడు.



పాశ్చర్ అంగారక పదార్థాలు ధ్రువిత కాంతిని ఏ విధంగా విచలనం చెందిస్తాయో అధ్యయనం చేసి 'స్టీరియో కెమిస్ట్రీ' అనే కొత్త రసాయన శాస్త్రాన్ని రూపొందించారు. తరువాత తన పరిశోధనలను పులియబెట్టడం (ఫెర్మెంటేషన్)వంటి అంశాలపై కొనసాగించి సూక్ష్మ క్రిములపై అనాదిగా ఉన్న భావాలను ఖండించి కొత్త సిద్ధాంతాలను రూపొందించాడు. ద్రాక్షసారా (వైన్) వల్ల వచ్చే వ్యాధులు, నిల్వచేసే పద్ధతులు, వెనిగర్ తయారీ మొదలైన అనేక అంశాలపై కొత్త విషయాలు కనుగొన్నాడు.

కోళ్ళకు వచ్చే కలరా వంటి పారుడు వ్యాధి పై పరిశోధన జరిపి వ్యాధికారకాలైన సూక్ష్మ జీవులను బలహీనపరచి ఇతర కోళ్ళ కు ఎక్కించి వాటిలో రోగనిరోధక శక్తి పెరిగి న తర్వాత కాలంలో రోగం రాకుండా రక్షిస్తుందని నిర్ణయానికి వచ్చారు. పిచ్చికుక్క కాటు వల్ల వచ్చే రేబీస్ వ్యాధికి మందు కనిపెట్టడం లూయిస్ పాశ్చర్ సాధించిన శాస్త్ర విజయాలలో ప్రధానాంశం. ఈ మందుతో చాలా మందిని ప్రాణాపాయం నుండి కాపాడాడు. 1870 దశాబ్దంలో టీకా పద్ధతులను పశువులలో వచ్చే ఆంత్రాక్స్ వ్యాధిమీద ప్రయోగించాడు. ఈ విధంగా కొన్ని ప్రాణాంతక వ్యాధులకు సూక్ష్మ క్రిములు కారణాలన్న విషయాన్ని నిరూపించాడు. అందువలన మనుషులు గాని, జంతువులు గాని అంటు వ్యాధితో మరణిస్తే ఆ శవాన్ని దహనం చేయాలని చెప్పారు. భూమి లో పాతిపెడితే శరీరంలోని క్రిములు బయటకు వచ్చి వాటివలన ఇతరులకు ఆ వ్యాధులు వ్యాపిస్తాయని వివరించారు. పాలను శుద్ధిచేసే విధానాన్ని కనుగొన్నాడు. ఈ విధానాన్ని పాశ్చరైజేషన్ అని పిలుస్తారు. పాశ్చర్ సూక్ష్మ జీవశాస్త్రంలో అత్యుత్తమ గౌరవమని పిలిచే లీవెన్ హూక్ బహుమతిని 1895లో పొందారు.

నేడు లక్షలాది అంటు రోగాలను తగ్గించేందుకు మన ఆధునిక వైద్యశాస్త్ర రంగంలో మందులున్నాయి. దానికి ఎంతో కృషి సల్పి న, నేటికీ నిత్యం శ్రమిస్తున్న ఎంతో మంది సూక్ష్మ జీవశాస్త్రవేత్తలకు లూయీ పాశ్చర్ వంటి వారు ఏర్పరిచిన శాస్త్రీయ విధానమే పెద్ద రహదారి. ఐదేళ్ల క్రితం మొత్తం ప్రపంచాన్ని గడగడలాడించిన మనందరినీ ఇంటికే పరిమితం చేసిన కొవిడ్ మహమ్మారి అంటువ్యాధికి వాక్సిన్ కనుగొని ఎంతోమంది ప్రాణాలను కాపాడటం వెనుక ఎందరో శాస్త్రవేత్తల కృషి ఉంది అనడంలో అతిశయోక్తి లేదు. ఎందుకంటే మనిషి మేధస్సును మించి న మరో గొప్ప ఆయుధం లేదు. ఆ మేధస్సుతోనే లూయీ పాశ్చర్ వంటి వారు మహానుభావులయ్యారు. పాశ్చర్ తన పూర్తి జీవితాన్ని శాస్త్ర పరిశోధనలకు అంకితం చేశారు. సంకల్ప బలం, నిరంతర శ్రమతో విజయాన్ని సాధించవచ్చని పాశ్చర్ విశ్వాసం. రెండుసార్లు గుండెపోటు, తరువాత పక్షవాతం వచ్చినా జీవితాంతం పరిశోధన చేసి మానవాళికి వెలకట్టలేని సేవ చేసిన పాశ్చర్ 1895 సెప్టెంబరు 28న పరమపదించారు. లూయిస్ పాశ్చర్ జ్ఞాపకార్థంగా ఆయన మరణించిన రోజు సెప్టెంబరు 28న ప్రపంచ రేబీస్ దినోత్సవం జరుపుకుంటారు.

**(డిసెంబర్ 27 లూయీ పాశ్చర్ జయంతి)**

సుధాకర్. ఎవి
(STUTS); 9000674747

## ఘనంగా వంగవీటి మోహన్ రంగా వర్ధంతి వేడుకలు



**ప్రజాపక్షం/కూకట్‌పల్లి:** కూకట్‌పల్లి కాపు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మోటేపల్లి భరత్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం వంగవీటి మోహన్ రంగా వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సూరు కాపు జర్నలిస్టు ఫోరం నాయకులు దాదె వెంకట్ పటేల్, ఇప్ప రాజేష్ పటేల్, పంతం వెంకటేష్ పటేల్, కల్లు రాజు పటేల్‌లు హాజరై రంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంగవీటి మోహన్‌రంగా సామాన్య ప్రజల హక్కుల కోసం, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడిన ధీర నాయకుడని కొనియాడారు.

## జోనల్ కమిషనర్‌గా రాధికా గుప్తా బాధ్యతలు స్వీకరణ



**ప్రజాపక్షం/ఉప్పల్:** ఉప్పల్ మున్సిపల్ సర్కిల్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఉప్పల్ జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్‌గా రాధికా గుప్తా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్, బోడుప్పల్, నాచారం, ఘట్‌కేసర్, నాగారం, కాప్రా సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు, సిబ్బంది పాల్గొని ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. రాధికా గుప్తా తెలంగాణ క్యాడర్‌కు చెందిన 2021 బ్యాచ్ ఐఏఎస్ అధికారి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్)గా విధులు నిర్వర్తించారు. ఈ సందర్భంగా రాధికా గుప్తా మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో పారదర్శకత, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెడతామని, మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్యం, రోడ్లు, డ్రైనేజీపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు.



## నాణ్యతతో ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తున్నాం

### మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహయాదవ్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లను నాణ్యతతో నిర్మిస్తున్నామని మంచి డిజైన్‌లతో కూడిన ఇండ్లను నిర్మించి లబ్ధిదారులతో కలిసి ప్రారంభిస్తామని మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహయాదవ్ అన్నారు. మూడుచింతలపల్లి మున్సిపాలిటి జగ్గంగూడలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జగ్గంగూడలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో ఎఎంసి చైర్మన్ నర్సింహయాదవ్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ ఏ ప్రభుత్వంలో లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం సిఎం రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ జిల్లా డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ నియోజకవర్గానికి 3500 ఇండ్లను మంజూరు చేశారని ఆయన సహకారంతో మూడుచింతలపల్లిలో ఇళ్లులేని ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి మంద శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపిటిసిలు రవీందర్‌రెడ్డి, బొగ్గుల వెంకటేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ బండి జగన్నాథం, జగ్గంగూడ గ్రామాధ్యక్షుడు రవీందర్, మాజీ ఉపసర్పంచ్ వంగ వెంకటరమణరెడ్డి, నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

**6750 జీవాలకు నట్టల నివారణ మందుల పంపిణీ**

గొర్రెలకు మేకలకు నట్టల నివారణ మందులను తప్పకుండా వేయాలని, ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసే నట్టల నివారణ మందును గొర్రెల మేకల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహయాదవ్ అన్నారు. మూడుచింతలపల్లి మున్సిపాలిటి కేశవరంలో గొర్రెల, మేకల పెంపకందారుల



సంఘం మండల అధ్యక్షుడు బొమ్మలపల్లి శ్రీశైలం యాదవ్ ఆధ్వర్యంలో పశువైద్యాధికారి వాసుదేవరెడ్డి సారథ్యంలో గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులను వేశారు. అనంతరం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్, జిఎంపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎక్కాల దేవి కొమురయ్యలు మాట్లాడుతూ గొర్రెలకు, మేకలకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి నట్టల నివారణ మందులను వేయాలన్నారు. పశువైద్యాధికారి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ గొర్రెలకు నట్టల నివారణ మందులు వేయడం వలన ఆరోగ్యం మెరుగుపడుతుందని బరువు పెరగడంతో పాటు పాల ఉత్పత్తి పెరుగుతుందన్నారు. వాటిలో మరణాల రేటు తగ్గుతుందన్నారు. మూడుచింతలపల్లి మున్సిపల్‌లో 6300 గొర్రెలు, 450 మేకలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి మంద శ్రీనివాస్‌రెడ్డి, జిఎంపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు జహంగీర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు. మాజీ ఎంపిటిసి, తదితరులు పాల్గొన్నారు.



## అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ కమిటీని అభినందించిన డిసిసి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయి కమిటీని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అభినందించారు. అలియాబాద్ మున్సిపల్ అధ్యక్షుడు తుంకి రమేష్ ఆధ్వర్యంలో డిసిసి నివాసానికి తరలిన కమిటి సభ్యులు డిసిసిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శులు, అనుబంధ కమిటీల సభ్యులను డిసిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం డిసిసి తోటకూర వజ్రేష్‌యాదవ్ మాట్లాడుతూ రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుటకు ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలన్నారు. పార్టీని బలోపేతం చేయాలని, ప్రజాపాలనలో భాగంగా ప్రభుత్వం అమలుపరుస్తున్న పలు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్, సీనియర్ నాయకులు ముద్దం సుధాకర్‌రెడ్డి, ఎఎంసి డైరక్టర్ తుంకి బిక్షపతి, బండి రాంరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## నిషేధిత చైనా మాంజా స్వాధీనం

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** వేర్వేరు ప్రాంతాల్లో నిషేధిత చైనా మాంజాను చాటుమాటున విక్రయిస్తున్న వారిపై మల్కాజిగిరి, నేరేడ్‌మెట్ పోలీసులు దాడి చేసారు. గౌతంనగర్ ప్రాంతంలో నిల్వ చేసి విక్రయించేందుకు సిద్ధం చేసుకొన్న డెలివరీ బాయ్‌లుగా జీవనం కొనసాగిస్తున్న ఆర్ శివకుమార్, చిట్టలూరి కళ్యాణ్‌లను మల్కాజిగిరి పోలీసులు, వినోబానగర్ నివాసి గౌలికర్ హరిలాల మౌనికతో పాటు ఓ మైనర్ బాలుడి వద్ద ఉన్న నిషేదిత మాంజాను స్వాధీనం చేసుకొన్నారు. నిషేధిత మాంజా కలిగి ఉండటం, విక్రయించటం చట్టరీత్యా నేరమని,ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.



## కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా కృష్ణారెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా అలియాబాద్ మాజీ సర్పంచ్ కమఠం కృష్ణారెడ్డి నియామకం అయ్యారు. మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు (డిసిసి) తోటకూర వజ్రేష్ యాదవ్ అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ పూర్తిస్థాయి కమిటీని ప్రకటించారు. మున్సిపల్ అధ్యక్ష పదవి తుంకి రమేష్‌ను వరించడంతో ప్రధాన కార్యదర్శిగా కమఠం కృష్ణారెడ్డిని నియమించారు.

# ప్రత్యామ్నాయ దిశగా సిపిఐ అడుగులు

### రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు విఎస్ బోస్







**ప్రజాపక్షం/కాప్రా:** మేడ్చల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో సిపిఐ 101వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. సిపిఐ మల్లాపూర్ డివిజన్ సమితి ఆధ్వర్యంలో మల్లాపూర్ ఎలిఫెంట్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన ఎర్రజెండాను పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు జి.దామోదర్‌రెడ్డి ఎగురవేసారు. అనంతరం మహిళా కార్యకర్తలు కేక్ కట్‌చేసి నినాదాలు చేస్తూ శుభాకాంక్ష లు తెలుపుకొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు విఎస్ బోస్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర, అమూల్యమైన త్యాగాలు, వర్ణనాతీతమైన సమరశీల పోరాటాలు, ఉద్యమాలతో నిండిన మహోన్నతమైన చరిత్ర కలిగిందన్నారు. వందేళ్ల ఘన





చరిత్రతో శత వార్షికోత్సవాలను సిపిఐ సముపార్జన చేసిందని కొనియాడా రు. కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర, నేటి భావితరాలకు లెనినిజం, మార్క్సిజం సిద్ధాంతం, అధ్యయనం, ఆచరణ, వీరోచిత పోరాటాలు, ఉవ్వెత్తున ఎగసిపడిన ఉద్యమాలు, అపారమైన త్యాగాలు, అనుభవాలు, ప్రజల ఆశాకిరణంగా ఎదుగుదల సంక్షోభాల



ఆటుపోట్లు, విజయాలు, పరాజయాలు, దేదీప్యమానంగా ప్రకాశిస్తూ ఉత్తేజాన్ని నింపడం, కమ్యూనిస్టు నైతికతను బోధించే వర్గ పోరాటాల చరిత్ర అన్నారు. నేడు కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం రాచరికపు పోకడలను అవలంబిస్తోందన్నారు. రాజ్యాంగాన్ని మార్చి మనువాద భావజాలాన్ని దేశంపై రుద్దటానికి ప్రయత్నం చేస్తోందన్నారు. దేశంలోని ప్రజలందరిని కులమతాలకు అతీతంగా సంఘటితం చేసేందుకు సిపిఐ అహర్నిశలు కృషి చేస్తూ ప్రజల వెన్నంటి ఉంటోందన్నారు. దేశంలో ప్రత్యామ్నాయ దిశగా సిపిఐఅడుగులు వేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఉప్పల్ మండల కార్యదర్శి టి.సత్యప్రసాద్, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మేంద్ర, సిపిఐ ఉప్పల్ నియోజకవర్గ సమితి కార్యవర్గ సభ్యులు నారా నర్సింహ, లక్ష్మి నారాయణ, నర్సింహరావు, భిక్షపతి, కృపాకర్, నర్సింగరావు, ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్ నేతలు గిరిబాబు, స్వప్న, నర్మద, మహేష్, అజీం పాషా, సమీర్, భరత్, క్రిష్, ఇంతియాజ్ తదితరు లు పాల్గొన్నా రు. సిపిఐ కాప్రా సమితి ఆధ్వర్యంలో ఈసిఐఎల్ చౌరాస్తాలో, సిపిఐ కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి అధ్యక్షతన జవహర్‌నగర్‌లో జరిగిన మరో కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు విఎస్ బోస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గా ల కోసం నిరంతరం వారి హక్కులకోసం ప్రజలు, కార్మిక, కర్షకుల పక్షాన పోరాటాలు చేస్తున్న పార్టీ సిపిఐ మాత్రమే అన్నారు. సిపిఐ ఆవిర్భావ వేడుకల ముగింపు కార్యక్రమాలు జనవరి 18న ఖమ్మంలో జరుగనున్నాయని, దీనిలో భారీగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటపల్లి శంకర్, మేడ్చల్ జిల్లా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల నర్సింలు, గిరిజన సమైక్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్యామల లత, వి. స్వరూప నాయక్, గిరిప్రసాద్, నగర్ శాఖ కార్యదర్శి కొండా సత్యం సాగర్, సిపిఐ కాలనీ కార్యదర్శి రాజు, ఎఐటియుసి మండల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.



నిజాంపేట వార్డు కార్యాలయం వద్ద జరిగిన సిపిఐ పార్టీ ఆవిర్భావ వేడుకల్లో నాగేశ్వరరావు ఎర్ర జెండా ఎగురవేయగా పార్టీ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో అతి పెద్ద పార్టీగా సిపిఐని అవతరించేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. సిపిఐ యోధులు నాగేశ్వర్‌రావు, జగన్ స్టూడియో అధినేత జగన్ మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



మల్కాజిగిరి చౌరాస్తాలో జరిగిన పార్టీ ఆవిర్భావ వేడుకల్లో సిపిఐ మండల కార్యదర్శి టి.యాదయ్య గౌడ్ ఎర్ర జెండా ఎగురవేయగా పార్టీ మండల సహాయ కార్యదర్శి కె.అశోక్, బన్ను రాములు, పి. సత్యనారాయణ, ఏఎస్‌కె అజీజ్, సయ్యద్ యూసూఫ్, తదితరులు పాల్గొన్నారు. వినాయక్‌నగర్ సిపిఐ కార్యాలయం వద్ద జరిగిన మరో కార్యక్రమంలో సిపిఐ నేత సిహెచ్ దశరథ్ ఎర్ర జెండాను ఆవిష్కరించారు.





**కూకట్‌పల్లిలో :** శుక్రవారం కూకట్‌పల్లి మండలం శ్రీశ్రీ నగర్ సిపిఐ పార్టీ కార్యాలయం వద్ద, శ్రీశ్రీ నగర్ శాఖ కార్యదర్శి కె.మనోచారి అధ్యక్షతన ఘనంగా శతాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి మండల సిపిఐ కార్యదర్శి జి.కృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల వర్గానికి పేద ప్రజల సమస్యలపై అనునిత్యం పోరాడే పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో పెంటయ్య, బాలయ్య, శ్రీనివాస్, జి.రాములు, మున్సిపల్ రంగం కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్ మండలం ఫతేనగర్‌లోని తెలంగాణ సాయుధ పోరాట యోధుడు రావి కామ్రేడ్ నారాయణరెడ్డి స్థూపం వద్ద శుక్రవారం జెండా కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా నాయకులు కామ్రేడ్ ఎస్.వెంకట్‌రెడ్డి పాల్గొ ని ఎర్ర జెండా ఎగురవేశారు.

**బోడుప్పల్‌లో :** మేడిపల్లి మండలం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 100వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మేడిపల్లి మండల సిపిఐ పార్టీ కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా ఇందిరానగర్ కాలనీలో పార్టీ జెండా రచ్చ కిషన్, భగత్ సింగ్ నగర్ కాలనీలో పార్టీ జెండాను వి బి బాలరాజ్, వివేకానంద కాలనీలో సిహెచ్ మాధవిలు పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం రచ్చ కిషన్ మాట్లాడుతూ, భారతదేశంలో 1925 ఆవిర్భవించి దేశ స్వతంత్రం కోసం ఎన్నో ఉద్యమాలు ప్రాణత్యాగాలు చేసి స్వాతంత్రం కోసం దేశంలో ఉన్న కార్మికులు కర్షకులను ఏకం చేసి పెద్ద ఎత్తున ఉద్యమం చేసిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎంసిపిఐ పార్టీ మండల కార్యదర్శి ముడి మార్టిన్,మేడిపల్లి మండల కౌన్సిల్ సభ్యులు కే ప్రమీల, సిపిఐ పార్టీ నాయకులు ఇస్తారి, సోమరాజు, వెంకటమ్మ, సత్తమ్మ, పి.అండాలు, మరియు భగత్ సింగ్ నగర్ కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

**ఘట్‌కేసర్‌లో :** సిపిఐ 100 సంవత్సరాల ప్రస్థానంలో అనేక పోరాటాలు,ఉద్యమాలు నిర్మించిందని దేశ స్వతంత్ర పోరాటాంలో అగ్రభాగం నిలిచిందని తెలంగాణ సాయుధ పోరాటం నడిపి రజాకార్లను తరిమికొట్టిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదే అని సిపిఐ మండల కార్యదర్శి లొట్టి ఈశ్వర్, ఎఐటియుసి రాష్ట్ర నాయకులు కల్లూరి జయచంద్ర అన్నారు.

పోచారం, కేల్ మహేంద్రనగర్, కాచవాని సింగారం, ఎదులాబాద్, వివిధ గ్రామంలో పార్టీ జెండాలను లొట్టి ఈశ్వర్, కల్లూరి జయచంద్రలు ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో మండ ల కార్యదర్శి సయ్యద్ ఖదీర్, ధనుంజయ, శ్రీనివాస్, లక్ష్మి , సరిత, ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

**శామీర్‌పేటలో:** గడిచిన వందేళ్లలో ప్రజల జీవన విధి విధానాలు, అనేక సమస్యలపై కార్మిక, కర్షక అసంఘటిత రంగాల మెరుగైన జీవనంకోసం సుదీర్ఘ పోరాటాలు చేస్తున్న ఏకైక పార్టీ భారత కమ్యూనిస్ట్ పార్టీ అని సిపిఐ జిల్లా మాజీ కార్యదర్శి డిజి సాయిలుగౌడ్ అన్నారు.

శుక్రవారం శామీర్‌పేట మండల కేంద్రంలోని పెద్దమ్మ కాలనీలో ధర్మ బిక్షం భవన్‌లో సిపిఐ మండల కార్యదర్శి డిజి నరేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో కమ్యూనిస్ట్ పార్టీ జెండాను ఆవిష్కరించి ప్రజా ఉద్యమాల్లో పాలుపంచుకున్న అమరులను స్మరించుకున్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి మూల స్తంభాలైన రాజకీయరంగం, న్యాయవ్యవస్థ, పోలీస్ వ్యవస్థ, వార్తా పత్రికల రంగాల ప్రజల న్యాయమైన హక్కుల పరిరక్షణ కోసం పోరాడాల్సిన సందిగ్ధావస్థలో ఉందని డిజి నరేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు.

**తాండూరులో:** సిపిఐ తాండూరు పట్టణ కార్యదర్శి మునీర్ ఆహ్మద్ ఆధ్వర్యాన సిపిఐ వంద వసంతోత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా స్వామ్య విలువలను కాపాడుకోవాలని అన్నారు.





## నూతన జిహెచ్ఎంసి జోనల్ కార్యాలయాలు

### జోనల్ కమిషనర్లుగా ఐఎఎస్ అధికారులు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** మహా గ్రేటర్ హైదరాబాద్‌లో పూర్తిగా విలీనమైన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జిహెచ్ఎంసిఅధీనమైంది. గ్రామ పంచాయతి, మున్సిపాలిటి వార్డుల స్థానంలో కొత్తగా జిహెచ్ఎంటి డివిజన్‌లు వచ్చాయి. ఈ నేపథ్యంలో పరిపాలనా సౌలభ్యంలో భాగంగా ఇప్పటివరకు జిల్లాలో ఉన్న ఉప్పల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి సర్కిల్ కార్యాయాలను జోనల్ కార్యాలయంగా మారుస్తూ కొత్తగా కుత్బుల్లాపూర్ జోనల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసారు. దీంతో పాటు జిల్లాలో ప్రస్తుతం ఉన్న కాప్రా, ఉప్పల్, మల్కాజిగిరి, ఆల్వాల్ జిహెచ్ఎంసి సర్కిల్ కార్యాలయాలకు జిహెచ్ఎంసి కార్యాలయాలకు అదనంగా కీసర, మల్కాజిగిరి2, ఘట్‌కేసర్, నాచారం, మౌలాలి, బోడుప్పల్, మేడ్చల్, నిజాంపేట, గాజుల రామారం, దుండిగల్ సర్కిల్ కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. కొత్తగా ఏర్పడిన మల్కాజిగిరి జోనల్ కార్యాలయ పరిధిలో కీసర, ఆల్వాల్, బోయినపల్లి, మౌలాలి,మల్కాజిగిరి 2, ఉప్పల్ జోనల్ కార్యాలయ పరిధిలో కాప్రా, నాచారం, ఉప్పల్, బోడుప్పల్, ఘట్‌కేసర్ సర్కిల్ కార్యాలయాలు, కూకట్‌పల్లి జోనల్ కార్యాలయ పరిధిలో మాదాపూర్, ఆల్విన్ కాలనీ, కూకట్‌పల్లి, మూసాపేట సర్కిల్ కార్యాలయాలు, కుత్బుల్లాపూర్ జోనల్ కార్యాలయ పరిధిలో చింతల్, జీడిమెట్ల, దుండిగల్, కొంపల్లి, గాజుల రామారం, నిజాంపేట, మేడ్చల్ సర్కిల్ కార్యాయాలను చేకూర్చారు.

**జోనల్ అధికారుల నియామకం**

మేడ్చల్ జిల్లాలో నూతనంగా ఏర్పడిన జిహెచ్ఎంసి నాలుగు జోనల్ కార్యాలయాలకు అధిపతులుగా జోనల్ కమిషనర్ హోదాలో ఐఎఎస్ స్థాయి అధికారుల ను ప్రభుత్వం నియమించింది. మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్‌గా ఉన్న రాధికా గుప్తాను ఉప్పల్ జోనల్ కమిషనర్‌గా పూర్తిస్థాయిలో నియమిస్తూ జిల్లా అదన పు కలెక్టర్ బాధ్యతలను అదనంగా కేటాయించారు. మల్కాజిగిరి జోనల్ కమిషనర్‌గా నారాయణపేట అదనపు కలెక్టర్‌గా పని చేస్తున్న సంచిత్ గంగ్వార్‌ను, కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్‌గా టిఆర్ అండ్ బి ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శిగా పనిచేస్తు న్న సందీప్ కుమార్ ఝాను నియమించ గా ఇప్పటికే కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌గా ఉన్న అపూర్వ చౌహాను అదే పదవి లో కొనసాగనున్నారు. ఉప్పల్ జోనల్ కమిషనర్‌గా రాధికా గుప్తా, మల్కాజిగిరి జోనల్ కమిషనర్‌గా సంచిత్ గంగ్వార్ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు.

## తాండూరులో యువకుల వీరంగం

### పాత కక్షలతో యువకుడిపై హత్యాయత్నం
### అడ్డుకోబోయిన తండ్రీ, కొడుకులపై కత్తితో దాడి
### తాండూరును సందర్శించిన డిఐజి, ఎస్పీ


**ప్రజాపక్షం/తాండూరు:** పాత కక్షలతో ఓ యువకుడిని వెంటాడి హత్యాయత్నానికి పాల్పడిన ఘటన తాండూరు పట్టణ శివారులోని రాజీవ్ కాలనీలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. భయంతో పరుగులు తీసిన ఆ యువకుడి పక్కనే ఉన్న ఓ బీఫ్ షాపులోకి దూరి తలదాచుకున్నాడు. కత్తులతో వెంటాడుతున్న యువకులు అక్కడికి రావడంతో బీఫ్ షాపు యాజమాని, తన కుమారుడితో కలసి వారిని వారించగా వారిపై కూడా ఆ యువకులు కత్తితో దాడిచేశారు. ఈ దాడిలో తీవ్ర గాయాలపాలైన వ్యక్తిని ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. వారిని వారించడానికి వచ్చిన మరో ఇరువురిపై కూడా కత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలైనట్లు జిల్లా ఎస్పీ స్నేహ మేహ్రా వెల్లడించారు. ఈ ఘటనతో తాండూరు పట్టణంలో ఆందోళన తీవ్రంగా మారింది. విషయాన్ని తెలుసుకున్న జిల్లా ఎస్పి ఉన్నత స్థాయి అధికారులకు సమాచారం అందించడంతో డిఐజి ఎల్ఎస్ చౌహన్‌తో కలసి జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా తాండూరు పట్టణాన్ని సందర్శించి పరిస్థితిని చక్కదిద్దారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఘటన వివరాలను వెల్లడించారు. తాండూరు మండల పరిధి ఖాంజాపూర్ గ్రామానికి చెందిన గోపాల్, కిట్టు అనే యువకులు ఓ అమ్మాయి విషయంలో పాత కక్షలు ఉన్నాయని, దీంతో గోపాల్ కత్తితో కిట్టును హత్య చేసేందుకు వెంబడించగా కిట్టు ప్రాణభయంతో పరుగెత్తుకుంటూ రాజీవ్ కాలని నూర్ ఆహ్మమద్‌కు చెంది బీఫ్ షాపు లో తల దాచుకున్నాడు. దీంతో షాపు యాజమానికి వారిని నివారించ బోయాడు. దీంతో కోపోద్రిక్తుడైన గోపాల్ నూర్ మహ్మద్(60) అదే కత్తితో కడుపులో పొడిచాడు. అడ్డుకున్న అతని కూమారుడైన అబ్బును సైతం కత్తితో దాడి చేయగా చికిత్స పొందుతున్నాడని తెలిపారు. కాగా నూర్ ఆహ్మద్‌కు కత్తిపోట్లతో తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యం లో మృతి చెందాడని తెలిపారు. దీంతో అప్రమత్తమైన పోలీసు యంత్రాంగం బందో బస్తు మధ్య నూర్ ఆహ్మద్ అంత్యక్రియలు శుక్రవారం పూర్తిచేశారు. మరోవైపు పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా భారీ బందోబస్తు చేశారు. నేరానికి కారకులైన గోపాల్, ఆదర్శ్, అనిల్, ప్రవీణ్ రెడ్డి, కృష్ణ, ప్రశాంత్ రెడ్డిలపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు జిల్లా ఎస్పి వెల్లడించారు.

## వేం నరేందర్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ప్రభు త్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం ఆయన నివాసంలో ఘనం గా నిర్వహించారు. ఈ వేడుకలకు జిహెచ్ఎంసి పరిధిలోని దేవరయాంజాల్ గ్రామానికి చెందిన టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి వేం నరేందర్‌రెడ్డికి బహుమతిని అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## మాంజా చుట్టుకొని యువకుడికి గాయాలు



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** బైకుపై వెళుతున్న ఓ యువకుడి మెడకు గాలిపటానికి ఉన్న నిషేధిత మాంజా తీవ్రమైన గాయాలకు గురైన ఉదంతమిది. కీసర మల్లికార్జున నగర్ కాలనీలో నివసించే సుధాకర్‌రెడ్డి కుమారుడు జశ్వంత్‌రెడ్డి ఎస్సీ కాలనీవైపు పొలం పనుల నిమిత్తం బైకుపై వెళుతుండగా మార్గమధ్యంలో గాలిపటానికి ఉన్న నిషేధిత మాంజా మెడకు చుట్టుకొని కింద పడిపోయాడు. రక్త స్రావమవుతున్న అతడిని స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకొని వెళ్లగా లోతైన గాయమైన మెడకు 19కుట్లు వేసారు. కీసర పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. నిషేధిత మాంజాను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు హెచ్చరించారు.

## తాగునీటి సమస్య పరిష్కరించడమే లక్ష్యం



**ప్రజాపక్షం/కొత్తూరు:** గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని మామిడిపల్లి సర్పంచ్ మోత్కురు హన్మంత్‌రెడ్డి వివరించారు. శుక్రవారం సందర్భంగా మండలం మామిడిపల్లి గ్రామంలో ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి సహకారంతో వార్డుల్లో నూతనంగా నాలుగుబోర్లు వేయించడంతోపాటు కొత్త బోరుమోటర్లు బిగించారు. గ్రామంలో పెండింగ్‌లో ఉన్న సిసి రోడ్లు, మురుగు కాలువలను పూర్తి చేసి ప్రజలకు మెరుగైన పరిపాలన అందిస్తానని సర్పంచ్ హన్మంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మామిడిపల్లి రాజు, మాజీ ఉప సర్పంచ్ ఉడుత సత్యనారాయణతోపాటు వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** నిరుపేద ప్రజలకు సేవచేయడమే లక్ష్యమని సమాజ సేవకుడు రాజేందర్‌వర్మ అన్నారు. శుక్రవారం సరూర్‌నగర్ డివిజన్‌లోని బంగారు మైసమ్మ ఆలయంలో ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తన కుమారుడు సంప్రీత్ వర్మతో కలిసి పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను సంపాదించిన సొమ్ములోంచి కొంత సమయాన్ని సేవా కార్యక్రమంలో భాగంగా పేదలకు నిత్యవసర రూపంలో అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీలు బేర బాలకిషన్, ఆకుల అరవింద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన పాలన అందించాలి

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచ్, వార్డు సభ్యులు ప్రజలకు మెరుగైన పరిపాలన అందించేందుకు కృషి చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు సూచించారు. శుక్రవారం షాద్‌నగర్‌లో సిపిఐ పార్టీ నుండి స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన దేపల్లిగూడెం తండా సర్పంచ్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.శ్రీనునాయక్, ఉప సర్పంచ్ బి.శ్యామ్‌లాల్, పీర్లగూడ వార్డు సభ్యుడిగా ఎన్నికైన సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు బుద్దుల జంగయ్య, చౌగమ్మగూడ తండా వార్డు సభ్యునిగా ఎన్నికైన లింగం నాయక్‌లను పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పానుగంటి పర్వతాలు, పాలమాకుల జంగయ్యలు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన బాధ్యత సర్పంచులపైన ఉందని అన్నారు. ఎర్ర జెండా ఎల్లప్పుడు ప్రజల పక్షాన ఉంటుందని, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. కమ్యూనిస్టు పార్టీకి ప్రజలు పెద్ద వేస్తున్నారంటే వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పరిపాలన అందించాలని సూచించారు. షాద్‌నగర్ డివిజన్‌లో ఎన్నడు లేని విధంగా కమ్యూనిస్టులు ప్రజా ప్రతినిధులుగా ఎన్నిక కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలోమండల కార్యదర్శి ఎండి షకీల్, హుస్సేన్ ఉన్నారు.

## త్రిపుర గవర్నర్ ఇంద్రాసేనారెడ్డిని సన్మానించిన లచ్చిరెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** ఇటీవల ప్రమాదంలో గాయాలపాలై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న సీనియర్ జర్నలిస్టు కమలాకర్‌ను శుక్రవారం బివిరెడ్డి నగర్ డివిజన్ సెల్ ఫైనాన్స్ కాలనీలో త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రాసేనారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా బివిరెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మిద్దెల లచ్చిరెడ్డి త్రిపుర గవర్నర్ ఇంద్రాసేనారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించడం జరిగింది. అనంతరం సీనియర్ జర్నలిస్టు కమలాకర్ ఆరోగ్య పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్పొరేటర్ లచ్చిరెడ్డితో మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల వద్దకే పాలన...

**ప్రజాపక్షం/అబ్దుల్లాపూర్ మెట్:** ప్రజల వద్దకే పాలన, పదవులు అంటే కేవలం అధికారం మాత్రమే కాదు, ప్రజాసేవకు అప్పగించిన బాధ్యత అని బండరావిరాల గ్రామ సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్ అన్నారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ దూస శంకర్, వార్డు సభ్యులు గుండ్ల భవాని శివ,నేమురగోముల మహేశ్, ఏర్పుల హరికృష్ణ, కోదాసు మణెమ్మ ఆంజనేయులు, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

## హామీలు అమలు చేస్తా

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గ్రామస్తులకు ఇచ్చిన హామీలను ప్రణాళిక బద్దంగా అమలు చేస్తామని సర్పంచ్ చందునాయక్ వివరించారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండలం ఉప్పరిగడ్డ గ్రామం నుండి ప్రధాన రోడ్డు వరకు మట్టి పోసి యంత్రాలతో చదును చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చందునాయక్ మాట్లాడుతూ ప్రధాన రోడ్డు నుండి గ్రామం మీదుగా తండా వరకు సుమారు రెండు కిలో మీటర్ల వరకు బిటి రోడ్డు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

## 28న కామినేని ఈస్ట్ హైదరాబాద్ హాఫ్ మారథాన్




**ప్రజాపక్షం/ సరూర్‌నగర్:** ఈనెల 28న కామినేని ఈస్ట్ హైదరాబాద్ హాఫ్ మారథాన్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కామినేని ఆసుపత్రి యాజమాన్యం పిలుపునిచ్చారు. శుక్రవారం ఎల్‌బినగర్ కామినేని ఆసుపత్రి ఇందిరా ఆడిటోరియంలో ఈ మారథాన్కు సంబంధించి టీషర్టులు, మెడల్లను అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ గోకుల్ రఘురామ్, మార్కెటింగ్ విభాగం వైస్ ప్రెసిడెంట్ ఏఆర్ఎస్ సత్యనారాయణ అధికారికంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యం, ఫిట్నెస్ పై ప్రజల్లో అవగాహన పెంచే లక్ష్యంతో నిర్వహిస్తున్న కామినేని ఈస్ట్ హైదరాబాద్ హాఫ్ మారథాన్ 2025కు ఏర్పాట్లు పూర్తయ్యాయని వెల్లడించారు.

## సమస్యల పరిష్కారమే ధ్యేయం



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ప్రజా సేవలో ప్రజాప్రతినిధులు నిమగ్నమై ప్రజల మన్ననలు పొందేందుకు కృషి చేయాలని షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ టి.కరుణాకర్ సూచించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన శిష్యులను శుక్రవారం షాద్‌నగర్‌లో పూల మాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ గ్రామ సర్పంచులుగా ఎన్నికైన మీరు కుల,మత వర్గ బేదాలు లేకుండా ప్రజా సమస్యలే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. గ్రామంలో ఉన్న సమస్యలను తీర్చడంతోపాటు యువత, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి వాటిపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు.

# కమ్యూనిస్టులు నిరంతరం ప్రజల పక్షం

### ఘనంగా సిపిఐ వందేళ్ల ఉత్సవాలు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** భూస్వాములు జమీందారులు జాగిర్దారులకు వ్యతిరేకంగా పేద ప్రజలకు భూములు పంచాలని, దున్నేవాడికే భూమి కావాలనే నినాదంతో సిపిఐ చేపట్టిన పోరాట ఫలితంగానే భూసంస్కరణ చట్టం అమలులోనికి వచ్చిందని సిపిఐ సీనియర్ నాయకులు ప్రేంపావని అన్నారు. శ్రమ జీవుల కోసం పుట్టిన పార్టీ సిపిఐ, కమ్యూనిస్టులు నిరంతరం ప్రజల పక్షమన్నారు. శుక్రవారం సిపిఐ వందేళ్ల ఆవిర్భావ వేడుకలో భాగంగా సిపిఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి కమతం యాదగిరి అధ్యక్షతన సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యాలయం ఎదుట సిపిఐ జెండాను ప్రేం పావని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.వెంకటేశం, ఎం.నరసింహ, ఫైమీద, జిల్లా కార్యవర్గ సభ్యులు నేర్లకంటి శ్రీకాంత్, పడాల నళిని, ఉమర్ ఖాన్, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కరుణకుమారి, జిల్లా కౌన్సిల్ సభ్యులు చెట్టుకింది శ్రీనివాస్, కొమురెల్లి బాబు, పి. వెంకటయ్య, బొడ్డుపల్లి కిషన్,






బాలకృష్ణ, జంగయ్య, నరేష్ గ్యార, చైతన్య, నరసింహ, కళ్యాణ్, అనిల్, జ్యోతి, ఇమ్రాన్, శేఖర్ షాహేద్ బేగం, మహేంద్ర, అశోక్, లెనిన్, సుమన్ పాల్గొన్నారు.

### హక్కుల కోసం ఉద్యమాలు, పోరాటాలు

**హైదరాబాద్ :** వందేళ్ళలో సిపిఐ కార్మికులు, కర్షకులు, పేదల హక్కుల కోసం అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించిందని సిపిఐ నాయకులు గడ్డమీది చంద్రమోహన్ గౌడ్ అన్నారు. సిపిఐ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సిపిఐ గౌలిపురా డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఛత్రినాక ఆటో స్టాండ్ సమీపంలో సిపిఐ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఐ హైదరాబాద్ జిల్లా సమితి సభ్యులు అటుకుల రాజు, కార్యవర్గ సభ్యులు సలీం, గౌలిపురా డివిజన్ సహాయ కార్యదర్శి పి. సునీల్, కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, శ్యాం లాల్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

### అణగారిన వర్గాల కోసం త్యాగాలు

**రంగారెడ్డి:** అణగారిన వర్గాల హక్కుల కోసం త్యాగాలు చేసిన పార్టీ సిపిఐ అని రంగారెడ్డి జిల్లా మాజీ కార్యదర్శి పుస్తకాల నర్సింగ్‌రావు అన్నారు. శుక్రవారం సిపిఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా రాజేంద్రనగర్ వద్ద ఘనంగా నిర్వహించారు. సిపిఐ మండల కార్యాలయం ఏఆర్ దేవరాజ్ భవన్ వద్ద సిపిఐ జెండాను పుస్తకాల నర్సింగ్‌రావు ఆవిష్కరించారు. సిపిఐ రాజేంద్రనగర్ మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉడెన్ గడ్డ, మైలార్దేవరపల్లి, ఎర్రబోడ శాఖల్లో శాఖ కార్యదర్శులు, మండల కార్యదర్శి జెండావిష్కరణ చేశారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు జే.ఆనంద్‌గౌడ్, రాజేంద్రనగర్ మండల కౌన్సిల్ సభ్యులు జె.సదానందగౌడ్, సయ్యద్ కాజా సాబీర్, హుస్సేన్‌భాయ్, జి.సత్యం, మునేశ్వరి, మౌనిక, శాంతమ్మ, పుష్ప భవాని తదితరులు పాల్గొన్నారు.

**హయత్ నగర్ :** సిపిఐ శతవార్షికోత్సవం సందర్భంగా హయత్‌నగర్ మండల కేంద్రంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. సిపిఐ హయత్‌నగర్ మండల కార్యదర్శి శేషరాజుపల్లి శ్రీదేవి అధ్యక్షతన జరిగిన వేడుకల్లో పార్టీ కార్యాలయం నుంచి హయత్‌నగర్ బస్టాండ్ సమీపంలోని మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. వేడుకకు సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి, సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు, ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం పూలే విగ్రహం వద్ద సిపిఐ జెండాను రవీంద్రచారి ఆవిష్కరించారు. కార్యక్రమంలో హయత్‌నగర్ మండల సహాయ కార్యదర్శులు మర్రి శోభన్, కర్నె సుజాత, జిల్లా కార్యదర్శి సామిడి వంశివర్ధన్‌రెడ్డి, నాయకులు బొంగు అరుణ్ కుమార్ గౌడ్, ఎఐటియుసి మండల కార్యదర్శి గోల్కొండ నాగరాజు, రాష్ట్ర సమితి సభ్యులు మందుల కృష్ణ కార్యదర్శి సరిత, ఎల్ బి నగర్ నియోజకవర్గ కార్యదర్శి పాల్వయి సురేందర్, మండల కార్యదర్శి ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

**సరూర్‌నగర్:** పార్టీ దోపిడీ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యమని సిపిఐ సరూర్‌నగర్ మండల కార్యిధర్శి, రంగారెడ్డి జిల్లా కార్యధర్శి బాతరాజు నర్సింహా అన్నారు. శుక్రవారం సరూర్‌నగర్ మండల కార్యాలయం సమీపంలో భారత కమ్యూనిస్ట్ పార్టీ శతాబ్ధి ఉత్సవాలను సిపిఐ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులతో కలిసి బాతరాజు నర్సింహా పార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఐ మాజీ సర్పంచ్ ఆర్.గోపాల్, ఎఐటియుసి నాయకులు మారగోని ప్రవీణ్‌కుమార్‌గౌడ్, జిల్లా సమితి సభ్యులు జిల్లాల కృష్ణ, మహబూబ్, కమలమ్మ, రమావత్ సక్రునాయక్, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గ్యార క్రాంతికుమార్, సరూర్‌నగర్ మండల కార్యధర్శి వినోద్, ఇస్తారి, గౌనియా, నూర్జహా, ఎల్లమ్మ, విజయ పాల్గొన్నారు.

**తుర్కయంజాల్:** సామ్రాజ వాదానికి వ్యతిరేకంగా ఏర్పడిన జెండానే ఎర్రజెండా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య అన్నారు. సిపిఐ శత జయంతి ఉత్సవాల సందర్భంగా మంచాల మండల కేంద్రంలో మండల కార్యదర్శి బాలయ్య ఆధ్వర్యంలో పార్టీ జెండా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఐ మంచాల మండల కార్యదర్శి బాలయ్య, మల్లిముద్దీన్, నేలమ్మ రాజు నాయక్ గాలయ్య రామకృష్ణ బాలయ్య పాల్గొన్నారు.

**కొందుర్గు:** భారత గడ్డపై సిపిఐకి వందేళ్ళు పూర్తి కావడం జరిగిందని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు బుద్దుల జంగయ్య అన్నారు. శుక్రవారం జిల్లేడు చౌదరి గూడ మండల కేంద్రంలో సిపిఐ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి మండల అధ్యక్షుడు ఎండి షబ్బీర్, మిటమిన్స్ యూనియన్ మండల అధ్యక్షుడు ఎండి చోటేమియా, సిపిఐ మండల నాయకులు చిన్నయ్య, రాములు, మాణిక్యరావు, జంగమ్మ, చంద్రమ్మ, బుచ్చయ్య, కిషోర్, పాపయ్య పాల్గొన్నారు. తుర్కయంజాల్ సర్కిల్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప (జన్నారం)లో, తుర్కయంజాల్ చౌరస్తాలో సిపిఐ సమితి కార్యదర్శి అనంతుల కాటంరాజు గౌడ్ అధ్యక్షతన ఎర్ర జెండా ఆవిష్కరించారు. కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.శివకుమార్ గౌడ్, నాయకులు అనురాధ, శ్రీకాంత్, శివ, నాగేశ్వర్, సుందరమ్మ, దుబ్బ యాదయ్య, శివప్రసాద్, పిల్లి సైదులు, వివేక్, భాస్కర్, నరసింహ, నీలా, కొట్య నాయక్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. కోహెడ గ్రామం సురవరం కాలనీలో సిపిఐ జెండాను రంగారెడ్డి జిల్లా రైతు సంఘం అధ్యక్షులు కంతం మాధవరెడ్డి ఎగరవేశారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా రైతు సంఘం ఉపఅధ్యక్షులు చల్ల నారాయణరెడ్డి, సిపిఐ పార్టీకోహెడ సురవరం కాలనీ శాఖ కార్యదర్శి రేఖ అందాలు, ఎన్ లక్ష్మమ్మ ఎండి ఫాతిమా ఎండి మ్యాజిక్ ఎండి ముంతాజ్, సత్యమ్మ, సుప్రియ పాల్గొన్నారు.
















# స్వయంఉపాధితో మహిళలు ఆర్థికంగా రాణించాలి

### ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** మహిళలు స్వయం ఉపాధి కోర్సులతోనే ఆర్థికంగా రాణించేందుకు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మెన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం ఫరూక్‌నగర్ ఎంపిడివో సమావేశ మందిరంలో ఫెమినా మహిళా సేవా మండలి ఆధ్వర్యంలో 200 మంది మహిళలకు సర్టిఫికెట్లను అంధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ పేద మహిళల అభ్యున్నతి కోసం ఆలియా సుల్తానా చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఫెమినా మహిళా మండలి అధ్యక్షురాలు అలియా సుల్తానా మాట్లాడుతూ పేద, మధ్య తరగతి మహిళలకు ఓరియంటెడ్ కోర్సులు నేర్పించామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సబియా సుల్తానా, కాంగ్రెస్ నేతలు మహ్మద్ ఇబ్రహీం, చెంది తిరుపతిరెడ్డి, రఘునాయక్, కృష్ణారెడ్డి, చల్లా శ్రీకాంత్‌రెడ్డిలు పాల్గొన్నారు.

### మొగిలిగిద్ద గ్రామాభివృద్ధి నా బాధ్యత

**ఫరూఖ్‌నగర్:** మొగిలిగిద్ద గ్రామాభివృద్ధి నాబాధ్యత..ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. శుక్రవారం మధ్యాహ్నం ఎమ్మెల్యేను మొగిలిగిద్ద గ్రామ సర్పంచ్ బుగ్గ కృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ మొగిలిగిద్ద గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని వివరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాముతోపాటు వార్డు సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.




### ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

**షాద్‌నగర్:** ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అంధించేందుకు వైద్యులు కృషి చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలో డాక్టర్ భాగ్యశ్రీ నూతనంగా ఏర్పాటు చేసిన ఆకృతి డెంటల్ ఆసుపత్రిని ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, నేతలు చెంది తిరుపతిరెడ్డి, మహ్మద్ ఇబ్రహీం, కృష్ణారెడ్డిలు పాల్గొన్నారు. సంపూర్ణ ఆరోగ్యానికి దంతాల ఆరోగ్యం ఎంతో ముఖ్యమని, అలాంటి దంతాల ఆరోగ్యానికి ఆకృతి దంతవైద్య శాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్ కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన ఆకృతి దంతవైద్యశాలను ఎమ్మెల్సీ ప్రారంభించారు.కార్యక్రమంలో కానుగు అనంతయ్య, ఈశ్వర్ రాజు, రఘునాథ్ యాదవ్, రాయికల్ వెంకటరెడ్డి, లింగం పాల్గొన్నారు.





## 'తెలంగాణ గిరిజన క్షేత్రాలు -జాతర' పుస్తకావిష్కరణ




**ప్రజాపక్షం /ఖైరతాబాద్ :** ప్రముఖ రచయిత డాక్టర్ ధ్యావనపల్లి సత్యనారాయణ రచించిన ''తెలంగాణ గిరిజన క్షేత్రాలు – జాతర'' పుస్తకాన్ని సేడ అర్జు మాస్టర్ ఆవిష్కరించారు. శుక్రవారం 38వ హైదరాబాద్ బుక్ ఫెయిర్ కొంపల్లి వెంకట్‌గౌడ్ వేదికపై దక్కన్ ల్యాండ్ పత్రిక సంపాదకులు వేద కుమార్ మణికొండ అధ్యక్షతన జరిగిన ఈ పుస్తకావిష్కరణ సభలో నిజాం కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ అప్కా నాగేశ్వరరావు, తెలుగు వర్సిటీ మాజీ రిజిస్ట్రార్ బట్టు రమేశ్, ప్రొఫెసర్ హరినాథ్ పాల్గొన్నారు. సేడం అర్జు మాట్లాడుతూ గోండు గిరిజన తెగల దర్బారుల రూపాలు, వంశపరంపరలు, నాగోబా, దంతన్‌పల్లి భీమన్నకు సంబంధించిన అంశాలను సమగ్రంగా ప్రస్తావించిన తీరు విలువైనదన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి, శరత్‌బాబు, ప్రభాకర్, రాపోలు సుదర్శన్, జూగాష్‌విలి, విజయకుమార్, వినాయక్‌రెడ్డి, సుమిద, డా.రాణిప్రసాద్ పాల్గొన్నారు.

## 'సియుఇటి– పిజి ప్రవేశాలకు కర్ణాటక సెంట్రల్ వర్సిటీ ఉత్తమం'

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగాల సాధనే లక్ష్యంతో ఆధునిక స్కిల్ కోర్సులు, నాణ్యమైన విద్యను అందించడం కలబురగిలోని కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీ ప్రత్యేకత అని వర్సిటీ ప్రొఫెసర్లు డా.లింగ మూర్తి, డా.గోవింద్, డా.అంజనేయులు, డా.సురేశ్‌లు తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. పిజి ప్రవేశాలకు జనవరి 14లోపు https:nta.nic..in/cuetpg దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# క్రీడ



## అమ్మో.. భారత గ్రాండ్‌మాస్టర్‌తో అంత ఈజీ కాదు!

ఇటీవల కాలంలో భారత కుర్రాళ్లు చదరంగంలో అబ్బురపరిచే విజయాలతో ఔరా అనిపిస్తున్నారు. వేదిక ఏదైనా తమదైన ప్రతిభతో మేటి ఆటగాళ్లను సైతం ఓడిస్తున్నారు. వరల్డ్ నంబర్ 1 మాగ్నస్ కార్ల్‌సన్ సైతం అమ్మో భారత కుర్రాళ్లతో తలపడడం కష్టమేనని అంటున్నాడు. ఫిడే వరల్డ్ ర్యాపిడ్ బ్లిట్జ్ ఛాంపియన్‌షిప్‌ను పురస్కరించుకొని మాట్లాడిన ఈ నార్వే లెజెండ్ మాజీ ఛాంపియన్ డి.గుకేశ్‌తో ఆడడం ఎల్లప్పుడూ సవాల్‌గానే ఉంటుందని అన్నాడు. దోహాలోని ఖతార్‌లో జరుగుతున్న ఫిడే వరల్డ్ ర్యాపిడ్ బ్లిట్జ్ ఛాంపియన్‌షిప్‌లో కార్ల్‌సన్ ఫేవరెట్‌గా ఆడుతున్నాడు. ఈ టోర్నీలో జూనియర్ల నుంచి తనకు గట్టి పోటీ ఎదురుకానుందని చెబుతున్న అతడు భారత కుర్రాడు గుకేశ్‌తో ముప్పేనని అంటున్నాడు. గత కొన్ని రోజులుగా నేను యంగ్‌స్టర్స్‌తో మ్యాచ్‌లు ఆడలేదు. వారు ఈ మధ్య చాలా గొప్పగా ఆడుతున్నారు. ముఖ్యంగా డి.గుకేశ్ అదరగొడుతున్నాడు. 16 నుంచి 22 ఏళ్లున్న యువకెరటాలతో ప్రమాదం పొంచి ఉంటుంది అని కార్ల్‌సన్ తెలిపాడు. ఈ ఏడాది నార్వే చెస్‌లో గుకేశ్ వ్యూహాలకు బదులివ్వలేక కార్ల్‌సన్ చేతులెత్తేశాడు. వరల్డ్ నంబర్1ను ఓడించి వార్తల్లో నిలిచాడు భారత గ్రాండ్‌మాస్టర్. అయినా సరే గుకేశ్‌ను తాను గ్రేట్ ప్లేయర్‌గా కాకుండా యంగ్‌స్టర్‌గానే చూస్తానని అంటున్నాడీ చెస్ కింగ్. ఈ మధ్య స్వదేశంలో ముగిసిన చెస్ వరల్డ్‌కప్‌లో నిరాశపరిచిన గుకేశ్.. ఫిడే వరల్డ్ ర్యాపిడ్ బ్లిట్జ్ ఛాంపియన్‌షిప్‌లో కార్ల్‌సన్‌కు చెక్ పెట్టాలనే పట్టుదలతో ఉన్నాడు. అతడితో పాటు అర్జున్ ఎరిగేసి, ప్రజ్ఞానంద.. కోనేరు హంపి, ద్రోణవల్లి హారికలు సత్తా చాటాలనుకుంటున్నారు. ఈ టోర్నీ డిసెంబర్ 26 నుంచి డిసెంబర్ 30 వరకు జరుగనుంది.



## కోహ్లీ ఖాతాలో మరో మైలురాయి..

వన్డే ఫార్మాట్లో రారాజుగా వెలుగొందుతున్న విరాట్ కోహ్లీ వరుసగా రికార్డులను బ్రేక్ చేస్తున్నాడు. సిడ్నీ వన్డేలో అర్ధ శతకంతో మొదలైన విరాట్ పరుగుల ప్రవాహం అవిఘ్నంగా కొనసాగుతోంది. బిసిసిఐ కోరిక మేరకు విజయ్ హజారే ట్రోఫీలోనూ ఆడుతున్న కింగ్ కోహ్లీ.. అక్కడా రికార్డుల దుమ్ముదులుపుతున్నాడు. తొలి మ్యాచ్‌లోనే శతకంతో రెచ్చిపోయిన భారత స్టార్.. గుజరాత్‌పై అర్ధ శతకంతో మరో రికార్డు పట్టేశాడు. లిస్ట్ – ఏ క్రికెట్‌లో అత్యధిక సగటు నమోదు చేశాడు. ఇటీవల కాలంలో సూపర్ ఫామ్ కొనసాగిస్తున్న కోహ్లీ విజయ్ హజారే ట్రోఫీతో తడాఖా చూపిస్తున్నాడు. వచ్చే ప్రపంచకప్ లక్ష్యంగా పదిహేనేళ్ల తర్వాత ఈ లీగ్‌లో ఆడుతున్న అతడు.. విధ్వంసక ఆటతో అందర్నీ ఫిదా చేస్తున్నాడు. శుక్రవారం గుజరాత్‌పై హాఫ్ సెంచరీతో కదం తొక్కిన విరాట్ మళ్లీ వంద కొట్టేలా కనిపించాడు. కానీ, 77 పరుగుల వద్ద వెనుదిరిగాడు. అయినా సరే.. అత్యధిక సగటుతో ఆస్ట్రేలియా మాజీ ఫినిషర్ మైఖేల్ బెవాన్ పేరిట ఉన్న ఆల్‌టైమ్ రికార్డును దాటేశాడు. 'నాటౌట్ కింగ్'గా పేరొందిన బెవాన్ సగటు లిస్ట్ ఏ క్రికెట్‌లో 57.86 కాగా.. కోహ్లీ 57.87తో అతడిని అధిగమించాడు. లిస్ట్ ఏలో సచిన్ టెండూల్కర్ రికార్డును బద్దలు కొడుతూ అత్యల్ప మ్యాచుల్లోనే 16 వేల క్లబ్‌లో చేరాడు విరాట్. ప్రస్తుతం 343 మ్యాచుల్లో 57.60 సగటుతో 16,130 రన్స్ బాదాడు. ఇందులో 58 సెంచరీలు, 84 అర్ధ శతకాలు ఉన్నాయి.

## భారత్‌దే టీ20 సిరీస్

### మూడో టీ20లో శ్రీలంక చిత్తు..

వరల్డ్ ఛాంపియన్ భారత జట్టు స్వదేశంలో తొలి సిరీస్ పట్టేసింది. ఓపెనర్ షఫాలీ వర్మ(79 నాటౌట్) విధ్వంసక అర్ధ శతకంతో చెలరేగగా.. మూడో టీ20లోనూ భారీ విజయంతో సిరీస్ పట్టేసింది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఆతిథ్య జట్టుకు కనీస పోటీ ఇవ్వలేకపోతున్న లంక త్రివేండ్రంలోనూ చతికిలపడింది. రేణుకా సింగ్(4–21)తో నిప్పులు చెరగగా.. స్వల్ప ఛేదనలో షఫాలీ ఉప్పెనలా విరుచుకుపడింది. అంతే.. 13.2 ఓవర్లలోనే విక్టరీ కొట్టిన భారత్.. మరో రెండు మ్యాచ్‌లుండగానే సిరీస్ పట్టేసింది. స్వదేశంలో ఇటీవలే వన్డే ప్రపంచకప్‌తో చరిత్ర సృష్టించిన హర్మన్‌ప్రీత్ బృందం.. పొట్టి సిరీస్‌ను కైవసం చేసుకుంది. త్రివేండ్రంలో శుక్రవారం శ్రీలంకను 112కే కట్టడి చేసిన టీమిండియా.. స్వల్ప లక్ష్యాన్ని ఉఫ్ మనిపించింది. ఓపెనర్ షఫాలీ వర్మ(79 నాటౌట్) సుడిగాలిలా చెలరేగి బౌండరీల మోతతో లక్ష్యాన్ని మంచులా కరిగించింది. స్మృతి మంధాన(1), జెమీమా రోడ్రిగ్స్(9)లు విఫలమైనా.. దూకుడే మంత్రగా ఆడిన లేడీ సెహ్వాగ్ 24 బంతుల్లోనే సెంచరీ కొట్టింది. హాఫ్ సెంచరీ తర్వాత కూడా అదే దూకుడు కనబరిచింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(21 నాటౌట్)తో కలిసి జట్టుకు భారీ విజయాన్ని అందించింది. ఈ గెలుపుతో టీ20ల్లో అత్యధిక విజయాలతో ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మేగ్ లానింగ్ పేరిట ఉన్న రికార్డును హర్మన్‌ప్రీత్ బ్రేక్ చేసింది. 77 విజయాలతో లానింగ్‌ను ఇండియన్ స్కిప్పర్ వెనక్కి నెట్టేసింది. వరుసగా రెండు మ్యాచుల్లో ఓడిన శ్రీలంక చావోరేవో పోరులోనూ చిన్న స్కోర్‌కే పరిమితమైంది. టాస్ ఓడిన ఆ జట్టు ఇన్నింగ్స్‌ను దూకుడుగానే ఆరంభించింది. ఓపెనర్ హాసిని పెరీరా( హాసిని పెరీరా(25) బౌండరీలతో చెలరేగడంతో స్కోర్ దాటింది. అయితే.. దీప్తి శర్మ(3–18) ఓవర్లో చమరి ఆటపట్టు(3)ను ఔట్ చేసి దీప్తి శర్మ తొలి బ్రేకిచ్చింది. ఆ తర్వాత ఆరో ఓవర్లో రేణుకా సింగ్(4–21) పెరారీతో పాటు డేంజరస్ హర్షిత సమరవిక్రమ(2)లను వెనక్కి పంపింది. దాంతో.. 32కే లంక మూడు బిగ్ వికెట్లు కోల్పోయి ఒత్తిడిలో కూరుకుపోయింది.



**దులానీ మెరుపులతో..**

కీలక బ్యాటర్లు ఔట్ కావడంతో కష్టాల్లో పడిన లంకను ఇమేశా దులానీ (27) ఆదుకుంది. అయితే.. ఆమెతో కలిసి భాగస్వామ్యంతో జట్టును ఆదుకోవాలనుకున్న నీలాక్షి డిసిల్వా(4)ని రేణుక ఎల్బీగా పెవిలియన్ చేర్చింది. దాంతో.. 10 ఓవర్లకు లంక స్కోర్. 45–4. క్రాంతి గౌడ్ దీప్తి ఓవర్లో ఫ్రంట్‌ఫుట్‌లో స్వీప్ షాట్లతో విరుచుకుపడిన దులానీ.. కవిశ దిల్హరి(20)తో కలిసి స్కోర్ బోర్డును ఉరికించింది. 26 బంతుల్లో 40 రన్స్ పిండుకున్న ఈ ద్వయాన్ని దీప్తి విడదీసింది. సిక్సర్‌కు యత్నించిన దిల్హరి బౌండరీ వద్ద అమన్‌జోత్ చేతికి చిక్కడంతో 85 వద్ద ఐదో వికెట్ పడింది. కాసేపటికే దులానీని రేణుక వెనక్కి పంపగా లంక స్కోర్ నెమ్మదించింది. ఆఖర్లో కుశాని నుత్యంగన(19 నాటౌట్) మెరుపులతో ఆటపట్టు బృందం నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 112 రన్స్ చేయగలిగింది.


# ఫోకస్ సైన్స్



## కర్వ్‌డ్ స్పేస్ టైమ్‌లో కణాల ఉనికి!

సాధారణంగా మనం కణం ఉంది లేదా లేదు అన్నది ఒక తిరుగులేని వాస్తవమని అనుకుంటాం. కానీ క్వాంటం సిద్ధాంతం, ఐన్‌స్టీన్ సాధారణ సాపేక్ష సిద్ధాంతంతో కలిపినప్పుడు, అందుకు భిన్నమైన ఒక ఆశ్చర్యకరమైన నిజం బయటపడుతుంది. కణాల ఉనికి పరిశీలకుడి దృక్పథంపై ఆధారపడి ఉంటుందిగానీ, ఇది భ్రమ కాదు, కొలతలో తప్పు కూడా కాదు.. విచిత్రంగా అది ప్రకృతి పనిచేసే విధానం. కణాలను 'అబ్సల్యూట్' లేదా 'సంపూర్ణమైన' కణాలు కావు. క్లాసికల్ ఫిజిక్స్‌లో కణాలను చిన్న, స్పష్టమైన బిందువులుగా పేర్కొన్నారు. కానీ క్వాంటం భౌతికశాస్త్రంలో కణాలు అసలు వస్తువులుగా కాకుండా క్వాంటం ఫీల్డ్‌లో ఏర్పడే ఉత్తేజిత స్థితులు. అంటే, కణాలు వస్తువులు కావు. ఈ ఫీల్డ్‌ను ఎలా విభజించి కణం అని పిలవాలో అన్నది పరిశీలకుడి కదలిక, గురుత్వాకర్షణ, సమయాన్ని ఎలా కొలుస్తున్నాడన్నదానిపై ఆధారపడి ఉంటుంది. దీనితో వేర్వేరు పరిశీలకులకు వేర్వేరు వాస్తవాలు తెలిసే అవకాశం ఉంది. కర్వ్‌డ్ (వంపు తిరిగిన) స్పేస్‌టైమ్‌లో లేదా యాక్సిలరేషన్ ఉన్న పరిస్థితుల్లో, ఇద్దరు పరిశీలకులు ఒకే ప్రాంతాన్ని చూసినా, వాటిని భిన్నంగా అనుభవించవచ్చు. ఒక పరిశీలకుడికి అది పూర్తిగా ఖాళీ వాక్యూమ్‌గా అనిపించవచ్చు. మరొక పరిశీలకుడికి అదే చోట కణాలతో, శక్తితో నిండినట్లు అనిపించవచ్చు. ఇద్దరూ తమతమ ఫ్రేమ్‌లలో చూసింది నిజమే. ఒకరు తప్పు, మరొకరు నిజం అనే ప్రశ్నే ఉండదు. దీనిని నిరూపించడానికి 'అన్‌రూహ్ ఎఫెక్ట్' యాక్సిలరేషన్ ఉదాహరణను పేర్కొంటారు. స్థిరంగా ఉన్న పరిశీలకుడికి స్పేస్ ఖాళీగా ఉంటుంది. అదే స్పేస్‌లో వేగంగా కదులుతున్న లేదా యాక్సిలరేట్ అయ్యే పరిశీలకుడికి వేడి, కణాలు కనిపిస్తాయి. ఇక్కడ కొత్త కణాలు ఎక్కడి నుంచో వచ్చాయని కాదు. వాక్యూమ్‌ను విభజించే విధానం మారింది అంతే. కదలికే వాస్తవాన్ని మార్చింది. బ్లాక్ హోల్‌కు దూరంగా ఉన్న పరిశీలకుడికి ఒక రకమైన కణాల చిత్రణ లేదా గురుత్వాకర్షణ, స్పేస్‌టైమ్‌ను వక్రీకరణం చెందేలా చేస్తే, ఇదే ప్రభావం బ్లాక్ హోల్‌కు దగ్గరగా ఉన్న పరిశీలకుడికి పూర్తిగా భిన్నమైన చిత్రంగా కనిపిస్తుంది. ఒకరికి ఉన్న కణం మరొకరికి లేనట్టు అనిపించవచ్చు. ఇది కణాలు స్వతంత్రంగా ఉన్నాయన్న భావనను పూర్తిగా సవాలు చేస్తుంది. మొత్తం మీద ఈ అధ్యయనం లేదా సిద్ధాంతం మన వాస్తవ భావననే మార్చేస్తుంది. దీని ప్రకారం, కణాలు శూన్యంలో తేలుతున్న చిన్న డాట్స్ కావు.. అవి స్పేస్‌టైమ్ ఆకృతిచేసిన క్వాంటం ఫీల్డ్ నుంచి ఉద్భవించే సంబంధిత సంఘటనలు. పరిశీలన, కదలిక, గురుత్వాకర్షణ కలిసి వీటి ఉనికిని నిర్వచిస్తాయి. అందువల్ల వస్తువు పదార్థం అనేది పూర్తి వాస్తవం కాదు. అలాగని అవాస్తవం కూడా కాదు. చూసేవారి దృష్టిని బట్టి, వారు ఉన్న పరిస్థితులను బట్టి, అది మారుతూ ఉంటుంది.

## విశ్వమానవులం!



మనిషికీ, ప్రకృతికీ అవినాభావ సంబంధం ఉందని మనకు తెలుసు. అయితే, మన శరీరంలోని ప్రతి అణువు బిలియన్ల సంవత్సరాలుగా విశ్వాన్ని దాటి వచ్చిందంటే ఆశ్చర్యం కలుగుతుంది. కానీ, భౌతిక సిద్ధాంతాలను అనుసరించి ఇది వాస్తవం. భూమి ఏర్పడక ముందే, పేర్లునగరాలు సముద్రాలు లేని కాలంలోనే, నక్షత్రాలు ఈ అణువులను ఆవిష్కరించి చెదరగొట్టాయి. గురుత్వాకర్షణ వాటిని మళ్లీ సమకూర్చింది. నెమ్మదిగా, అపార ఓపికతో కణాలను, రసాయనాలను, చివరకు శ్వాసను, ఆలోచనను రూపొందించింది. మీరు స్పేస్‌కు వేరు కాదు. మీరు అదే స్పేస్ పురాతన విశ్వ సంభావ్యత ద్వారా తాత్కాలికంగా సంఘటనా రూపం. ఈ అణువులు నక్షత్రాల మూలాల నుంచి జన్మించాయి. అక్కడి అపార ఒత్తిడి, సమయం కలిసి మూలకాలను సృష్టించాయి. నక్షత్రాలు వృద్ధాప్యానికి చేరి పేలినప్పుడు లేదా సూపర్‌నోవా సమయంలో, వాటి పదార్థం అంతరిక్షంలోకి వ్యాపించింది. ఆ ధూళి మేఘాలు కుంచించుకుని కొత్త సూర్యులను, గ్రహాలను నిర్మించాయి. అప్పుడే రసాయనశాస్త్రం మేల్కొంది... జీవశాస్త్రం దానికి కొనసాగింపుగా వచ్చింది. విశాలమైన కాలప్రవాహంలో తిరుగుతున్న కణాలు సరైన పరిస్థితులు ఏర్పడే వరకు ఎదురుచూశాయి. తొందర లేకుండా, జ్ఞాపకం లేకుండా, లోతైన కాలంలో సంభావ్యతను మార్గనడిపిస్తూ జీవం సమకూరింది. శాస్త్రం ఈ వంశావళిని స్పష్టంగా చూపిస్తుంది. ఐసోటోప్‌లు, నక్షత్ర ధూళి కణాలు, విశ్వ మోడల్స్. కార్బన్, ఆక్సిజన్, ఇనుము, కాల్షియం వంటివన్నీ అక్కడి నుంచి వచ్చినవే. అంటే, మనలో కొత్తగా సృష్టించబడింది ఏమీ లేదు.. ఉన్నదంతా పునర్వ్యవస్థీకరణ మాత్రమే. ఈ అవగాహన మనసును స్థిరపరుస్తుంది. వినయాన్ని నేర్పుతుంది. మన ఉనికి యాదృచ్ఛికం కాదు. అది కొనసాగింపు. అపార కాలం, స్పేస్, పదార్థం కలిసి పనిచేసిన భౌతిక నియమాల ఫలితం.. నిశ్శబ్దంగా, అంతులేకుండా ముందుకు సాగుతున్న ప్రక్రియ. భావోద్వేగపరంగా ఈ జ్ఞానం భయాన్ని మెత్తబరుస్తుంది. మన ఆలోచనలు పుట్టకముందే ప్రారంభమైన కథలో మనం భాగస్వాములం. నష్టం, మార్పు ముగింపులు కాకుండా కదలికలుగా కనిపిస్తాయి. అదే అణువులు ముందుకు ప్రయాణిస్తూనే ఉంటాయి. ఒంటరితనం స్థానంలో సంబంధం వస్తుంది. ఒకే జీవితకాలాన్ని మించి విస్తరించిన కాలంలో.. నక్షత్రాలు, గెలాక్సీలు, జీవం.. అన్నింటితో మన గుర్తింపు ముడిపడినప్పుడు అర్థం లోతుగా మారుతుంది. అందుకే శ్వాస తీసుకునేటప్పుడు మన లోతును గుర్తుంచుకోండి. మనం ఒకేసారి తాత్కాలికులం... కాలరహితులం కూడా. విశ్వం మన ద్వారా తనను తాను గమనించడం నేర్చుకుంటోంది. ఆ వారసత్వాన్ని సున్నితంగా చూసుకోవాలి. ఆసక్తి దానిని గౌరవిస్తుంది. శ్రద్ధ దానిని కాపాడుతుంది. దానిని జీవించేలా చేస్తుంది. ప్రతి ఎంపిక దూరంగా ప్రతిధ్వనిస్తుంది... ముందుకు. ఓపికతో, దయతో, శాస్త్రంతో, వినయంతో, ఆశ్చర్యంతో మనం ఇంకా విస్తరిస్తున్న విశ్వంతో ముడిపడి ఉంటాం.. వాటితోనే కలిసి.. వాటిలోనే కలిసి.

# రీల్



## అమరావతికి ఆహ్వానం


హారర్ నేపథ్యంలో రూపొందిన చిత్రం 'అమరావతికి ఆహ్వానం'. శివ కంఠంనేని, ధన్య బాల కృష్ణ, ఎస్తర్, సుప్రిత, హరీష్ ప్రధాన పాత్రలతో తెరకెక్కుతోన్న ఈ మూవీలో సీనియర్ నటులు అశోక్ కుమార్, భద్రమ్, జెమిని సురేష్, నాగేంద్ర ప్రసాద్ కీలకపాత్రలు పోషించారు. డైరెక్టర్ జివికె ఈ మూవీని తెరకెక్కిస్తున్నారు. ప్రముఖ నిర్మాత ముప్పా వెంకయ్య చౌదరి నిర్మాణ సారథ్యంలో జి.రాంబాబు యాదవ్ సమర్పణలో లైట్ హౌస్ సినీ మ్యాజిక్ బ్యానర్‌పై కేఎస్ శంకర్రావు, ఆర్ వెంకటేశ్వర రావు ఈ చిత్రాన్ని నిర్మించారు. ఆంధ్ర, తెలంగాణ, మధ్య ప్రదేశ్‌లోని పలు లొకేషన్స్‌లో షూటింగ్స్ జరుపుకున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు శర వేగంగా జరుపుకుంటోంది. త్వరలో థియేటర్స్‌లో రిలీజ్ చేయనున్నారు తాజాగా సరికొత్త పోస్టర్ గ్లింప్స్ రిలీజ్ చేశారు.




## రాశీ ఖన్నా పోస్టర్ విడుదల

పవన్ కళ్యాణ్ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా నుంచి హీరోయిన్ రాశీ ఖన్నా పోస్టర్ విడుదల చేశారు. సినిమా షూటింగ్ సెట్ ఫోటోస్‌ను విడుదల చేశారు. ఈ ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. పవన్ కళ్యాణ్ సరసన శ్రీలీలతో పాటు రాశీ ఖన్నా హీరో హీరోయిన్‌గా నటిస్తోంది. దేవిశ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఆనంద్ సాయి ఆర్ట్ డైరెక్టర్‌గా పని చేశారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవల విడుదలైన దేఖ్లేంగే సాలా అనే పాట చార్ట్ బస్టర్ హిట్టయ్యింది.

## 'జెట్లీ' నుంచి వెన్నెల కిషోర్ ఫస్ట్ లుక్



టాలీవుడ్ ఫేవరెట్ ద్వయం సత్య, దర్శకుడు రితేష్ రానా 'జెట్లీ'తో అలరించబోతున్నారు. మేకర్స్ ముందుగా రిలీజ్ చేసిన పోస్టర్స్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. క్లాప్ ఎంటర్టైన్మెంట్ చిరంజీవి (చెర్రీ), హేమలత పెద్దమల్లు నిర్మిస్తున్న జెట్లీని మైత్రి మూవీ మేకర్స్ సమర్పిస్తున్నారు. ఈ సినిమా నుంచి వెన్నెల కిషోర్ ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. విమానం విండో సీట్ దగ్గర వెన్నెల కిషోర్ కూర్చుని స్టైలిష్ హెయిర్‌స్టైల్‌తో కాన్ఫిడెంట్‌గా చూస్తున్న లుక్ ఆకట్టుకుంది. వెన్నెల కిషోర్ చేతిలో వున్న సినిమా సుదోకు బుక్ రితేష్ రానా మార్క్ ఫన్‌తో అలరించింది. జెట్లీతో మిస్ యూనివర్స్ ఇండియా రియా సింఘా హీరోయిన్గా టాలీవుడ్‌లోకి అడుగుపెడుతోంది. అజయ్ ఈ ప్రాజెక్ట్‌లో కీలక పాత్ర పోషిస్తున్నారు. రితేష్ రానా గత హిట్లకు పని చేసిన కోర్ టెక్నికల్ టీం ఈ సినిమాకి వర్క్ చేస్తుంది.



## 'గత వైభవం' జనవరి 1న రిలీజ్

'గత వైభవం' గత నెలలో కర్ణాటక వ్యాప్తంగా థియేటర్లలో విడుదలై భారీ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఎస్ఎస్ దుష్యంత్, ఆషిక రంగనాథ్ నటించిన ఈ చిత్రానికి సునీ దర్శకత్వం వహించడమే కాకుండా, దీపక్ తిమ్మప్పతో కలిసి ఈ ప్రాజెక్ట్‌కు సహ నిర్మాతగా కూడా వ్యవహరించారు. సర్వేగర సిల్వర్ స్క్రీన్స్‌తో కలిసి సునీ సినిమాస్ బ్యానర్‌పై నిర్మించిన ఈ చిత్రం ఇప్పుడు గ్రాండ్‌గా తెలుగులో విడుదల కావడానికి సిద్ధమవుతోంది.. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నేతృత్వంలోని ప్రైమ్‌షో ఎంటర్టైన్మెంట్ ఈ చిత్రాన్ని జనవరి 1న తెలుగులో రిలీజ్ చేయనుంది. కన్నడ వెర్షన్‌కు అద్భుతమైన స్పందన లభించడంతో, తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. విలియం జె.డేవిడ్ సినిమాటోగ్రఫీని అందించగా, జుడా శాండీ అందించిన సంగీతం కథలోని భావోద్వేగ, పౌరాణిక అంశాలను ఉన్నత స్థాయికి తీసుకువెళ్లింది. విజువల్ వండర్ గత వైభవం'లో అత్యాధునిక వీఎఫ్ఎక్స్, సౌండ్‌తో పాటు సాగే గొప్ప కథనం అలరించనున్నాయి. ప్రేమ, పురాణం, పునర్జన్మ, చారిత్రక నాటకం కలగలిసిన ఈ చిత్రం ప్రేక్షకులని మెస్మరైజ్ చేయడానికి సిద్ధంగా ఉంది.

## 'మారెమ్మ' షూటింగ్ పూర్తి



రవితేజ బ్రదర్ యాక్టర్ రఘు కుమారుడు మాధవ్ హీరోగా నటించిన రూరల్ రస్టిక్ మూవీ 'మారెమ్మ'. మంచాల నాగరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. మోక్ష ఆర్ట్స్ బ్యానర్‌పై మయూర్ రెడ్డి బండారు తమ ప్రొడక్షన్ నంబర్ 1గా నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్, గ్లింప్స్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా మేకర్స్ రిలీజ్ చేసిన పోస్టర్‌లో మాధవ్ ఎద్దును నడిపిస్తూ ధైర్యంగా ముందుకు వస్తూ ఇంటెన్స్ లుక్‌లో కనిపించారు. బ్యాక్ డ్రాప్‌లో శక్తివంతంగా కనిపించే కాళీదేవి విగ్రహం, చుట్టూ గ్రామీణ పండుగ వాతావరణం, జనసందడి, ఉత్సవ ఉత్సాహంతో పాటు ఒక పవర్‌ఫుల్ సంఘటనకు సంకేతంగా కనిపిస్తోంది.



## 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' స్పెషల్ పోస్టర్

మాస్ మహారాజా రవితేజ, కిషోర్ తిరుమల దర్శకత్వంలో, సుధాకర్ చెరుకూరి ఎస్ఎల్వి సినిమాస్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి. ఈ సంక్రాంతికి విడుదల చేయనున్నారు. ఆషికా రంగనాథ్, డింపుల్ హయతి హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలు సినిమాపై బజ్‌ను సృష్టించాయి. తాజాగా మేకర్స్ క్రిస్మస్ విషెస్ అందిస్తూ సినిమా నుంచి స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. రవితేజ సాంటా క్యాప్ పెట్టుకుని, చేతిలో గిఫ్ట్ పట్టుకుని ఫెస్టివ్ వైబ్‌లో కనిపించడం అందర్నీ ఆకట్టుకుందిభర్త మహాశయులకు విజ్ఞప్తి అవుట్ అండ్ అవుట్ ఎంటర్టైన్మెంట్‌గా తెరకెక్కిస్తున్నారు. జనవరి 13న ఈ చిత్రం గ్రాండ్‌గా రిలీజ్ కానుంది.

## 'నేను రెడీ' కొత్త పోస్టర్



'నువ్విలా', 'జీనియస్', 'రామ్ లీల', 'సెవెన్' వంటి చిత్రాలతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరో హవిష్, దర్శకుడు త్రినాధ రావు నక్కినతో జతకట్టారు. 'సినిమా చూపిస్తా మామ', 'నేను లోకల్', 'ధమాకా', 'మజాకా' వంటి విజయవంతమైన చిత్రాలను అందించిన త్రినాధ రావు నక్కిన 'నేను రెడీ' చిత్రాన్ని పూర్తిస్థాయి కమర్షియల్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కిస్తున్నారు. హర్నిక్స్ ఇండియా ఎల్ఎల్‌పి బ్యానర్‌పై నిఖిల కొనేరు ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, కావ్య థాపర్ కథానాయికగా నటిస్తోంది. చిత్ర బృందం ఒక కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో హవిష్ చాలా హుందాగా, అదే సమయంలో ఇంటెన్స్ లుక్‌తో కనిపిస్తున్నారు. చక్కగా దువ్విన జుట్టు, ట్రిమ్ చేసిన గడ్డం, నల్లటి అద్దాల కళ్ళజోడు అతనికి ఒక సీరియస్ లుక్ ఇచ్చాయి. ముదురు రంగు ప్యాంటులో ఇన్ చేసిన చెక్ షర్ట్, ఐడీ కార్డు, భుజంపై వేలాడుతున్న బ్రౌన్ కలర్ ఆఫీస్ బ్యాగ్‌తో అతని లుక్ మిడిల్ క్లాస్ మ్యాన్ లా వుంది. అతని నిలబడిన తీరు యాక్షన్‌కి సిద్ధంగా ఉన్నట్లు వుంది. ఈ సినిమా చిత్రీకరణ శర వేగంగా జరుగుతోంది. హైదరాబాద్‌లో సుదీర్ఘ షెడ్యూల్ పూర్తి చేసుకున్న తర్వాత, చిత్ర బృందం నిన్న పాండిచ్చేరిలో హీరో హీరోయిన్ల పై చిత్రీకరించిన సాంగ్ షూట్ పూర్తి చేసింది. ఈ పాటకు విజయ్ పోలాకి మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. సాంగ్ అద్భుతంగా వచ్చింది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా ఏకకాలంలో జరుగుతున్నాయి.

## 'అనగనగా ఒక రాజు'లో రెండో పాట

వరుసగా మూడు ఘన విజయాలతో ప్రేక్షకుల హృదయాలలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న స్టార్ ఎంటర్టైనర్ నవీన్ పొలిశెట్టి, 2026 సంక్రాంతికి తన తదుపరి చిత్రం 'అనగనగా ఒక రాజు'తో అలరించనున్నారు. ప్రచార చిత్రాలలో వైవిధ్యం చూపిస్తూ, ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదలైన మొదటి గీతం 'భీమవరం బాల్మా' ఆకట్టుకుంది. తాజాగా ఈ చిత్రం నుంచి రెండవ గీతంగా 'రాజు గారి పెళ్లిరో' విడుదలైంది. అనగనగా ఒక రాజు' నుంచి డ్యాన్స్ నంబర్‌గా విడుదలైన 'రాజు గారి పెళ్లిరో' పాట కట్టిపడేస్తోంది. మాస్‌తో పాటు, అన్ని వర్గాల ప్రేక్షకులు మెచ్చేలా ఉత్సాహభరితంగా సాగిన ఈ గీతం.. పండగ వాతావరణాన్ని ముందే తీసుకొని వచ్చింది. తెలుగు ప్రేక్షకుల హృదయాలలో ఎప్పటికీ నిలిచిపోయే పెళ్లి పాటలలో ఒకటిగా ఇది నిలుస్తుంది అనడంలో సందేహం లేదు. ఈ పాటలో నవీన్ పోలిశెట్టి, మీనాక్షి చౌదరి ప్రధాన ఆకర్షణగా నిలిచారు. ప్రముఖ కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ సమకూర్చిన అద్భుతమైన నృత్య రీతులతో ఈ పాటను భారీ స్థాయిలో తెరకెక్కించారు. రావు రమేష్ సహా ప్రధాన నటీనటులంతా పాల్గొనడంతో దృశ్య పరంగా ఈ పాట మరింత సంపన్నంగా, సంబరంగా మారింది. 'అనగనగా ఒక రాజు' చిత్రం సంక్రాంతి కానుకగా 2026, జనవరి 14న భారీ స్థాయిలో విడుదల కానుంది.




## 'హైలెస్సో' ఫస్ట్ లుక్ రిలీజ్

సుడిగాలి సుధీర్‌గా అందరికీ సుపరిచితుడైన సుధీర్ ఆనంద్ హీరోగా ప్రసన్న కుమార్ కోట దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'హైలెస్సో'. వజ్ర వారాహి సినిమాస్ బ్యానర్‌పై శివ చెర్రీ, రవికిరణ్ నిర్మిస్తున్నారు. ఇది వారి బ్యానర్‌కు ప్రొడక్షన్ నంబర్ 1, సుధీర్ ఆనంద్‌కు హీరోగా ఐదవ చిత్రం. గ్రామీణ నేపథ్యంతో రూపొందుతున్న ఈ చిత్రంలో కోర్ట్ సినిమాలో తన ఇంటెన్స్ నటనతో ఆకట్టుకున్న శివాజీ విలన్గా కనిపించబోతున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది.





# స్థానికం
REGIONAL NEWS

మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## ఘనంగా బాక్సింగ్ డే



ప్రజాపక్షం/జడ్చర్ల: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా జరిగే 26 డిసెంబర్ బాక్సింగ్ డే సందర్భంగా జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో గల బేతని యం.బి.చర్చి యౌవన కార్యవర్గం ఆధ్వర్యంలో క్రీడా పోటీలు ఘనంగా నిర్వహించారు. వాలీబాల్, షార్ట్ పుట్, చెస్, క్యారమ్స్, మ్యూజికల్ చైర్, ఆసక్తికరంగా కొనసాగించబడినాయి. ఈ కార్యక్రమాన్ని ప్రార్థనతో ఈ కార్యక్రమంలో రెవరెండ్ కె.విలియం బూత్, చైర్మన్ ఫిలెమోన్, దానియేలు, జోసెఫ్, జాన్సన్, నతానియల్, సిఐ రత్నం, అమృత్ రాజ్, వై.జి.ప్రీతం డేవిడ్, డ్యాని, శశిధర్, సలమోన్, గద్దం సాగర్, రవి, విజయ్‌ప్రసాద్, యూత్ చైర్మన్ సుస్మిత్, వైస్ చైర్మన్ చెర్రీ గద్దం, సహాయ కార్యదర్శి బన్ని, కోశాధికారి రాజు, సందీప్, ప్రవీణ్, జాన్ సుందర్, కర్ణ, యాకోబ్, ప్రణీత్, సన్నీ, జాన్ సుందర్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

## నేరడగం రోడ్డుకు మరమ్మతులు



ప్రజపక్షం/మాగనూర్ : మాగనూర్ మండల పరిధిలోని నేరేడగం గ్రామం నుండి ఉజ్జెలి, భైరంపల్లికి వెళ్లే రహదారులు అస్తవ్యస్తంగా ఉండడంతో రోడ్డు మరమ్మతు పనులు నేరడగం సర్పంచ్ దాసరి వెంకటమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటమ్మ మాట్లాడుతూ రోడ్డు మొత్తం గుంతల మయం కావడం కనీసం నెరడగం మీదుగా బస్సు సౌకర్యం లేకపోవడం ద్వారా ఉజ్జెల్లి నేరడగం దొడ్డి గ్రామాల నుండి పాఠశాలకు, కళాశాలకు వచ్చే విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుందన్నారు. కర్ణాటక నుంచి వచ్చే ప్రయాణికులకు చాలా ఇబ్బంది గురవుతుందని నేరడగం గ్రామ రైతులు పంట కాలంలో పండించిన ధాన్యం తీసుకురావాలన్న ఎరువులు పొలాలకు తీసుకపోవాలన్న రైతులకు చాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కాబట్టి ఎమ్మెల్యే నిధుల ద్వారా మట్టి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఉప సర్పంచ్ రవిరాజ, వార్డు సభ్యులు డి.ప్రకాష్, ఉట్కూర్ అశోక్ కుమార్, గుడిసె నర్సింహా, వాకిటి వెంకటేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు అరికట్టాలి




ప్రజాపక్షం/పెబ్బేర్: పెబ్బేరు మండల పరిధిలోని తోమాలపల్లి గ్రామంలో బాల్యవివాహాలను అరికట్టడంలో భాగంగా స్వచ్ఛంద సంస్థ అయిన ఆర్‌డిఎస్ ప్రతినిధి దివ్య తోమాలపల్లి గ్రామ పంచాయితీలో సర్పంచు మరియు ఉపసర్పంచులను కలవడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలోని బాల్య వివాహాలపై, బాల కార్మికులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. దీనికి గ్రామపంచాయితీ సహకారం అవసరమని కోరడం జరిగింది. బాల్య వివాహాలను అరికట్టడంలో భాగంగా తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని సర్పంచు అశోక్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచు అశోక్ కుమార్, ఉపసర్పంచు రాంబాబు, గ్రామ అధ్యక్షులు శ్రీనివాసులు, వార్డు మెంబర్ ఉమేష్ గౌడ్, యూత్ అధ్యక్షులు శివకుమార్, మాజీ వార్డు సభ్యులు మహేష్ బాబు, అశోక్, గుడిసె గణేష్, గుడిసె చిన్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## పడిపూజలో పాల్గొన్న మాజీ ఎంపి



ప్రజాపక్షం/ కొత్తకోట : కొత్తకోట మండలంలోని కనిమెట్ట గ్రామ జాతీయ రహదారి పక్కన గల శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో శుక్రవారం జరిగిన పడిపూజ కార్యక్రమానికి వనపర్తి మాజీ ఎమ్మెల్యే, మాజీ రాజ్యసభ సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి పాల్గొని అక్కడ జరిగిన ప్రత్యేక పూజలో ప్రార్థనలు చేసి అయ్యప్ప స్వాములకు అభినందించారు. ఈ సందర్భంగా కొత్తకోట మాజీ ఎంపీపీ గుంత మౌనిక మల్లేష్ దంపతులు మాజీ రాజ్యసభ సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి కి స్వాగతం పలికి శాలువాతో సన్మానించి అతిథి మర్యాద చేశారు. ఇదిలా ఉండగా మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి గురు స్వాములకు శాలువతో పూలమాలతో సత్కరించి. వారు చేస్తున్న కఠోర దీక్షకు. శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి పై వారికున్న భక్తిని తెలుసుకొని ప్రత్యేకంగా అభినందించారు. అదేవిధంగా దీక్ష విరమణకు చేసే శబరి మల యాత్ర దిగ్విజయం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ పార్టీ కొత్తకోట పట్టణ అధ్యక్షులు బాబు రెడ్డి, నూతన సర్పంచ్ రామచంద్రయ్య, యాదయ్య తో పాలు, నూతన పాలక మండలి సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీలకు అతీతంగా సర్పంచ్ ఎన్నికలు



ప్రజాపక్షం/నారాయణపేట : నారాయణపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో బీసీ జాగృతి సేన జిల్లా అధ్యక్షులు ఎడ్ల కుర్మయ్య ఆధ్వర్యంలో బీసీ జాగృతి సేన ముఖ్య నాయకుల సమావేశంలో బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షులు బూర్గుపల్లి కృష్ణ యాదవ్ మాట్లాడుతూ సర్పంచు ఎన్నికల రాజకీయ పార్టీలకు అతీతంగా జరిగాయని జనరల్ స్థానాలలో సైతం అధిక శాతం బీసీలే ఎన్నిక కావడం బీసీ దళపతి ఆర్.కృష్ణయ్య ఉద్యమాలవల్లే సాధ్యమైందని, ఏ పార్టీ గొప్పతనం కాదని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని మోసం చేసిన అధికార పార్టీ సర్పంచులను తమ వైపు మలుపు కోవడానికి సన్మానాల పేరిట నాటకాలకు తెరలేపిందని మోసపోవడానికి బీసీలు 42% రిజర్వేషన్లు అమలు చేశాకే, ఎంపిటిసి, జెడ్పిటిసి, మున్సిపల్, నగర పాలక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని డిమాండు చేశారు. బీసీ జాగృతి సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేష్ యాదవ్, జిల్లా అధ్యక్షులు ఎడ్ల కుర్మయ్యలు మాట్లాడుతూ ఈ నెల 29వ తారీకు నుండి ప్రారంభమయ్యే శీతాకాల అసెంబ్లీ సమావేశాలలో బీసీ రిజర్వేషన్ల పెంపు అంశంపై, కామారెడ్డి బిసి డిక్లరేషన్ అమలుకై బిఆర్‌ఎస్ పార్టీలు అధికార పార్టీని నిలదీయాలని, కోరారు. ఈ కార్యక్రమంలో దత్తు ప్రకాష్ యాదవ్, గొడుగు నర్సిములు, కుర్వ వెంకటేశ్, శ్రీను, వాజీద్, సోఫి, మజర్ హుస్సేన్, భీమప్ప, నర్సిములు, రాములు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి శ్రీకారం

ప్రజాపక్షం/వీపనగండ్ల: గ్రామాలలో గ్రామ పంచాయితీలకు నూతన పాలకవర్గం ఏర్పాటు కావడంతో గ్రామాభివృద్ధి పనులకు ఊపిరి పోసింది. ఇటీవల బాధ్యతలు చేపట్టిన సర్పంచు, ఉపసర్పంచులు గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి పలు కీలక పనులకు శ్రీకారం చుట్టారు. గత రెండు సంవత్సరాలుగా గ్రామ పంచాయితీలకు సర్పంచులు లేకపోవడం, ప్రత్యేక అధికారులు పాలన కొనసాగుతుండడంతో గ్రామాలలో అభివృద్ధి పనులు పూర్తిగా నిలిచిపోయాయి.

# భారత గడ్డకు కిషోరాలు రక్తార్పణం

### తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ : భరత గడ్డపై ఎర్రజెండా ఎగిరి వంద సంవత్సరాలు నిండాయని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ అన్నారు. ఎర్రజెండా వంద సంవత్సరాల ఆవిర్భావ దినోత్సవాల వేడుకలు పురస్కరించుకొని శుక్రవారం తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నేతృత్వంలో మహబూబ్ నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులు వంద అడుగుల ఎర్రజెండా జెండాను ప్రదర్శిస్తూ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఏఐటియూసి ఎర్ర జెండాను మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సీనియర్ నేత మొగులయ్య ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి ఘనంగా వేడుకలు నిర్వహించి ముందుగా ఎర్ర జెండా పోరాటాల్లో అసువులు బాసిన అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పి.సురేష్ మాట్లాడుతూ భారత దేశానికి సంపూర్ణ స్వాతంత్రం కావాలని 1925లో మొట్టమొదటిసారిగా కాన్పూర్‌లో మార్క్సిజం, లెనినిజం వెలుగులో కార్మిక రాజ్య స్థాపన సిద్ధాంతంతో ఎర్రజెండా భారత కమ్యూనిస్ట్ పార్టీ ఏర్పడిందని అన్నారు. దోపిడీ పీడన వ్యవస్థపై తిరుగుబాటు చేసిందని అన్నారు. కష్టజీవుల పక్షాన నిలబడి పోరుబాట సాధించిందని అన్నారు. దున్నేవాడికి భూమి అంటూ తెలంగాణ సాయుధ పోరాటం నడిపి భూస్వాములు దొరల గడీ కూల్చి పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిందని, దేశం కోసం ఎంతో మంది కిషోరాలను భరత గడ్డకు రక్తార్పన చేసిందని అన్నారు. శ్రామిక జన ఉద్ధరణ రాజీలేని సమరం నడుపుతుంది అన్నారు. శ్రమ దోపిడి అంతం చేస్తూ కార్మిక రాజ్య స్థాపనే ఎర్రజెండా లక్ష్యం అని అన్నారు. కార్మికుల సాధనకు ఐక్య పోరాటల సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి బ్రాంచ్ యూనియన్ నేతలు కార్మికులు బి.చెన్నయ్య, జే.నరసింహ, బుచ్చన్న, అంజి, శ్రీను, యాదయ్య, వీరాంజనేయులు, శ్రీనివాసరెడ్డి, రామకృష్ణ, నరసింహ, గోపాల్, మున్నా, రాఘవేందర్, సత్యమ్మ, నాగమణి, వరలక్ష్మి, శిరీష, వెంకటమ్మ, మంగమ్మ, లక్ష్మమ్మ, తిరుపతమ్మ, సునిత, శైలజా, పద్మ, ఇందిరా, జ్యోతి, అంజమ్మ, మంజుల, భాగ్యలక్ష్మి, సుధా తదితరులు పాల్గొన్నారు.




# సిపిఐకి మాత్రమే దేశభక్తి గురించి మాట్లాడే హక్కు

### సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్

ప్రజాపక్షం/వనపర్తి టౌన్ : దేశభక్తి గురించి మాట్లాడే హక్కు అధికారం సిపిఐ కే ఉందని బిజెపికి లేదని సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్ అన్నారు. శుక్రవారం వనపర్తి సిపిఐ ఆఫీసులో సిపిఐ 100వ ఆవిర్భావ దిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆఫీస్ ఆవరణలో అరుణ పతాకాన్ని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు మాజీ సర్పంచ్ కళావతమ్మ ఆవిష్కరించారు. సిపిఐ స్వాతంత్ర పోరాటయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి విప్లవ జోహార్లు అర్పించారు. ఎఐపిఎస్ఓ జిల్లా సమన్వయకర్త శివ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న ఉత్తర ప్రదేశ్ కాన్పూర్‌లో సిపిఐ ఆవిర్భవించిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. 45 శాతం మందికి రెండు లక్షల రుణమాఫీ కాలేదని చాలామంది పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు ఇవ్వలేదని రైతులకు క్వింటాలకు రూ. 500 బోనస్ చెల్లించలేదన్నారు. ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాటం ఒక్కటే మార్గమని ప్రజలు కార్యకర్తల నేతలు సిద్ధం కావాలన్నారు. పోరాటాలకు సిపిఐ అండగా ఉంటుందన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కళావతమ్మ, పట్టణ సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహేష్, ఐప్సో జిల్లా సమన్వయకర్త శివ, బాజీ వార్డు సభ్యుడు లక్ష్మీ నారాయణ, భారత జాతీయ మహిళా సమాఖ్య పట్టణ కన్వీనర్ జయమ్మ, కోకన్వీనర్ శిరీష, శ్రీదేవి, సంస్థిత, ఏఐఎస్ఎఫ్ డివిజన కార్యదర్శ వంశీ, నాయకులు శాంతన్న, వెంకటేశ్వర్లు, రాములు, బాలయ్య, రవి పాల్గొన్నారు.





## ఘనంగా సిపిఐ శతజయంతి ఉత్సవాలు

ప్రజాపక్షం/జడ్చర్ల: భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) 100 సంవత్సరాల ఉత్సవాలను జడ్చర్ల పట్టణ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. సిపిఐ ఈ దేశంలో 1925 డిసెంబర్ 26 ఏర్పడి 2025 డిసెంబర్ 26 నాటికి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జడ్చర్ల పట్టణ కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా యందు సిపిఐ ఆధ్వర్యంలో శతజయంతి ఉత్సవాలు నిర్వహించి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బాగి కృష్ణయ్య మాట్లాడుతూ సిపిఐ ఈ దేశంలో ఏర్పాటైనప్పటి నుండి స్వాతంత్ర కోసం పోరాటం నిర్వహించి కార్మికుల హక్కుల కోసం కార్మిక చట్టాలు సాధించిన దాంట్లో ప్రధాన పాత్ర పోషించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.రాజు, సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు కలీం, నసురుల్లాబాద్ శాఖ కార్యదర్శి శ్రీశైలం, శ్రీను, శేఖర్, లింగం గౌడ్, శివ యాదవ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రంలో ధాన్యం బస్తాలు మాయం



### 21 బస్తాల నష్టంపై రైతుల ఆందోళన
### మిల్లు యజమాని- మహిళా సంఘం నష్టాన్ని భరించేందుకు అంగీకారం

ప్రజాపక్షం/వీపనగండ్ల: రైతులు అరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్మటానికి వెళ్తే కొనుగోలు కేంద్రాల వద్ద కూడా మోసాలకు గురికావాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని కల్వరాల వరి కొనుగోలు కేంద్రంలో ధాన్యం మాయం ఘటన కలకలం రేపింది. ఈ నెల 14వ తేదీన కల్వరాల గ్రామానికి చెందిన రైతులు అంజి, దేవేంద్రమ్మ, బుజ్జన్న, బి.వెంకటస్వామి, రాజు, గోపాల్‌రెడ్డి, బిచ్చన్న, ఎస్.వెంకటస్వామి, అనే ఎనిమిది మంది రైతులు మొత్తం 776 వడ్ల ధాన్యం బస్తాలను మహిళా సమైక్యకు విక్రయించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని లారీ ద్వారా పానుగల్ మండలంలోని కేతపల్లి సమీపంలో ఉన్న మెహరాన్ ఇండస్ట్రీ రైస్ మిల్లుకు తరలించారు. అయితే మిల్లు వద్దకు చేరిన తరువాత టక్ సీట్లో 755 బస్తాలు మాత్రమే వచ్చినట్లు మిల్లు యజమాని నమోదు చేయడంతో 21 బస్తాలు మాయమైనట్లు వెలుగులోకి వచ్చింది. ఈ 21 బస్తాల నష్టాన్ని రైతులే భరించాలని మిల్లు యజమాని సూచించడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై శుక్రవారం రైతులు కొనుగోలు కేంద్రం వద్ద ఆందోళన చేపట్టారు. మహిళా సమైక్య నిర్వాహకులు రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను టక్ సీట్లో నమోదు చేసి రైతులకు అందించారని, ఆ తర్వాత జరిగిన పరిణామాలకు తమకు బాధ్యత లేదని మహిళా సంఘం స్పష్టం చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచు బండారు రాముడు, స్థానిక నాయకులు, గ్రామస్తులు కొనుగోలు కేంద్రానికి చేరుకుని రైతులు, మహిళా సంఘం నిర్వాహకులతో చర్చలు జరిపారు. చివరికి రైస్ మిల్లు యజమాని 10 బస్తాలకు, మహిళా సంఘం నిర్వాహకులు 11 బస్తాల ధాన్యానికి డబ్బులు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు తమ ఆందోళనను విరమించారు. ఇలాంటి ఘటనలు ఇకపై పునరావృతం కాకుండా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మిల్లుల యజమానులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రైతులు, గ్రామస్తులు హెచ్చరించారు.

## ఘనంగా అయ్యప్ప స్వామి పూజ



ప్రజాపక్షం/ఉట్కూర్: ఉట్కూర్ మండల కేంద్రంలోని గాంధీనగర్ వీధిలోని వడ్ల రాజకుమార్ నివాసంలో శుక్రవారం ఘనంగా అయ్యప్ప స్వామి శరణు ఘోష పూజ జరిగింది. ఈ సందర్భంగా గురుస్వాములు మేకల భగవంతు, యం.రఘువీర్, శ్రీనివాస్, శంకర్ ఆధ్వర్యంలో స్వామివారికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పండ్లతో పంచామృతాల అభిషేకం చేపట్టారు. వారు మాట్లాడుతూ భక్తితో పూజలు చేసిన ప్రతి ఒక్క భక్తునికి స్వామి వారి ఆశీస్సులు లభిస్తాయని వారన్నారు. మండలంలోని అయ్యప్ప స్వామి భక్తులు ఈ నెల 30వ తేదీన మండల కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ ధర్మశాస్త్ర హరి హర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయం, శబరి పీఠంలో నిర్వహించనున్న మహాపూజకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై శ్రీ పూర్ణ పుష్కల సమేత హరిహరపుత్ర అయ్యప్ప స్వామి కలిశ ఊరేగింపులో పాల్గొని దిగ్విజయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు భానుచందర్, సునీల్, ముద్దం రాము, కొండమోళ్ల నరేష్, శెట్టి వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

# వాజ్‌పేయి ఆశయ సాధనే లక్ష్యం

### కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలపై నిప్పులు చెరిగిన నేతలు

ప్రజాపక్షం/వనపర్తి టౌన్ : దేశాభివృద్ధికి నిబద్ధత, నిజాయితీతో బాటలు వేసిన మహనీయుడు భారతరత్న, మాజీ ప్రధాన అటల్ బిహారీ వాజ్‌పేయి అని, ఆయన ఆశయ సాధనే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు శాంత కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని లక్ష్మి కృష్ణ గార్డెన్‌లో బిజెపి ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం, నూతనంగా ఎన్నికైన స్థానిక సంస్థల ప్రతినిధుల సన్మానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమం ను ఉద్దేశించి శాంత కుమార్ మాట్లాడుతూ. వాజ్పేయి జయంతిని పురస్కరించుకొని ఆయన సేవలను పురస్కరించుకొని ఆయన సేవలను స్మరించుకున్నారు. ''సర్వ శిక్ష అభియాన్ ద్వారా ప్రాథమిక విద్యను సామాన్యులకు అందించడంలో, గ్రామీణ మౌలిక వసతల కల్పనలో అటల్ జీ కీలక పాత్ర పోషించారు'' అని కొనియాడారు. ఈ సందర్భంగా గెలుపొందిన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లను పార్టీ తరపున ఘనంగా సన్మానించారు. ఓట్ల చోరీకి పాల్పడింది సోనియా గాంధీనే, భరత్ ప్రసాద్ ముఖ్య వక్తగా విచ్చేసిన బిజెపి రాష్ట్ర కార్యదర్శి పోతుగంటి భరత్ ప్రసాద్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు మాట్లాడుతూ వనపర్తిలో తామే కేసీఆర్ అని విర్రవీగుతున్న నాయకులకు, అవినీతికి పాల్పడుతున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ప్రజలు త్వరలోనే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో బీఆర్ఎస్ పార్టీని భూస్థాపితం చేసే వరకు విశ్రమించబోమని ఆయన స్పష్టం చేశారు. ప్రధాని మోడీ నాయకత్వంలో దేశం గర్వించేలా పని చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు డి. నారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయ్యం ప్రభాకర్ రెడ్డి, సుబ్బిరెడ్డి, వెంకట్ రెడ్డి, మాజీ జడ్పి చైర్మన్ లోకనాథ్ రెడ్డి, మున్నూరు రవీందర్, పురుషోత్తం, శ్రీశైలం, శ్రీనివాస్ గౌడ్, పెద్దిరాజు, కల్పన, రామన్ గౌడ్, కేతూరి బుడ్డన్న, కుమారస్వామి, ఆగపోకు కుమార్, గజరాజుల తిరుమలేష్ తదితర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మదాసి కురువలు రాజకీయంగా ఉన్నత స్థాయికి చేరుకోవాలి



### నడిగడ్డ హక్కుల పోరాట కమిటీ అధ్యక్షుడు గొంగళ్ల రంజిత్ కుమార్

ప్రజాపక్షం/మక్తల్ : మదాసి కురువ సంఘ సభ్యులు రాజకీయంగా ఉన్నత స్థాయికి చేరుకున్నప్పుడే అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్కరికి అందుతాయని నడిగడ్డ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గొంగళ్ల రంజిత్ కుమార్ అన్నారు. పట్టణంలోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గవ్యాప్తంగా ఎంపికైన మదాసి కురువ నూతన సర్పంచులు, ఉపసర్పంచ్లు, వార్డ్ మెంబర్ల సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై అందరికి శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్‌తో పాటు ముఖ్య నేతలు మాట్లాడుతూ మదాసి కురువలు ఆర్థికంగా విద్యాపరంగా ఎందులోనూ తీసిపోరని, రాబోయే రోజుల్లో అత్యధిక స్థానాల్లో ఎంపీటీసీ, జడ్పిటిసి, సింగిల్ విండో, మున్సిపల్ వార్డు మెంబర్లుగా గెలిచి రాజకీయంగా ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మక్తల్ మార్కెట్ డైరెక్టర్, నారాయణపేట జిల్లా గొర్రెల కాపరుల సంఘం అధ్యక్షులు తంగిడి నాగరాజు, మాజీ జెడ్పిటిసి, జిల్లా మదాసి కురువ సంఘం అధ్యక్షులు వేంకటయ్య, జిల్లా ఉపాధ్యక్షులు నరసింహులు, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, మక్తల్ నియోజకవర్గ అధ్యక్షులు ఓబులాపూర్ అంజప్ప, నారాయణపేట నియోజకవర్గ అధ్యక్షులు హనుమంతు, మక్తల్ మండల అధ్యక్షులు కురువ లింగం, మాగనూరు మండల అధ్యక్షులు యుగంధర్, కృష్ణ మండల అధ్యక్షులు మహాలింగ, ఉట్కూరు మండల అధ్యక్షులు పోర్ల లింగప్ప, కుల పెద్దలు భూత్పూర్ హనుమంతు, ముసలాయపల్లి రాజు, గజలప్ప, హిందూపూర్ శంకర్, సంఘం సభ్యులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# తక్కువ కాలంలోనే ప్రజల నుంచి వ్యతిరేకత

### నూతన సర్పంచ్‌ల అభినందన సభలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి




ప్రజాపక్షం/వనపర్తి టౌన్ : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే ప్రజల వ్యతిరేకతను మూటగట్టుకుందని మాజీ మంత్రి సింగిరెడ్డి, నిరంజన్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి తన నివాసం నుండి పార్టీ కార్యాలయం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించిన అనంతరం, నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు నిర్వహించిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. జురాల ప్రాజెక్టు నుండి 45 రోజుల పాటు వరద నీరు వృధాగా సముద్రం పాలవుతున్నా, కేఎల్ఐ మోటార్లు ఆన్ చేయకుండా ప్రభుత్వం రైతుల పొట్ట కొట్టిందని నిరంజన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తాము కర్ణాటకతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరిపి క్రాప్ హాలిడే లేకుండా చూశామని, కానీ నేటి పాలకులు చేతగాక సాగు విరామం ప్రకటిస్తున్నారని దుయ్యబట్టారు. జిల్లాలో రైతులు సాగునీరు లేక కష్టపడుతుంటే, ఇక్కడి మంత్రి తన కుటుంబంతో సోమశిలలో విహారయాత్రలు చేయడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేసే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పనులను కాంగ్రెస్ ప్రభుత్వం పడకేయించిందని, గడిచిన రెండేళ్లలో కనీసం తట్టెడు మన్ను కూడా తీయలేదని విమర్శించారు. కృష్ణా జలాల్లో మన వాటా సాధించుకునేందుకు జనవరిలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఇటీవల జరిగిన పంచాయితీ ఎన్నికల్లో సోలీపూర్, సవాయి గూడెం వంటి చోట్ల బీఆర్ఎస్ అభ్యర్థులు గెలిచినట్లు ప్రకటించి, ఆ తర్వాత కాంగ్రెస్ ఒత్తిడితో ఫలితాలు తారుమారు చేశారని ఆరోపించారు. దీని పై ఇప్పటికే కోర్టులో కేసులు వేశామని, త్వరలోనే న్యాయం జరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. ''పెట్టుబడి లేని వ్యాపారం అంటే ఇతరులను విమర్శించడమే. దాన్ని కాంగ్రెస్ నాయకులు నమ్ముకున్నారు'' అని మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి విమర్శించారు. సర్పంచులు రాజ్యాంగబద్ధమైన అధికారాలను తెలుసుకోవాలని, ప్రతి మూడు నెలలకు ఒకసారి గ్రామసభలు నిర్వహించాలని సూచించారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నీరు ఇస్తే, ఈ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ చేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, పట్టణ అధ్యక్షులు రమేష్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మారెడ్డి, ఇతర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉపసర్పంచ్‌ను సన్మానించిన మంత్రి

ప్రజాపక్షం/వీపనగండ్ల: వీపనగండ్ల గ్రామ ప్రజల విశేష ఆదరణతో ఉపసర్పంచుగా ఎన్నికైన మధుగని బాలపీర్‌ను రాష్ట్ర ఎక్సైజ్, సాంస్కృతిక మరియు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శాలువాతో సన్మానించారు. ఉపసర్పంచుగా ఎన్నికైన అనంతరం బాలపీర్, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి హైదరాబాదులో మంత్రి జూపల్లిని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో ప్రజాప్రతినిధులు చురుకైన పాత్ర పోషించాలని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సేవాభావంతో పనిచేయాలని సూచించారు. గ్రామాభివృద్ధి దిశగా ఉపసర్పంచు బాలపీర్ మరింత కృషి చేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బసవరాజు గౌడ్, కే.బాలపీర్ పాల్గొన్నారు.

# స్థానికం

REGIONAL NEWS




నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ బదిలీ



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌ను బదిలీ చేస్తూ గురువారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నారాయణ్‌అమిత్‌ను నారాయణ్‌పేట జిల్లా అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్)గా పదోన్నతి కల్పిస్తూ బదిలీ చేశారు. నారాయణ్‌అమిత్ 2024 సెప్టెంబర్ 5న మిర్యాలగూడ సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. తన 15నెలల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను అర్హులైన పేదలకు అందించేలా కృషి చేశారు. రైతులకు మద్దతు ధర అందించేలా నిరంతరం పర్యవేక్షణ చేశారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలు పకడ్బందీగా, ప్రశాంతంగా నిర్వహించడంతో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. మిర్యాలగూడ రెవెన్యూ డివిజన్ పరిధిలో అర్హులైన పేదలకు ప్రభుత్వపరమైన సేవలను అందించి అన్ని వర్గాల ప్రజల మన్ననలను పొందారు.



## అలుపెరుగని పోరాటయోధుడు మూరగుండ్ల లక్ష్మయ్య

**ప్రజాపక్షం/నూతనకల్ (మద్దిరాల) :** ప్రజాపోరాటాలలో ప్రజా ఉద్యమాలలో అలుపెరుగని పోరాట యోధుడు మూరగుండ్ల లక్ష్మయ్య అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. శుక్రవారం మద్దిరాల మండలం ముకుందాపురం గ్రామంలో జరిగిన లక్ష్మయ్య సంతాప సభలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసిన అనంతరం ఆయన మాట్లాడారు. తన కొరకు తను జీవించేవాడు మనిషి, ప్రజల కొరకు జీవించేవాడు మహామనిషి అని కొనియాడారు. ప్రజల సమస్యలే తన సమస్యలుగా ప్రజా జీవితంలో ఉంటూ గ్రామస్థాయి వార్డు మెంబర్ నుంచి, జడ్‌పిటిసి స్థాయి వరకు ఎదిగి ఈ ప్రాంతంలో అనేక ఉద్యమాలు నిర్వహించి ముఖ్యంగా భూ పోరాటం నిర్వహించి కబ్జాలో ఉన్న రైతులకు ప్రభుత్వ హక్కుపత్రాలు ఇవ్వాలని రైతాంగాన్ని సమీకరించి అనేక ఉద్యమాలు నిర్వహించిన ఘనచరిత్ర ఆయనదని గుర్తు చేశారు. చివరి శ్వాస వరకు ఎర్రజెండా నీడలోనే జీవించాడన్నారు. యల్లంల యాదగిరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, బిసి హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయ నాయుడు, యల్లావుల రాములు, కోటగిరి యాదగిరిరావు, ములకలపల్లి రాములు, కంబాల శ్రీనివాస్, బద్దం కృష్ణారెడ్డి, బూర వెంకటేశ్వర్లు, దేగల జనార్ధన్, తొట్ల ప్రభాకర్, గుండు వెంకటేశ్వర్లు, ఆకుల లింగయ్య, బుక్క రాంబాబు, కందాల శంకర్ రెడ్డి, చిలకరాజు శ్రీను, ఉప్పతల కోటమ్మ, మూరగుండ్ల లక్ష్మయ్య, కుమారులు శ్రీనివాస్, సతీష్, ఖమ్మంపాటి అంతయ్య పాల్గొన్నారు.

## నరసింహ్మా మృతి ఎఐటియుసికి తీరని లోటు



**ప్రజాపక్షం/ రామన్నపేట:** మాజీ ఎంపిటిసి, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు, సివిల్ సప్లయ్ హమాలి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిగె నరసింహ్మా మృతి ఎఐటియుసికి, హమాలీ సంఘానికి తీరని లోటని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నరసింహా మృతదేహాన్ని ఆయన సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. దాదాపు 30 సంవత్సరాలుగా సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేసి యాదాద్రి భువనగిరి జిల్లా ఏర్పాటు తరువాత కూడా సంఘానికి జిల్లా కార్యదర్శిగా పనిచేస్తూ అనేక ఉద్యమాలు నిర్వహించారని, యూనియన్ పట్ల ఆయన ఎంతో నిబద్ధతతో ఉండేవారని అన్నారు. నరసింహ్మా అంతిమయాత్రలో హమాలీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆయన వెంట సీపీఐ మండల కార్యదర్శి ఉట్కూరి నరసింహా, ఎఐటియుసి జిల్లా కార్యవర్గ సభ్యులు సామల శోభన్‌బాబు, మండల అధ్యక్షుడు బత్తుల సత్యం, ప్రధాన కార్యదర్శి శివరాత్రి సమ్మయ్య, సివిల్ సప్లయ్ హమాలి యూనియన్ జిల్లా అధ్యక్షుడు పల్లె శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పాపగళ్ల శంకరయ్య, గౌరవంతల శ్రీనివాస వెంకన్న,జగన్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## భువనగిరి అభివృద్ధికి కృషి చేస్తా


భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/బీబీనగర్ :** ఎన్నికల అప్పుడే పార్టీలు గ్రామాల అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం బీబీనగర్ మండల కేంద్రంలో పిఆర్‌జి గార్డెన్‌లో నూతనంగా ఎన్నికైన 17 గ్రామపంచాయతీ సర్పంచులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గత 40 సంవత్సరాల కాలంలో భువనగిరి ఖిల్లా పై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసిన ఘనత పార్టీ కార్యకర్తలకు దక్కిందన్నారు. రాబోవు ఎంపిటిసి ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా పనిచేసి పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేయలన్నారు. భువనగిరి నియోజకవర్గం అభివృద్ధి కోసం నా శాయశక్తుల కృషి చేస్తూ గ్రామాల మౌలిక సదుపాయాలు కల్పిస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలందరికీ తెలియజేయలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు గోలి పింగాల్ రెడ్డి, పంజాల రామాంజనేయులు గౌడ్, ఫోటోల శ్యామ్ గౌడ్, సింగల్ విండో మాజీ చైర్మన్ మెట్టు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## బుద్ధవనంలో ప్రముఖుల సందడి

**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జునసాగర్‌లోని ప్రపంచ ప్రసిద్ధ బుద్ధవనం శుక్రవారం ప్రముఖుల సందర్శనతో కళకళలాడింది. మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి దండపాణి సతీసమేతంగా నాగార్జునసాగర్‌కు చేరుకుని బుద్ధవనాన్ని సందర్శించారు. విజయ విహార్ టూరిజం వసతి గృహానికి చేరుకున్న న్యాయమూర్తి దంపతులకు రెవెన్యూ ప్రోటోకాల్ అధికారి దండ శ్రీనివాస్ రెడ్డి, సాగర్ ఎస్‌ఐ ముత్తయ్య, నిడమనూరు కోర్టు ప్రోటోకాల్ సిబ్బంది మహేందర్ రెడ్డి, కాలిక్‌లు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు నాగార్జునసాగర్ ప్రధాన డ్యామ్, ప్రధాన జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించారు. తదుపరి బుద్ధవనాన్ని వీక్షించారు.ఇదే రోజున ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైల్వే కోర్టు న్యాయమూర్తి రమాదేవి, నల్గొండ జిల్లా ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ పవన్ కుమార్ కుటుంబ సమేతంగా బుద్ధవనాన్ని సందర్శించారు. స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ బుద్ధవనం చారిత్రక విశేషాలను వారికి వివరించారు. ఈ సందర్భంగా బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్రలు అతిథులను బుద్ధవనం కండువాలు, బ్రోచర్లతో సత్కరించారు.



# భారత గడ్డపై ఎర్రజెండాకు వందేళ్లు

### పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ఎర్రజెండా: ఆవిర్భావ దినోత్సవంలో నర్సింహారెడ్డి





**ప్రజాపక్షం/దేవరకొండ:** సామ్రాజ్య వాదులకు వ్యతిరేకంగా, భూస్వామ్య, పెట్టుబడిదారి వర్గాలకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమాలు నిర్వహించిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)ది అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. సిపిఐ 101వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం దేవరకొండలోని కామ్రేడ్ పల్లా పర్వత్‌రెడ్డి భవన్ సిపిఐ కార్యాలయంలో సిపిఐ జెండాను ఆయన ఎగరవేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 వసంతాల ఉత్సవాల ముగింపు సందర్భంగా జనవరి 18న ఖమ్మంలో బహిరంగ సభ ఉంటుందని ఈ భారీ బహిరంగ సభకు దేశ నలుమూలల నుండి 5 లక్షల మంది కామ్రేడ్స్ పాల్గొంటున్నారని , దేవరకొండ నియోజకవర్గం నుండి ప్రజలు అధిక సంఖ్యలో ఈ సభకు తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, మండల కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, మండల సహాయ కార్యదర్శి రామస్వామి, పట్టణ కార్యదర్శి ఆంజనేయులు, మండల కార్యవర్గ సభ్యులు రంగారెడ్డి, స్థులోచన, వెంకట్రాములు, రాంరెడ్డి, యాదయ్య,మాధవరెడ్డి, వెంకటయ్య, మైనోద్దీన్, వెంకటేశ్వర్‌రావు, సర్పంచ్ భారతిధర్మనాయక్, శాఖ కార్యదర్శులు జ్యోతిబస్, నగేష్, భూపాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకటయ్య, శివకుమార్; రామాంజనేయులు, గోపి, గోవర్ధన్, నర్సింహా, భారీములు, బుచ్చయ్య, నగేష్, బద్దీ,జంగయ్య,అంజమ్మ, లక్ష్మీ పాల్గొన్నారు.

### పేదల కోసం పోరాటాలు చేసిన సిపిఐ : ఉస్తెల సృజన

**ప్రజాపక్షం/చింతలపాలెం (మేళ్లచెరువు) :** పేదల కోసం గత వంద సంవత్సరాలుగా పోరాటాలు చేసిన ఏకైక పార్టీ సిపిఐ అని రాష్ట్ర మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఉస్తెల సృజన అన్నారు. శుక్రవారం సిపిఐ పార్టీ ఆవిర్భవించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా మేళ్ళచెరువు మండల కేంద్రంలోశతాబ్ధి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పేదల కోసం పార్టీ చేసిన పోరాటాలను గుర్తు చేశారు. అనంతరం పార్టీ ఆశయ సాధన కోసం కృషి చేస్తామని అందరూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ మండల కార్యదర్శి భద్రారెడ్డి, పార్టీ నేతలు పాపిరెడ్డి, ఎలమంద, కోటమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఇంటింటికీ సిపిఐ కార్యక్రమం

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆవిర్భవించి 100 ఏళ్లు పూర్తి చేసుకుని, 101వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా యాదగిరిగుట్ట పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరాములు అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఇంటింటికీ సిపిఐ కార్యక్రమం ప్రారంభం పార్టీ శత జయంతిని పురస్కరించుకుని యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని 12 వార్డుల్లో ప్రజా సమస్యల గుర్తింపు కోసం 'ఇంటింటికీ సిపిఐ' కార్యక్రమాన్ని ప్రారంభించారు. 1వ వార్డు హనుమాన్ టెంపుల్ నుండి ప్రారంభించి 4వ వార్డు వరకు పర్యటించి ప్రజల ఇబ్బందులను తెలుసుకున్నారు. రేపు 8వ వార్డు నుండి 5వ వార్డు వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని నాయకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, కొల్లూరి రాజయ్య, పేరబోయిన మహేందర్, మండల కార్యదర్శి కల్లెపెల్లి మహేందర్, పట్టణ కార్యదర్శి బబ్బూరి శ్రీధర్, మాజీ కోఆప్షన్ సభ్యులు పేరబోయిన పెంటయ్య పాల్గొన్నారు.



# నూతన సంవత్సర వేడుకలు నిర్వహించే వారికి జాగ్రత్తలు

సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె. నరసింహ్మా



**ప్రజాపక్షం/సూర్యాపేట :** నూతన సంవత్సర వేడకలు నిర్వహించే వారు జాగ్రత్తలు పాటించి ప్రమాదాలకు దూరంగా ఉంటూ పిల్లలు, పెద్దలు అందరూ వారి ఇండ్లలో ఉత్సవాలను జరుపుకుంటూ పోలీసు వారి సూచనలను పాటించాలని జిల్లా ఎస్‌పి కె నరసింహ తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండ పోలీసు శాఖ తరపున భద్రత ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. డిసెంబర్ 31 రాత్రి వేడుకలు నిర్వహించుకునే నూతన సంవత్సర వేడుకల సందర్భంగా జిల్లా పోలీస్ యంత్రాంగం పటిష్టమైన బందోబస్త్, నిత్యం పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోను డ్రంక్ అండ్ డ్రైవింగ్ తనిఖీలు నిర్వహించబడుతాయని చెప్పారు. అలాగే ప్రజలకు ఇబ్బందులకు గురిచేసే విధంగా బహిరంగ ప్రదేశాల్లో నూతన సంవత్సర వేడుకలను నిర్వహిస్తే తగు చర్యలు తీసుకోవడం జరుగుతుంది, వేడుకలు జరుపుకునే వారు కుటుంబంతో కలిసి ఇంట్లోనే ఉత్సవాలు జరుపుకోవడం మంచిదన్నారు.

**పోలీసుల సూచనలు నిబంధనలు...** డిసెంబర్ 31 రాత్రి ఆర్గనైజ్డ్‌గా ఏర్పాట్లు చేయడానికి పోలీసు అనుమతి లేదు. ఉత్సవం జరుపుకునే వారు ఇండ్లలో కుటుంబ సభ్యులతో జరుపుకోవడం మంచి అలవాటు. పిల్లలపట్ల జాగ్రత్తలు పాటించాలి, మైనర్స్‌కు వాహనాలు ఇవ్వడం చట్టరిత్యా నేరం. టపాసులు, డిజెలు నిషేధం. మద్యం మత్తులో వాహనాలు నడపడం నేరం, వాహనాలు వేగంగా నడపవద్దు. రహదారులు బ్లాక్ చేసి ఉత్సవాలు చేయవద్దు. మహిళలపట్ల అసభ్యకరంగా ప్రవర్తించవద్దు, ఇతరులకు ఇబ్బంది కలిగించవద్దు. ఇల్లు, ప్రైవేటు ఆస్తులపై, వీధి దీపాలపై రాళ్లు వేయడం, అద్దాలను పగలగొట్టడం నేరం. ర్యాష్ డ్రైవింగ్, బైక్ రేసింగ్, త్రిబుల్ రైడింగ్, సైలెనర్సర్‌లను తీసివేసి వాహనాలు నడపడం, శబ్దకాలుష్యం చేస్తూ ఇతరులను ఇబ్బంది పెడితే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. న్యూ ఇయర్ వేడుకలలో నిషేధిత డ్రగ్స్, గాంజా వంటి మత్తు పదార్థాలు విక్రయించిన, వినియోగించిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. మద్యం దుకాణాలు నిర్ణీత సమయంలో క్లోజ్ చేయాలి, మైనర్లకు మద్యం అమ్మకూడదు. బహిరంగ ప్రదేశాల్లో, ప్రభుత్వ స్థలాల్లో మద్యం సేవిస్తే కేసులు పెడుతాం. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసే ఎలాంటి కార్యక్రమాలు అయినా సరే నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు అధికారుల నుండి ముందస్తు అనుమతులు తీసుకోవాలి. న్యూఇయర్ ఆఫర్ల పేరిట సైబర్ నేరగాళ్లు ఆర్థిక నష్టం కలిగించే అవకాశం ఉన్నది కావున ఆన్‌లైన్ నందు, అపరిచితులతో వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ అకౌంట్ వివరాలు, పిన్ నంబర్లు ఇవ్వవదన్నారు. అంక్షల ను అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. అత్యవసర సమయంలో స్థానిక పోలీసు అధికారులకు, డయల్ 100కు ఫోన్ చేసి పోలీసు సేవలు ఉపయోగించుకోవాలని కోరారు.

## కెటిఆర్ ది 'మేనేజ్‌మెంట్ కోటా'.. రేవంత్ రెడ్డిది 'మెరిట్ కోటా'!

ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/యాదాద్రి :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అవాకులు చవాకులు పేలుతున్న బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌పై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ కేటీఆర్ రాజకీయ ప్రస్థానంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. 'నువ్వు మేనేజ్‌మెంట్ కోటాలో రాజకీయాల్లోకి వచ్చి మంత్రివి అయ్యావు కానీ రేవంత్ రెడ్డి జడ్పీటీసీ నుంచి ఎంపీ వరకు స్వతంత్రంగా గెలిచి, మెరిట్ కోటాలో ముఖ్యమంత్రి అయ్యారు అని ఎద్దేవా చేశారు. 'కట్టే, కొట్టే, తెచ్చే' అనే సామెత కేవలం కేసీఆర్ కుటుంబానికే వర్తిస్తుందని ఎంపి విమర్శించారు. ఉద్యమకారుని వేషంలో వచ్చి, పిట్టకథలు చెప్పి అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని మండిపడ్డారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో తెలంగాణ ప్రజలను పదేళ్లు వంచించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైడ్రా: బీఆర్‌ఎస్ హయాంలో నాళాలు, పార్కులను కబ్జా చేసి 'దండుపాళ్యం ముఠా'లా దోచుకున్నారని, ఆ కబ్జాలను తొలగిస్తుంటే ప్రజలు సంతోషపడుతున్నారని ఎంపి తెలిపారు. మీరు గొప్పగా చెప్పుకున్న కాళేశ్వరం ప్రాజెక్టులో మీ అవినీతిని బయటపెట్టడానికే దేవుడు మేడిగడ్డ పిల్లర్లను కుంగేలా చేశారని వ్యాఖ్యానించారు. కేటీఆర్‌ను 'ఐరన్ లెగ్'గా అభివర్ణిస్తూ, ఆయన నాయకత్వంలోనే పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ పార్టీకి 'గుండు సున్నా' వచ్చిందని చామల విమర్శించారు. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రజలు కేటీఆర్‌కు బుద్ధి చెప్పారని గుర్తు చేశారు. 2023లో ఓడించినట్లుగానే, 2029లో కూడా రేవంత్ రెడ్డి చేతిలో బీఆర్‌ఎస్కు పరాభవం తప్పదని హెచ్చరించారు.

## రాజేష్ కుటుంబానికి ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ అండ : బుక్కి వెంకటయ్య



**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ పట్టణంలోని కర్ల రాజేష్ కుటుంబాన్ని శుక్రవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిసన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పరామర్శించారు. రాజేష్ మృతికి దారితీసిన పరిస్థితులను ఆయన తల్లి లలితమ్మను అడిగి తెలుసుకున్నారు. పుట్టెడు దుఖంలో ఉన్న ఆమెను ఓదార్చుతూ న్యాయం జరిగే వరకు కమిసన్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఘటనపై వారం రోజుల్లోగా సమగ్ర విచారణ జరిపి నివేదిక అందించాలని జిల్లా కలెక్టర్, ఎస్‌పిలను అదేశించినట్లు తెలిపారు. బాధ్యులైన పోలీస్ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ఇప్పటి వరకు సిఐని సస్పెండ్ చేశారని, మిగిలిన వారిపై కూడా విచారణ జరిపిస్తామని అన్నారు. ప్రభుత్వం నుంచి రూ. 4,12,000 చెక్కును తల్లి లలితమ్మకు అందజేశారు. మిగిలిన మొత్తాన్ని త్వరలనే అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, నివసించేందుకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాజేష్ మృతికి కారణమైన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు శంకర్, జిల్లా సంక్షేమ అధికారి దయానందరాణి, కోదాడ ఆర్డీవో సూర్యానారయణ, తహసిల్దార్ వాజీద్‌అలీ, ఎమ్మార్పీఎస్ నాయకులు రాజు పాల్గొన్నారు.

## యూరియా స్లాట్ కోసం కష్టాలు

**ప్రజాపక్షం/మర్రిగూడ :** ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ఫర్టిలైజర్ బుకింగ్ యాప్‌తో రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. కొంతమంది అన్నదాతలు యూరియా కోసం స్లాట్ ఎలా బుక్ చేసుకోవాలో తెలియక ఇబ్బంది పడుతున్నారు. మర్రిగూడ మన గ్రోమోర్ సెంటర్ యూరియా కోసం వచ్చిన రైతులు స్లాట్ బుకింగ్ గురించి తెలియక చాలామంది వెనక్కి వెళ్లారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రైతులకు గ్రామాల వారిగా అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.

## మావోయిస్టు నేత ఉయితే గణేష్ @ హనుమంతు ఎన్‌కౌంటర్


ఒడిశాలో కేంద్ర కమిటీ సభ్యుడు పాక హనుమంతు మృతి



**ప్రజాపక్షం/నల్లగొండ:** ఒడిశాలోని కందమాల్ జిల్లా చరపాద్ అడవుల్లో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు,ఒడిశా రాష్ట్రకమిటీ కార్యదర్శి పాక హనుమంతు అలియాస్ ఉయితే గణేష్ (64) సహా నలుగురు మావోయిస్టులు మరణించారు. మృతుల్లో ఇద్దరు మహిళలు ఉన్నారు. ఘటనా స్థలం నుంచి ఒక ఏకే 47, రెండు ఇన్సాస్,300 తుపాకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మరణించిన మరో ముగ్గురిని గుర్తించాల్సి ఉందని పోలీసులు తెలిపారు.హనుమంతుపై రూ.1.10 కోట్ల రివార్డు ఉందని పేర్కొన్నారు.కందమాల్ జిల్లాలోనే బుధవారం సాయంత్రం జరిగిన ఎన్ కౌంటర్‌లో ఒడిశా ఏరియా కమిటీ సభ్యుడు రాకే శ్.ప్లటూన్ సభ్యుడు అమృత్ మరణించారు. వీరి వద్ద నుంచి 303 రైఫిల్,వాక్ బాకీలు స్వాధీనం చేసుకున్నారు.

**పుల్లెంల నుంచి మావోయిస్టు అగ్ర నేతగా ఎదిగిన హనుమంతు**

పాక హనుమంతు స్వస్థలం నల్లగొండ జిల్లా చండూరు మండలం పుల్లెంల గ్రామం. పాక చంద్రయ్య, ఎటమ్మ దంపతుల అడుగురు సంతానంలో హనుమంతు ఒకరు.1981లో నల్లగొండలోని ఎన్‌జి కాలేజీలో డిగ్రీ చదువుతున్న క్రమంలో రాడికల్ స్టూడెంట్ యూనియన్లో పని చేశాడు.అదే ఏడాది మార్చి 30న జరిగిన ఏబివిపి నాయకుడు ఏచూరి శ్రీనివాస్ హత్య కేసులో హనుమంతు కూడా నిందితుడు ఆహత్య తర్వాత ఆయన పీపుల్వర్ పార్టీలో చేరి అజ్ఞాతంలోకి వెళ్లాడు. హనుమంతుది బూటకపు ఎన్‌కౌంటర్ అని భారత న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు గుర్రం వెంకట్ రెడ్డి ఆరోపించారు. వృద్ధాప్యంలో ఉన్న వ్యక్తిని పట్టుకొని చట్టానికి అప్పించవలసింది పోయి పట్టుకొని చంపేసి ఎదురు కాల్పుల్లో చనిపోయారని పోలీ ములు కట్టుకథలు అల్లారని విమర్శించారు.



# సాఫ్ట్‌వేర్ కొలువు వీడి.... సర్పంచ్ బాట!

### కాసులు కురిపిస్తున్న కొలువు కాదని... పల్లె ప్రజలకు సేవ చేయాలని తలచి... రాజకీయ అరంగేట్రం చేసిన వంశీ కృష్ణారెడ్డి





**ప్రజాపక్షం/హాలియా:** విలాసవంతమైన జీవితం ఒకవైపు... చేతినిండా కాసులు కురిపించే సాఫ్ట్ వేర్ ఉద్యోగం మరోవైపు ఉన్నా ఏదో తెలియని వెలితి ఆ యువకుడ్ని వేధించేది... అమ్మ తండ్రి న్యాలకొండ రామకిషన్ రావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీలో కరీంనగర్ జిల్లా నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా,ఒకసారి రాష్ట్రమంత్రిగా పనిచేసిన రాజకీయ కుటుంబం కాగా తండ్రి తరఫున తన నాయనమ్మ ఎడవల్లి వసుమతి దేవి ఇబ్రహీంపేట సర్పంచ్ కాగా తన తల్లి ఎడవల్లి అనుపమ నరేందర్ రెడ్డి హాలియా మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పనిచేసిన చరిత్ర ఉంది.రాజకీయ నేపథ్యం కలిగిన కుటుంబంలో పుట్టిన ఆ యువకునికి తల్లి లాంటి పల్లె తల్లికి సేవ చేయాలని కోరిక ఉన్నప్పటికీ సమయ సందర్భం ఏది రాకపోవడంతో... అడపాదడపా గ్రామంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటూ... తనకు అవకాశం వచ్చినప్పుడు తాను పుట్టిన గడ్డకు సేవ చేసి ఆతల్లి రుణం తీర్చుకుంటానని మనసులో అనుకున్నాడీ యువ నేత ఎడవల్లి వంశీ కృష్ణారెడ్డి చదువుకుంటూనే పలు దేశాలు తిరిగి ఆయా దేశాల సంసృతులను నేర్చుకొని అమెరికాలో ఉన్నతమైన ఉద్యోగం సాధించాడు. చిన్న వయసు ఆకర్షణీయమైన జీవితం... ఎంతో ఉన్నతమైన స్థానాలకు చేరగలిగే సామర్థం కలిగిన వంశీ కృష్ణ మనసు మాత్రం తాను పుట్టిన పల్లె అయినటువంటి ఇబ్రహీంపేట పైనే ఉంది.అనుకున్నదే తడువుగా హాలియా మున్సిపాలిటీలో భాగమైన ఇబ్రహీంపేట గ్రామం ఇటీవల మున్సిపాలిటీ నుండి వేరు చేయబడి స్వతంత్ర గ్రామ పంచాయతీ గా ఏర్పడింది. రిజర్వేషన్ల ప్రకారం ఇబ్రహీంపేట జనరల్ రిజర్వ్ కావడంతో పల్లె తల్లి తనకు సేవ చేయాలంటూ ఎడవల్లి వంశీకృష్ణ తలుపు తట్టింది. మూడో తరం వ్యక్తిగా ఎడవల్లి నారాయణరెడ్డి కుటుంబం నుంచి ఎడవల్లి వంశీ కృష్ణారెడ్డి రాజకీయ అరంగేట్రం చేశాడు. మొదట తన నాయనమ్మ సర్పంచ్ గా, తన తల్లి హాలియా మున్సిపల్ చైర్ పర్సన్ గా మూడోతరం వ్యక్తిగా ఎడవల్లి వంశీకృష్ణారెడ్డి ఇబ్రహీంపేట కాంగ్రెస్ పార్టీ మద్దతుతో సర్పంచ్ బరిలో దిగారు. ప్రత్యర్థికి ఎంతో రాజకీయ అనుభవం ఉన్నప్పటికీ యువకుడైన వంశీ కృష్ణ తన తోటి యువతతో కలిసిమెలిసి తిరగడం అన్ని వర్గాల ప్రజలతో మమేకం కావడం అతనికి గ్రామం పై పట్టు చిక్కింది. ఓటర్ నాడీ కనిపెట్టగల సామర్థం కలిగిన వంశీ కృష్ణ ఎక్కడ తడబడకుండా ఎవరిని మాటలు చెప్పిన వాటిని వింటూనే తను చేయదలచిన కర్తవ్యాన్ని ఎక్కడ విస్మరించకుండా చిరునవ్వుతో ముందుకు సాగారు. అన్ని వర్గాల ప్రజలకు నేనున్న అంటూ భరోసా కల్పించి యువత మనసుల్లో చెరగని ముద్ర వేశారు. వృద్ధుల్లో పట్టున్న ప్రత్యర్థికి కూడా అర్థం కాకుండా వృద్ధులను సైతం తన వైపు తిప్పుకొని తన చాకచక్యంతో ఓట్లు రాబట్ట కలగడం అతని విజయ రహస్యంగా చెబుతారు. ఏదేమైనా రాజకీయ నేపథ్యం కలిగిన కుటుంబం నుంచి వచ్చినప్పటికీ తన రాజకీయ రంగ ప్రవేశం విజయంతో ప్రారంభం కావాలనే గట్టిపట్టుదలతో అందరి సహకారంతో విజయ దుందుభి మోగించారు. ఎన్నికల సమయంలో వివిధ స్థాయిల ప్రజలకు తాను ఇచ్చిన మాటను తప్పకుండా నిలబెట్టుకుంటానని గ్రామ అభివృద్ధిలో తన ప్రాధాన్యత ఏ పాటిదో చూపిస్తానని ప్రమాణ స్వీకారం రోజు అందరికీ మాట ఇచ్చారు.

# కమ్యూనిజం అజేయం..అజరామరం

## ఘనంగా సిపిఐ వందేళ్ల ఉత్సవాలు


భద్రాద్రి కొత్తగూడెంలో...


మహబూబాబాద్‌లో..

**ప్రజాపక్షం/హనుమకొండ :** దేశ సమగ్రత కోసం ఉద్యమిస్తున్నదని కమ్యూనిస్టులేనని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం సిపిఐ వంద సంవత్సరాల ఆవిర్భావ వేడుకలు హనుమకొండ బాలసముద్రం లోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యాలయం ఎదుట సిపిఐ పతాకాన్ని తక్కళ్లపల్లి ఎగురవేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పోతరాజు సారయ్య, పార్టీ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, నేదునూరి రాజమౌళి, ఎన్. అశోక్ స్టాలిన్, మునిగాల బిక్షపతి, బాషబోయిన సంతోష్, మాలోతు శంకర్ నాయక్, కండె నర్సయ్య, యాళ్ల సంజయ్, గుంటి రాజేందర్, కొట్టె వెంకటేష్, లక్ష్మి, గిన్నారపు రోహిత్, రాము తదితరులు పాల్గొన్నారు.

**వరంగల్ :** మతోన్మాదుల మెడలు వంచే శక్తి కమ్యూనిస్టులకే ఉన్నదని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా అన్నారు. సిపిఐ జిల్లా పార్టీ కార్యాలయం తమ్మెర భవన్‌లో సిపిఐ శత వారోత్సవాల సందర్భంగా సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా


జనగాంలో..


నల్లగొండలో..

సహాయ కార్యదర్శులు దండు లక్ష్మణ్, పనాస ప్రసాద్, నాయకులు గన్నారపు రమేష్, ల్యాదల శరత్, ఓర్సు రాజు, తాళ్లపల్లి జాన్ పాల్, యాకాహ్మాచారి, భవాని, చిట్యాల సువర్ణ, పార్థసారథి, రాజేందర్, నల తీగల కుమార్, జట్టి విజయ లక్ష్మి, వనం సౌందర్య, జన్ను రాజు, చిరంజీవి, కుమార్, తీగల రాజేందర్, బిర్రు ప్రభాకర్, భాషెట్టి రంజిత్, తస్లీమ్ తదితరులు పాల్గొన్నారు.

### చరిత్రలో నిలిచిపోయేలా జనవరి 18న బహిరంగ సభ

**ఖమ్మం :** కమ్యూనిజం అజేయం... అజరామరమని మరో వందేళ్లు ప్రజల హృదిలో కమ్యూనిజం నిలిచి ఉంటుందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిపిఐ పతాకాన్ని హేమంతరావు ఆవిష్కరించగా పార్టీ కార్యాలయం గిరిప్రసాద్ భవన్ పై పార్టీ పతాకాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఆవిష్కరించారు. అనంతరం గిరిప్రసాద్ భవన్‌లో మందడపు రాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాగం మాట్లాడారు. సభలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా కార్యదర్శి దండి సురేష్, జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రాబాబు, ఎస్‌కె జాని మియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, అజ్మీర రామ్మూర్తి పాల్గొన్నారు.


రంగారెడ్డి సరూర్‌నగర్‌లో...

### కార్మికులను బాధల నుండి విముక్తి చేసేది ఎర్ర జెండాయే

**జనగామ :** కార్మికులు, కష్టజీవులను బాధల నుండి విముక్తి కలిగించేది ఎర్ర జెండా మాత్రమే అని సిపిఐ జనగామ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి అన్నారు. సిపిఐ శత వార్షికోత్సవాల ముగింపు సందర్భంగా జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయం గబ్బెట గోపాల్‌రెడ్డి భవన్‌లో ఎర్రజెండా ఎగరవేసి అనంతరం చామకూర యాకూబ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాజారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో లింగం రవి, దొడ్డిపట్ల రవీందర్, జోగుల ఆంజనేయులు, కోడి వెంకటేశం, కంచె పోశం, కొత్తపల్లి మహేష్, బొడ్డు లచ్చన్న, లింగమూర్తి, నవీన్, మూడ సుధాకర్, సర్వ శ్రీనివాస్, బాలసాని లక్ష్మణ్, సారంగపాణి, రాకేష్, ఉయ్యాల శంకర్, రాజుకుమార్, రియాజ్ పాల్గొన్నారు.

**నిర్మల్ :** భారత కమ్యూనిసుస్టు పార్టీ శత వార్షికోత్సవ వేడుకలు నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఇంద్రనగర్ సిపిఐ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. సిపిఐ జిల్లా కార్యదర్శి బాక్య రమేష్ పార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి విలాస్, ఎస్.ఎన్.రెడ్డి, కైలాష్, ఉండలేను రాథోడ్, లక్ష్మి, నాయకులు రజితలక్ష్మి, పూర్ణ లక్ష్మి,చిట్యాల లక్ష్మి,కోట్ల నారాయణ, కోట్ల భూమన్న, లింగన్న, నల లక్ష్మణ్ పాల్గొన్నారు.

### సిపిఐది చారిత్రాత్మకమైన పోరాటం

**నల్లగొండ :** సామ్రాజవాదం, భూస్వామ్య పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా, దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం భారత కమ్యూనిస్టు పార్టీ చేసిన పోరాటాలు చారిత్రాత్మకమైనవని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. సిపిఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లాకేంద్రంలోని సిపిఐకార్యాలయం మగ్దూమ్ భవన్‌లో ఎమ్మెల్సీ సత్యం ఎర్రజెండా ఎగురవేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రవణ్ కుమార్, పబ్బు వీరాస్వామి, బొల్గురి నర్సింహా, పట్టణ కార్యదర్శి కర్ర సైదిరెడ్డి, శాంతి సంంఘ జిల్లా కార్యదర్శి జిల్లా యాదయ్య, పట్టణ సహాయకార్యదర్శి వి.లెనిన్, ముండ్ల ముత్యాలు, మదర్, యూసుఫ్, ఐతరాజు శంకర్, దోటి పండరి, అక్కలయ్య, విజయ, పార్వతి, గౌస్ పాల్గొన్నారు.

**నిజామాబాద్ :** ప్రజల్లో మత విద్వేషాలు రెచ్చగొట్టి బిజెపి పబ్బం గడుపుకుంటుందని సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ కాలనీలోని హమాలీ యూనియన్ ఎఐటియుసి కార్యాలయంలో సిపిఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కార్యదర్శులు సుధాకర్, ఓమయ్య మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు రఘురాం, ముత్యాలు, నర్సింగరావు, అనిల్, ఇమ్రాన ఫిరోజ్, రమేష్, రాధకుమార్, అమర్, స్వరూప, భారతి పాల్గొన్నారు.


నారాయణపేటలో...

**యాదాద్రి భువనగిరి :** భారత గడ్డపై వంద సంవత్సరాలుగా వీరోచిత పోరాటాలను నిర్వహించిన ఘన చరిత్ర సిపిఐకి ఉందని పార్టీ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సిపిఐ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా భువనగిరిలోని జిల్లా పార్టీ కార్యాలయంలోఎర్ర జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండీ ఇమ్రాన్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సోమన్న సబిత, పుట్ట రమేష్, సామల శోభన్ బాబు, చింతల మల్లేష్, బద్దం వెంకట్‌రెడ్డి, నరసింహ, వంశీ, కృష్ణా, రమేష్, ముత్యాలు, అంజయ్య, రవీందర్ పాల్గొన్నారు.


పెద్దపల్లిలో...

### మరో వందేళ్లయినా ప్రజాక్షేత్రంలోనే

**భద్రాద్రి కొత్తగూడెం :** మరో వందేళ్లు కూడా ఇదే స్ఫూర్తితో ప్రజాక్షేత్రంలో మనగలమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా అన్నారు. సిపిఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తి కావడంతో జిల్లా వ్యాప్తం గా ఆయా ప్రాంతాల్లో ఎర్రజెండాలు ఎగురవేసి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయం శేషగిరి భవన్, పోస్టాఫీస్ సెంటర్లో సాబీర్‌పాషా అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం జిల్లా కేంద్రంలో వేలాది మందితో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య, దుర్గరాశి వెంకన్న, చంద్రగిరి శ్రీనివాస్, వాసిరెడ్డి మురళీ, కందుల భాస్కర్, ఫయూమ్, వీరస్వామి, జిల్లా సమితి సభ్యులు భూక్యా శ్రీనివాస్, గెద్దాడ నగేష్, మునిగడప వెంకన్న, నెరేళ్ల రమేష్, పోలమూరి శ్రీను, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.


సిద్దిపేటలో...


సిరిసిల్లలో...

### శ్రమజీవుల పేదవాడి పిడికిలి నుంచి పుట్టిందే భారత కమ్యూనిస్టు పార్టీ

**సూర్యాపేటటౌన్ :** శ్రమజీవుల చెమటలోంచి పేదవాడి పిడికిలి నుంచి పుట్టిందే భారత కమ్యూనిస్టు పార్టీ అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయం బొమ్మగాని ధర్మబిక్షం ప్రాంగణంలో జరిగిన సిపిఐ శత వార్షికోత్సవాల కార్యక్రమానికి హాజరై జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు యల్లావుల రాములు, దూళిపాళ ధనుంజయ నాయుడు, కంబాల శ్రీనివాస్, గుండు వెంకటేశ్వర్లు, బూర వెంకటేశ్వర్లు, దేవరం మల్లీశ్వరి, బొమ్మగాని శ్రీనివాస్, దంతాల రాంబాబు, చామల అశోక్ కుమార్, అనంతుల మల్లీశ్వరి, సీనియర్ జర్నలిస్టు దేగల జనార్ధన్, సముద్రాల మనోహర్ బాబు, ఉప్పతల కోటమ్మ, రేగట్టి లింగయ్య, అయితరాజు లింగయ్య, దంతాల పద్మరేఖ, దేశగాని హేమలత, చిలకరాజు శ్రీను, ఎడెల్లి శ్రీకాంత్, కొమ్రరాజు వెంకట్, పరికె భరత్, దీకొండ మనోజ్ తదితరులు పాల్గొన్నారు.


సిపిఐ వందేళ్ల ఉత్సవాలను పురస్కరించుకొని దీపకాంతులతో హైదరాబాద్‌లోని మఖ్దూమ్‌భవన్

**సిద్దిపేట :** పేదల పక్షాన నిరంతరం పోరాటం చేసింది కమ్యూనిస్టులేనని .పోరాటాలా, త్యాగాల చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీదని సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. శుక్రవారం సిపిఐ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఎడ్ల గురువారెడ్డి భవన్‌లో సిపిఐ జెండాను జిల్లా కార్యదర్శి మంద పవన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు జెరిపోతుల జనార్దన్, పట్టణ కార్యదర్శి గజబింకార్ బన్సిలాల్, సహాయ కార్యదర్శులు ఎస్‌కె హరీఫ్, కర్నాల చంద్రం. మిట్టపల్లి సుధాకర్, రామగళ్ల నరేష్, కనకరాజు పాల్గొన్నారు.

**పెద్దపల్లి :** పీడిత వర్గాల విముక్తి కోసమే ఎర్ర జెండా పుట్టిందని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అన్నారు. శుక్రవారం బస్టాండ్ వద్ద సిపిఐ శతవార్షికోత్సవం సందర్భంగా సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో సదానందం ఎర్రజెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో పెద్దపల్లి మండల కార్యదర్శి పూసల రమేష్, సహాయ కార్యదర్శి ఆరెపల్లి మానస్ కుమార్, పట్టణ కార్యదర్శి కల్లేపల్లి నవీన్, బాలసాని లెనిన్, చంద్రగిరి ఉదయ్, పెర్క శివ, పెర్క శ్రీకాంత్, ఆరెపల్లి రాకేష్, కల్లేపల్లి రవి, ఇరుగురాళ్ల వంశీ తదితరులు పాల్గొన్నారు.

**సంగారెడ్డి :** సిపిఐ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి మహబూబ్‌ఖాన్ ఆధ్వర్యంలో పార్టీ జిల్లా కార్యాలయంపై సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ వి.ప్రకాష్ రావు ఆరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఎంఎ రహెమాన్, జిల్లా కౌన్సిల్ సభ్యురాలు అనురాధ, సిపిఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్, బస్తీ పెద్దలు అక్తర్, శోభగౌడ్, ఎండిమహబూబ్‌ఖాన్, వి.ప్రకాశ్‌రావు, ఎం.తాజుద్దీన్, షఫి, ఎంఎ రెహమాన్, మహబూబ్‌ఖాన్ ఎంఎ ఖాజీ, విష్ణువర్ధన్‌రెడ్డి, శంకర్, రవి,గౌస్, పీరోజ్, లక్ష్మణ్ , భూమయ్య, ఆక్తర్ బీరజీయా, యాదమ్మ పాల్గొన్నారు.

**గజ్వేల్ :** పేదల పక్షాన నిరంతరం పోరాడుతూ అంతరాలు లేని సమసమాజస్థాపనే సిపిఐ లక్ష్యమని సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ పేర్కొన్నారు. గజ్వేల్‌లో సిపిఐ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని పార్టీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించి ఇందిరా గాంధీ చౌరస్తా వద్ద సిపిఐ అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో బట్టు దయనందరెడ్డి, జేరిపోతుల జనార్ధన్, శివలింగు కృష్ణ, స్వర్గం రాజేశం, చింత శ్రీను, మిట్టపల్లి సుధాకర్, రామగళ్ల నరేశ్, నర్సింహరెడ్డి, కానుగుల రామనకర్ పాల్గొన్నారు.

**నారాయణపేట :** సిపిఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నారాయణపేట జిల్లా కేంద్రంలో, డాక్టర్ బిఆర్అంబేద్కర్ భవనంలో ఎర్రజెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టి.నరసింహ, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.సంతోష్, మక్తల్ మండల కార్యదర్శి శివన్న, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.సంతోష్, జిల్లా సభ్యులు శివయ్య, నారాయణపేట నాయకులు, తాయప్ప, లింగప్ప, సరోజమ్మ, నారాయణమ్మ, మణెమ్మ, అనంతమ్మ, పద్మమ్మ, సుజాత, మణెమ్మ పాల్గొన్నారు.

### వందేళ్లుగా నిరంతరం పోరాటాలు

**కరీంనగర్ :** అణగారిన వర్గాల హక్కుల కోసం వందేళ్లుగా నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోంది భారత కమ్యూనిస్టు పార్టీయేనని సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ అన్నారు. సిపిఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు అవుతున్న సందర్భంగా కరీంనగర్‌లోని సిపిఐ జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్ వద్ద సిపిఐ జెండాను పంజాల శ్రీనివాస్ ఎగురవేశారు. కార్యక్రమంలో పొనగంటి కేదారి, ఔకసిరెడ్డి సురేందర్ రెడ్డి,న్యాలపట్ల రాజు, పైడిపల్లి రాజు, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, బామండ్లపెల్లి యుగేందర్, బూడిద సదాశివ, బోనగిరి మహేందర్, కొట్టే అంజలి, ఎలిశెట్టి భారతి, గామినేని సత్యం, టి.రామారావు, చెంచల మురళి, కసిబోజుల సంతోష్ చారి, మాడిశెట్టి అరవింద్,బాకం అంజయ్య,తోడేటి శ్రీనివాస్, నగునూరి రమేష్, మామిడిపల్లి హేమంత్ కుమార్, సందీప్‌రెడ్డి, సాంబయ్య పాల్గొన్నారు.

**భూపాలపల్లి :** సమ సమాజ నిర్మాణం కోసం వందేళ్ళు సిపిఐ పోరాటాలు నిర్వహించిందని పార్టీ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. సిపిఐ శతజయంతి వేడుకలు స్థానిక రావి నారాయణరెడ్డి భవన్‌లో కొరిమి రాజ్‌కుమార్ జిల్లా నాయకులతో కలిసి సిపిఐ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి గురుజపల్లి సుధాకర్‌రెడ్డి, గనగల జోగేష్, గడ్డం సింహాద్రి, గోలి లావణ్య, మట్టి కృష్ణ, గంప రాజు, ఎండి.అస్లాం, కుమ్మరి రమేష్ చారి,పల్లెల రజిత, పెద్దమాముల సంధ్య, పోతుగంటి స్వప్న, వాసం రజిత, మట్టి నాగమణి, సుభద్ర తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**మహబూబ్ నగర్ :** సిపిఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సురవరం వెంకట్రాంరెడ్డి భవనం నందు జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి సిపిఐ నాయకుడు ఎం.నరేందర్‌రెడ్డి సిపిఐ జెండా ఎగురవేశారు. పట్టణ కార్యదర్శి కోటకద్ర నరసింహ, పి.సురేష్ కొండపల్లి, రాము, కే.పద్మావతి, మహేష్, సత్యనారాయణరెడ్డి, చాంద్‌భాషా, లక్ష్మణ్, వెంకటయ్య, గంటల శ్రీను ఎస్‌కే దావీద్, ఇందిరక్క, అంజమ్మ, పుష్ప, హరి, నరసింహులు, రమేష్ గౌడ్, బాషా పాల్గొన్నారు.

**కుత్బుల్లాపూర్ :** ప్రజాసమస్యలకు కమ్యూనిజమే పరిష్కారం అని సిపిఐ జాతీయ సమితి సభ్యులు ఎండి యూసుఫ్ పేర్కొన్నారు. శుక్రవారం సిపిఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కుత్బుల్లాపూర్ మండంలోని వివిధ ప్రాంతాలలో సిపిఐ పతాక ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో జిల్లా కార్యదర్శి ఉమామహేశ్, మండల కార్యదర్శి కె.స్వామి, సహాయ కార్యదర్శులు హరినాథ్‌రావు, రాములు, నాయకులు వి.శ్రీనివాస్, మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు హైమావతి, ప్రజానాట్యమండలి అధ్యక్షుడు ప్రవీణ్, బాబు, సదానంద్, సాయిలు, బక్కరి మల్లేష్, కృష్ణ, నరసయ్య, వీరస్వామి, శ్రీనివాస్ చారి, సహదేవరెడ్డి, కె.వెంకటేష్, కొందయ్య, నరేంద్రచారి, నరసింహారెడ్డి, రమేష్, భాస్కర్, యూసుఫ్, రామ్‌రెడ్డి, సుధాకర్, రామచంద్రరెడ్డి, నరేష్, ఇమామ్, చంద్రయ్య పాల్గొన్నారు.

### త్యాగధనుల కృషితో వందేళ్లు

**సరూర్‌నగర్ :** త్యాగధనుల కృషితో వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న భారత కమ్యూనిస్ట్ పార్టీ శతాబ్ధి ఉత్సవాలను విజయవంతం చేయాలని సిపిఐ జాతీయ నాయకులు సయ్యద్ అజీజ్‌పాషా, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్రాచారి కోరారు. శుక్రవారం బాలాపూర్ మండల లెనిన్‌నగర్‌లో మండల కార్యదర్శి ముకుందం గారి చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సయ్యద్ అజీజ్‌పాషా ముఖ్యఅతిధిగా హాజరై పార్టీ జెండా ఆవిష్కరించారు. రంగారెడ్డి జిల్లా కార్యదర్శి బాతరాజునర్సింహా, ఆర్.గోపాల్, మారగోని ప్రవీణ్‌కుమార్‌గౌడ్, జిల్లాల కృష్ణ, మహబూబ్, కమలమ్మ, రమావత్ సక్రునాయక్, గ్యార క్రాంతికుమార్, వినోద్, ఇస్తారి, గౌనియా, నూర్జహా, ఎల్లమ్మ, విజయ పాల్గొన్నారు.

**రాజన్న సిరిసిల్ల :** నిజాం నిరంకుశ పాలనను అంతమొందించిన ఘనత సిపిఐ పార్టీకి ఉందని సిపిఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సిపిఐ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఐ వేములవాడ నియోజకవర్గ ఇంచార్జ్ కడారి రాములు, కేవీ అనసూర్య, అజ్జ వేణు, నల్ల చంద్రమౌళి,వడ్డెపెల్లి లక్ష్మన్, కొంక విజయ్, గాజుల లింగం, అరగొండ శ్రీరాములు, ఆనందం, గాజుల లక్ష్మి, నర్సింగోజీ మారుతి పాల్గొన్నారు.

**మహబూబాబాద్ :** సిపిఐ వందేడ్ల శతాబ్ది ఉత్సవాల సందర్భంగా మహబూబాద్ జిల్లా కేంద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయం వీరభవన్ వద్ద సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి సిపిఐ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బి.అజయ్‌సారధిరెడ్డి, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, కట్లోజు పాండురంగ చారి, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, తండ సందీప్, వీరవెల్లి రవి, వెలుగు శ్రావణ్, ఎండి ఫాతిమా, బానోత్ లింగ్యానాయక్, జలగం ప్రవీణ్, కేదాసు రమేష్, ఆబోతు అశోక్, వంకాయలపాటి చిరంజీవి మహమూద్ పాల్గొన్నారు.

**నస్పూర్:** భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ళ ప్రస్థానంలో ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడుతుందని సిపిఐ రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్ అన్నారు. నస్పూర్ మండల కేంద్రంలో సిపిఐ వందేళ్ళ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పూజారి రామన్న, మిరియాల రాజేశ్వరరావు, జోగుల మల్లయ్య జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, లింగం రవి, దొడ్డిపట్ల రవీందర్,జోగుల ఆంజనేయులు, కోడి వెంకటేశం, కంచె పోశం, కొత్తపల్లి మహేష్, బొడ్డు లచ్చన్న, లింగమూర్తి, నవీన్, మూడ సుధాకర్, సర్వ శ్రీనివాస్, బాలసాని లక్ష్మణ్, సారంగపాణి, రాకేష్ పాల్గొన్నారు.

**వికారాబాద్ :** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పార్టీ ఆవిర్భావించి నేటికి వందేళ్ళు పూర్తి కావడంతో శుక్రవారం వికారాబాద్ జిల్లా, వికారాబాద్ పట్టణంలో, ఎన్టీఆర్ చౌరస్తా వద్ద సిపిఐ జెండాను వికారాబాద్ జిల్లా కార్యదర్శి విజయ లక్ష్మి పండిత్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో యేసు రత్నం, గోపాల్‌రెడ్డి, అనంతయ్య, ఫీర్ మోహమ్మద్, వెంకటేష్, సురేష్, అబ్దుల్లా, ఎన్ఎఫ్ ఏఐడబ్లు జగదాంబ, విమలమ్మ, హనుమంతు, బీరయ్య, నర్సిములు, ఖాదర్ పాల్గొన్నారు.


హన్మకొండలో...


మేడ్చల్...కుత్బుల్లాపూర్‌లో...


గజ్వేల్‌లో...


వరంగల్‌లో..


మంచిర్యాలలో..


నిజామాబాద్‌లో..


భూపాలపల్లిలో..


వికారాబాద్‌లో..


ఖమ్మంలో...


కరీంనగర్‌లో...


యాదాద్రి భువనగిరిలో...


మహబూబ్‌నగర్‌లో...


నిర్మల్...


సూర్యాపేటలో..

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com